అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి : 50 సంచిక : 5 392 జూన్-జులై 2022 పేజీలు: 52 వెల: 20/-రూ॥లు



కిటికీకి ఆవల
గిరికీలు కొడుతున్న సాహస గాథలు
ఉద్వేగంతో వింటున్నం
తెగిపడుతున్న శిరస్సులనుండి
రహస్య పరిమళం రాలిపడుతున్నది
బొట్లుబొట్లుగా



ఆకుపచ్చని దేహంపై పారుతున్న
నులివెచ్చని నెత్తురు మడుగు
ఆశగా అడుగుతున్నది
ప్రశ్న పాతదే
మానవ మాత్రులారా మీ
మౌనం
బద్దలయ్యే రోజెపుడని

ఈ తరానికి చెరబండరాజు సాహిత్యం



మట్టి పిసికి ఇటుకచేసి
ఇల్లుకట్టి సెట్టినప్పుడు
డొక్కలెండ కొండ్రలేసి
ధాన్యరాసు లెత్తినప్పుడు

ఏ కులమబ్బా
మాదే మతమబ్బా

ప్రచురణ: విరసం
వెల: 1000 రూ.లు
రెండు సంపుటాలు కలిపి

ఎడిటర్: అల్లం రాజయ్య

కాపీలకు: 9247253884

త్వరలో విరసం ప్రచురణగా రాబోతున్నది



తల్లులు-బిడ్డలు

చారిత్రాత్మక స్మృతులు

హుస్సేన్ రచన

KLVA101M 202

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి : 50 ◆ సంచిక : 5 (392) ◆ జూన్-జులై 2022 ◆ పేజీలు : 52 ◆ వెల : రు. 20/-

అద్దెబతుకు

అరసవిల్లి కృష్ణ

యంత్రానికి మానవహృదయం ఉంటుందా? కనీసం యంత్రం నడిపే వ్యక్తికి తాను నడుపుతున్న యంత్రం దేనిని నిర్మిస్తుందో, దేనిని కూలుస్తుందో అనే ఎరుక వుంటుందా? జీవిక కోసం పనిచేస్తున్న వ్యక్తి ఆలోచనలపై యజమాని అజమాయిషీ ఉంటుందా? అంతిమంగా రాజ్యపెత్తనమే వుంటుందా?

ఒక నిర్మాణాన్ని కూల్చడం చాలా సులభం. ఈ దేశంలో అధికార మార్పిడి తర్వాత కూలిన నిర్మాణాల నుండి, కూలిన గోడల నుండి, విరిగిన ఇటుకల నుండి అనేకులు నిరాశ్రయులయినారు. వారెక్కడున్నారో! వారి సంతతి ఏమయిందో? ఈ దేశ ప్రజాస్వామ్యం ఏనాడూ ఆలోచించలేదు. యంత్రాలు చేస్తున్న విధ్వంసం, యంత్రం వెనుక దాగివున్న రాజకీయ శక్తులు చేస్తున్న విధ్వంసం ఈనాటికీ కొనసాగుతున్నది. అభివృద్ధి నమూనాకు యంత్రం చోదక శక్తిగా మారింది. యంత్రం కింద మగ్గిన బతుకుల సన్నటి స్వరం పూర్తిగా వినిపించకుండాపోయింది.

యంత్రం ఇప్పుడు తన విధ్వంస రూపాన్ని మార్చుకున్నది. నిజానికి యంత్రం మానవ మేధకు ప్రతిరూపం. సృజనాత్మకకు ప్రతీక. మనిషి చేత నిర్మాణమై మనిషి చేతులకు కొనసాగింపై, అనేక వస్తువులను పుట్టించింది. నాగరికతలను ప్రభావితం చేసింది. మానవ శ్రమ వెలికితీసిన ఇనుములో మానవ మేధస్సు ఉంటుందేమో. కాని దానిని ఉపయోగించే రాజ్యవ్యవస్థకు మానవ హృదయముండదు. అది సంపదను పోగేసింది. దోపిడి చేసింది. ఇవాళ విద్వేషం దానికి తోడయింది.

ఇవాళ యంత్రం రాజకీయ శక్తులకు ఆయుధంగా, ఒక బలమైన విధ్వంసక పనిముట్టుగా రూపొందుతోంది. రాజకీయ ప్రత్యర్థిని, భిన్నాభిప్రాయాన్ని సహించలేని తెంపరితనానికి యంత్రం ప్రతీక అయింది. విద్వేషకర గొంతుకు యంత్రం తోడయి కొత్త నినాదం పుట్టుకొచ్చింది. అది మరింత విస్తృతమవుతున్నది. బుల్డోజర్ ఈ దేశ రోడ్లపై విధ్వంసకర పాత్రను సాగిస్తున్నది. పాలకవర్గ రాజకీయ గొంతుగా బుల్డోజర్ వస్తున్నది. హెచ్చరికలు చేస్తున్నది. బ్రాహ్మణీయ భావజాలం పునాదిగా ఉన్న భారతీయ జనతాపార్టీ బుల్డోజర్ సంస్కృతిని పాలనా పద్ధతిలోకి తీసుకొచ్చింది. చట్టం బుల్డోజర్‌లా మారిపోయింది. అది నిరుపేదలను, అణగారిన కులాలను, మైనారిటీ మతస్తులను, బుద్ధి జీవులను, వారి ధిక్కార స్వరాలను తొక్కివేస్తూ వస్తున్నది.

ఇక బుల్డోజర్ పాలక వర్గాలు ఆపాదించే 'నేరాని'కి సంబంధించిన చట్టపరమైన అంశంగా మారిపోయింది. చట్టం, న్యాయం పేరుతో ఏవారే రూపొందించుకున్న వాటిపట్ల కూడా నమ్మకం కోల్పోయేలా వాటినీ ధ్వంసం చేస్తున్నారు.

గతంలో ఎవరినయినా భయపెట్టడానికి చట్టాన్ని ప్రయోగించేవాళ్లు. ఇప్పుడు చట్టం స్థానాన్ని బుల్డోజర్ ఆక్రమించింది. ఇప్పుడు ప్రగతిశీల ఆలోచనలపై బుల్డోజర్ దాడి చేస్తున్నది. తన హిందుత్వ అజెండాను అమలు చేసే క్రమంలో భారతీయ జనతాపార్టీ బుల్డోజర్ వంటి చట్టాలకు రూపకల్పన చేసింది. ఉదాహరణకు ఎన్.ఆర్.సి. ఈ దేశంలో వుంటున్న, ఈ దేశం తమది అనుకుంటున్న ఈ దేశ ప్రజలకు పౌరులమని నిరూపించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఇది కేవలం అల్ప సంఖ్యాక వర్గాల సమస్య మాత్రమే కాదు. భారత ప్రజల సమస్య. దీనిని నిరసిస్తూ భారత సమాజమే రహదారులపైకి వచ్చింది. ముస్లింలు తమ గుర్తింపు, అస్తిత్వ సమస్యగా దీనిని చూసారు. ప్రభుత్వ నిర్ణయాన్ని, రహస్య ఎజెండాను వెనక్కు తీసుకోమని ఉద్యమించారు. చట్టాల రూపంలో చేయలేని పని కోసం ఇక బుల్డోజర్ నేరుగా వచ్చింది. ముస్లిం జీవితాన్ని ఆర్థికంగా ధ్వంసం చేసే విధ్వంస రచన మొదలైంది.

ఇవాళ ఎన్.ఆర్.సి. వ్యతిరేక ఉద్యమకారిణి ఫాతిమా ఇంటిని బుల్డోజర్ తాకింది. సంఘ్‌పరివార్‌కు ఆమె రాజకీయ కార్యాచరణపై అభ్యంతరం వుండవచ్చు. రాజ్యం దృష్టిలో ఆమె దేశద్రోహి కావచ్చు. ఇది రాజ్యం చూసే కోణం. కాని ఆమె ఈ దేశంలో పుట్టింది. ఈ దేశ సంస్కృతిలో భాగమయింది. ఈ దేశం తనది అనుకుంది. అల్పసంఖ్యాక వర్గాల అస్తిత్వం కోసం పెనుగులాడింది.

దీనికి ప్రతిఫలంగా భారత ప్రజాస్వామ్యం ఆమె వుంటున్న ఇంటిని కూల్చి వేసింది. ఒక నిర్మాణాన్ని ధ్వంసం చేసింది. ఇల్లంటే కేవలం కొన్ని ఇటుకలు, సిమెంటు, ఇసుక మాత్రమే కాదు. ఇటుకా ఇటుకా పేర్చడానికి రూపాయి రూపాయి కూడేసి జీవితకాలం ధారపోసిన శ్రమ ఉంటుంది. గడిచిన కాలపు

(మిగితాది 14వ పేజీలో...)

(సంచిక - 392)

అరుణతార నిర్వహణ కోసం అనంతపురం నుండి సి. పెద్దిరెడ్డి గారు 5000 రూ/- విరాళం ఇచ్చారు. వారికి మా కృతజ్ఞతలు.

ఎడిటర్

అరసవిల్లి కృష్ణ

వర్కింగ్ ఎడిటర్

పి. వరలక్ష్మి

రచనలు పంపించాల్సిన చిరునామా:

5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు-516360.

* email : **arunatara1977@gmail. com**

Like Page:
//viplava rachayitala sangahm arunatara

facebook:
//viplava rachayitala sangahm virasam

Virasam website :

www. vasanthamegham.com

చందాలు, విరాళాలు పంపవలసిన చిరునామా

అరసవిల్లి కృష్ణ, పోస్ట్ బాక్స్ నెం:13, 6-1/16-7ఎ/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001.

చెక్‌లు / డ్రాఫ్టులు / ఆన్‌లైన్‌లో పంపడానికి

A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714, Branch : Vagu Center, Vijaywada.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

వసంతమేఘం

సాహిత్య, రాజకీయార్థిక పక్షపత్రిక

వసంతమేఘం అంతర్జాల పక్ష పత్రిక చదవండి. గతంలో విరసం.ఆర్గ్‌లాగే వసంతమేఘాన్నీ ప్రోత్సహించండి. రచనలు పంపించండి. మీ రచనలతో, విమర్శలతో, సూచనలతోనే వసంతమేఘం విప్లవ, ప్రజా సాహిత్య సాంస్కృతికోద్యమంలో తన కర్తవ్యాలను నెరవేర్చగలుగుతుంది. **- వసంతమేఘం టీం**

ఈ సంచికలో

సంపాదకీయం

అద్దెబతుకు - అరసవిల్లి కృష్ణ (3,14)

నివాళి

విలువల కళాసాహిత్య రూపం శీలా వీర్రాజు - వివి (6-7)

స్త్రీల అభ్యుదయం ఆమె ప్రవృత్తి - వర్ణనిర్మూలన ఆమె వృత్తి - నల్లూరి రుక్మిణి (8-10)

అరుణ స్మృతిలో - భానుమతి (10-11)

వ్యాసాలు

వాస్తవ సత్యాలను కనుగొనడం కోసం భారతదేశమంతా నిజాయితీగా తవ్వకాలు జరిపేద్దామా - బద్రీ రైనా (12-14)

పేరులో ఏముంది - పి.వరలక్ష్మి (19)

స్వేచ్ఛను ఖూనీ చేసే మరో నిరంకుశ చట్టం - ఎ.నర్సింహారెడ్డి (25-27)

బ్రాహ్మనిజం-బుద్ధిజం-హిందూయిజం - రమేశ్ పట్నాయక్ (28-33,37)

హస్‌దేశ్ అడవులకు రక్షణగా మూలవాసుల పోరాటం - కురుసం శంకర్ (38-41)

యెమన్ ఒంటరిగా లేదని నినదిద్దాం - జహాంగీర్ (42-43)

పాలకులెవరైనా అదే ద్రోహం - తథాగత (44,50)

సాహిత్య వ్యాసం

ముగ్గురు స్త్రీమూర్తుల విజ్ఞత ప్రేమ్‌చంద్ 'ప్రతిజ్ఞ' - ఆంజనేయకుమార్ (15-16,18)

కరపత్రం

చెర స్మరణ (17-18)

కవిత్వం (23-24)

బతుకులపై బుల్డోజర్ - కెక్యూబ్ వర్మ

వెన్నెల తాకని గుమ్మానికి - కిరణ్

పిలుపు పిడికిళ్లు - ఉజ్వల్

విస్ఫోటనం - కెనరి

విద్వత్తులోంచి-గవిడి శ్రీనివాస్

వేట - గలణ్

కథ

హోషియార్ - ఇక్బాల్ (34-37)

ఇంటర్వ్యూ

నా పుస్తకం నా ఇతర సహ ముద్దాయిలకు సహాయపడుతుందని ఆశిస్తాను - అబ్దుల్ వాహిద్ షేక్ (20-22,41)

మారుతున్న దోపిడి పీడనలను చిత్రించడం పూర్తి కాలేదు - అల్లం రాజయ్య (45-50)

***గమనిక: అనివార్య కారణాల వల్ల రెయిన్‌బో శీర్షికను ఈ సంచికలో చేర్చలేకపోయాం.**

అనివార్య కారణాల వల్ల వసంతమేఘం అంతర్జాల పత్రికకు తాత్కాలిక విరామం తీసుకోవాల్సి వచ్చింది. తిరిగి ఆగస్టు 1 నుండి పత్రిక వెలువడుతుంది. అసౌకర్యానికి పాఠకులు మన్నించాలి.

-వసంతమేఘం టీం

విలువల కళా సాహిత్య రూపం శీలా వీర్రాజు

వి.వి

శీలా వీర్రాజు గారి మరణం గురించి వినగానే మా ఆరు దశాబ్దాల అనుబంధాల్లోకి నా జ్ఞాపకాలు తొలుస్తూ పోయాయి. ఆయన సహచరి, అంతే సున్నితమైన తాత్విక చింతనాపరురాలు శీలా సుభద్రాదేవి గారితో రేఖామాత్రంగా ఆ స్మృతులు పంచుకుంటున్నప్పుడు నా గుండెలు బరువెక్కాయి. ఆయన సహస్ర చంద్ర దర్శనాలకు మించి జీవితంలో ఎన్నో వెలుగు చీకట్లు చూసి ఒక సార్ధక ఫలవంతమైన సంతృప్తితో వెళ్ళిపోయారు. ఆయన ఎన్నడూ నిరాశావాది కాదు. అసహనానికి ఎన్నడూ గురి కాలేదు. ఆయన వ్యాకులత అంతా వ్యవస్థ గురించి, వ్యవస్థలో, ఆ ప్రభావంతో సమాజంలో ముఖ్యంగా మధ్యతరగతిలో, అందులోనూ బుద్ధిజీవుల్లో పెరుగుతున్న స్థితి స్థాపకత, ఉదాసీనతతో కూడిన స్వార్థం, విలువల రాహిత్యం గురించి.

ఆయన వ్యక్తిగత జీవితం, సాహిత్య వ్యక్తిత్వం అంతా విలువల కోసం నిజాయితీగా చేసిన పోరాటం. 'మైనా' నవల మొదలు ఆయన వచన కవిత ప్రక్రియలోనే రాసిన స్వీయ జీవితం వరకు ఆయన సామాజిక, సాహిత్య జీవితంలోని ఈ విలువల పోరాటం ప్రతిఫలిస్తుంది.

ఎంత రూపమని! పిట్టపిల్లంత మనిషి. కాని మగ్గం మీద ఎన్నో గజాలు నేసిన కలనేత వస్త్రం వంటి ఎన్నో పొరలు విప్పినా తరగని ప్రేమ, స్నేహం, ఆత్మీయ స్పర్శ. మృదువైన, దృఢమైన మాట ఎంత మెత్తటిదో అంత పదునైనది.

ఆయనింకా రాజమండ్రి నుంచి వచ్చిన కొత్తరోజుల్లో అనుకుంటాను. అప్పటికింకా కథల్లో, నవలల్లోనే ఉన్నాడేమో కనీసం అచ్చయి వచ్చిన గుర్తింపువల్ల. నేనింకా ఉస్మానియా యూనివర్సిటీ వదలని క్యాంపస్ రోజులు 1960-64 ఆ తొలిదశకంలోనే మొదట ఫ్రీవర్స్ ఫ్రంట్ కవిత్వ పఠన సమావేశాల్లో కుందుర్తిగారితో పరిచయమైంది. 'తెలంగాణ' కావ్య రచయితగా, ఫ్రీవర్స్ ఫ్రంట్ నాయకుడుగా, వచన కవితా ఉద్యమకారుడిగా కుందుర్తి గారికి అప్పటికి నేను కవితాభిమానిని. ఒకవిధంగా ఫ్రీవర్స్ ఫ్రంట్ ఆ తర్వాత ప్రభుత్వ అనువాద శాఖలో ఆయనతో ఏర్పడిన సాహచర్యంలో 'స్వచ్ఛంద కవితా' సమర్ధకుడిగా నేనాయన ప్రక్రియలో సహగామినయ్యాను. అయితే ఆ విషయంలో కుందుర్తి కుడిభుజం మాత్రం శీలా వీర్రాజు గారే.

క్యాంపస్ నుంచి కుందుర్తి గారిని కలవడానికి గాంధీభవన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ అనువాద శాఖకు వెళ్ళినప్పుడు ఆ కార్యాలయం ఒక కవుల, కళాకారుల కూటమిగా పరిచయమైంది. కుందుర్తి గారు తన సహోద్యోగులు గోపాలచక్రవర్తి (గోపాలశాస్త్రి తెలుగు 'స్వతంత్ర' వారపత్రిక సంపాదకులు గోరాశాస్త్రి మేనల్లుడు అనడం కన్నా వచన కవితలో తనదైన ముద్రవేసిన ఆజానుబాహుడు) శీలా వీర్రాజులను పరిచయం చేసారు. వీర్రాజు గారిది శాంతి స్వరూపం. చల్లటి నీడలాంటి ప్రసన్నమైన ముఖం, ఆయన తాత్విక కళాకారుడని కాసేపు సంభాషణలోనే ఆ మిత భాషిత్వంలోనే, ఆ విశాలమైన నేత్రాల్లో, చిత్రలేఖనా లిపిలో ఆయన స్నేహాన్ని, ప్రేమను క్యాన్వాసుపై చిత్రిస్తున్నట్టు పరిచయమయ్యాడు కాని అనువాద వృత్తి

జీవిగా కాదు. అందుకే ఆయన తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ కూడా చేసి సాహిత్య, చిత్రకళా ప్రవృత్తినే పూర్తి కాలపు జీవన వ్యావృత్తిగా ఎంచుకున్నాడు. మా స్నేహం మాకు ఆఫీసులో కలయికలకే పరిమితం కాలేదు. ఆయన రాంకోటి ఇంటి నుంచి ప్రస్తుతం నివాసం దాకా అనివార్య విరామాలతోనే కావచ్చు చివరి దాకా కొనసాగింది.

కుందుర్తి వచన కవితా ప్రక్రియను ఒక ఉద్యమంగా నిర్వహించాడు. 'నయాగరా' కవుల నుంచి, నర్సరావుపేట నుంచి, కమ్యూనిస్టు స్నేహితుల నుంచి ఆయన ప్రక్రియను కూడా ఫ్రంట్ చేయగలిగాడు. ఐతే ఒక షరతు కవిత అయినా, కథ అయినా ఏదయినా వచన కవితలోనే జరగాలి గానీ అది సామాజిక స్పృహ, చైతన్యం కలిగి, సామాజిక చలనానికి ప్రేరణ ఇచ్చేదిగా ఉండాలి. కుందుర్తి జీవితకాలంలోనూ, తన సమగ్ర జీవితకాలంలోనూ కుందుర్తి ఆశించిన దానికన్నా మించి అన్ని సాహిత్యరూపాలను, కథ, నవల చివరకు స్వీయ చరిత్ర వరకు పుష్కలంగానూ పరిపుష్టిగా చేసి చూపించిన కమిటెడ్ రచయిత శీలా వీర్రాజు గారు. ఆయన అన్ని విధాల సవ్యసాచి. బహుసాచి కూడానేమో. ఆయన ఎంత కవో అంత గొప్ప చిత్రకారుడు. కవిత్వం రాయకుండా ఉన్న రోజు లేదు. బొమ్మలేయకుండా ఉన్నరోజు లేదు. నా హాస్టల్ మేట్ 'తిరుగబడు' కవి పి.సి.నరసింహారెడ్డి కవిగా 'ఐ' చిత్రకారుడుగా 'శుక్తి' తర్వాత సృజన చిత్రకళాకారుడుగా ఆధారపడింది శీలా వీర్రాజు గారి పైననే. క్యాంపస్‌లో ఉండగానే శిష్ట్లా జగన్నాథరావు ద్వారా 'నవత'(63-64) కవిత్వ పత్రిక తెచ్చిన సందర్భంలోనూ కుందుర్తి, వీర్రాజులతో నా అనుబంధం కొనసాగింది.

ఇంక జడ్చర్ల నుంచి సృజన ప్రారంభించినాక 1966 నుంచి మా అనుబంధం దృఢతరమైంది. ముఖ్యంగా చెరబండరాజు, శ్రీవతి, చంద్రలతో పాటు కాచిగూడ, బర్కత్‌పురా, నారాయణగూడాలలో మా సాహిత్య సమావేశాల్లోనూ, విరసం సభల్లోనూ వీర్రాజు గారి సహకారం లేకుండా ఊహించలేము. అయితే అన్నింటా ఆయన ఒక అంతఃస్రవంతి. ఒక కాన్షస్ కీపర్. విశ్వసనీయంగా ఆధార పడిన స్నేహితుడు. నాకే కాదు సృజన 'సాహితీ మిత్రులు' అందరికీ ఆయన స్నేహితుడయ్యాడు. అది వే. నరసింహా రెడ్డి(వేనరె) కావచ్చు, గంటా రామన్న(జి.రాంరెడ్డి) కావచ్చు, (అంపశయ్య) నవీన్ సరేసరి. కథా నవలా రచయితగా తన సాహిత్య కోవకే చెందిన వీర్రాజు గారికి స్నేహితుడు కావడం ఆశ్చర్యం కాదు. అందుకే అంపశయ్య నవీన్ సంపాదకత్వంలో సృజన ఐదవ సంచిక (బుచ్చిబాబు స్మృతిలో) 67 నవంబర్‌లో వెలువరించినప్పుడు సృజన అక్షరాలు రాసి బుచ్చిబాబు ముఖచిత్రం వేసింది వీర్రాజుగారే. సృజన చలం సంచిక (1968 మే), శ్రీశ్రీ సంచిక(ఫిబ్రవరి 1970)లు హైదరాబాద్‌లో అచ్చు వేసినప్పుడు కూడా వీర్రాజు గారి సహాయ సహకారాలున్నాయి. ఇక విరసం ఆవిర్భావం మొదలు, వీరశైవ హాస్టల్‌లో 1971లో రెండవ మహాసభలు, విప్లవకవుల అరెస్టులు, చెరబండరాజు అనారోగ్యం, శస్త్రచికిత్స, అమరత్వం అన్ని సందర్భాల్లోనూ వీర్రాజు గారి ఆత్మీయ అనుబంధం గాఢమవుతూ వచ్చింది.

కుందుర్తి 'ఫ్రీవర్స్ ఫ్రంట్' ద్వారా ఉత్తమ వచన కవితా సంపుటాలకు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులు 1968 లో ప్రారంభించారు. అప్పటికే వెలువడిన శీలావీర్రాజు గారి 'కొడి గట్టిన సూర్యుడు'కు మొట్టమొదటి అవార్డు రావడం కవితా న్యాయం. వరుసగా 'చలినెగళ్ళు'(68)కు, చెరబండరాజు దిక్సూచికి అవార్డులు రావడం స్నేహన్యాయం కావచ్చు. లేదా ఆలంకారిత భాషలో కవిసమయాలు కావచ్చు. కుందుర్తి మరణించాక అవే ప్రమాణాలతో, అవే విలువలతో శీలావీర్రాజు గారు కుందుర్తి పెద్ద కుమారుడు సత్యమూర్తిగారితో కలిసి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులివ్వడం కొనసాగించారు. ఏ ప్రభుత్వ, సంస్థ సహకారం లేకుండా శీలా వీర్రాజు గారి సాహిత్యమిత్రుల సహాయంతో తమ స్వంత ఖర్చులతో నిర్వహించే ఈ అవార్డు నిర్ణయం, సభా నిర్వహణ కార్యక్రమాలు ఎంత అరుదయిన ప్రమాణాలతో వీర్రాజుగారు నిర్వహించారంటే బహుశా ఇవ్వాళ తెలుగు కవిత్వ లోకంలో పురోగమన భావాలు కలిగిన ఏ కవీ ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డు పొందకుండా గుర్తింపు పొందలేదనుకుంటాను.

విరసం ఏర్పడిన తొలి రోజుల్లోనే నలభై మంది రచయితల ఇళ్ళ మీద దాడి జరిగినపుడు ఆ దాడిని ఖండిస్తూ సంతకాలు సేకరించే బాధ్యత చేపట్టిన వారు కుందుర్తి, చేకూరి రామారావు, శీలా వీర్రాజు. ఆ తర్వాత మార్చ్, ఝుంఝు కవితా సంకలనాల నిషేధాలు, విరసం రచయితల అరెస్టులు మొదలు రచయితలపై నిషేధాలు, నిర్బంధాలన్నింటినీ నిర్ద్వందంగా ఖండించిన రచయితల ముందు వరుసలో వీర్రాజుగారు ఉంటారు. ఆయన వెనుక సీట్లో కూర్చుంటారు కానీ నిర్బంధితుల, నిషేధితుల పట్ల ఆయన అభిమానం వల్ల వాళ్ళ హృదయాల్లో మాత్రం ముందువరుసన ఉంటారు.

ఆయన సామాజిక జీవిత నేపథ్యం వల్ల కళా, సాహిత్య దృక్పథం వల్ల కళా సాహిత్య రంగానికి పరిమితం కాకుండా జీవితమంతా ప్రజాస్వామిక ఉద్యమాలలో, విలువలతో ఆయన నిలిచారు.

డా. జగతి, పొనుగోటి కృష్ణారెడ్డి కుటుంబంతో ఇటు మా కుటుంబానికి, అటు సుభద్రాదేవి, వీర్రాజు గారి కుటుంబానికి ఉన్న అనుబంధం వల్ల మా కలయికలు, అనుబంధాలు మరెంతో గాఢమైనవి. ఎక్కువగా మేము మలక్‌పేట, ముసారాంబాగ్, మూసీకి ఈవల నివాసం ఉండడం, కవి మిత్రుడు నాళేశ్వరం శంకరంతో కూడా అనుబంధం వల్ల పూలతీగ అల్లుకున్నట్లుగా మా స్నేహాలు అల్లుకున్నాయి. ముఖ్యంగా నా వ్యాపకాల వల్ల అవి చాలాకాలం కలుసుకోలేనివయినా, వాళ్ళ స్నేహభావాలవల్ల దృఢంగానూ, స్థిరంగానూ నిలిచినవి.

హెర్నియా ఇన్‌ఫెక్షన్‌తో శుక్రవారం (27)న ఆసుపత్రిలో చేరిస్తే సోమవారం డిశ్చార్జి అయివచ్చారని నిన్న సాయంత్రం గుండెపోటుతో పోయారని చెప్పి మీ ఆరోగ్యం కూడా బాగుండటంలేదట కదా అని సుభద్రా దేవి గారు అడిగినప్పుడు నాకు హెర్నియా అపెండిక్స్ ఆపరేషన్ అయిందని చెప్పాలనిపించలేదు. ☆

నివాళి వ్యాసం

స్త్రీల అభ్యుదయం ఆమె ప్రవృత్తి
వర్ణనిర్మూలన ఆమె వృత్తి

నల్లూరి రుక్మిణి

చివరిసారిగా- అదీ చాల ఏళ్ళ తరవాత మాట్లాడిన సందర్భం. అప్పట్లో 'నిషిధ' నవలను ఎందుకో 'దస్య' ప్రచురణ కింద తేవాలనుకున్నాను. ఎవరో 'ఆ పేరుతో సౌదా వాళ్ళు తెస్తున్నారుకదా!' అన్నారు. ఆ విషయం కనుక్కుందామని ఫోను చేశాను.

ఆ రోజు సౌదాతో, అక్కడేవున్న అరుణతో కలిపే చాలాసేపు మాట్లాడుకున్నాం. అప్పటికి కొన్ని రోజుల ముందు 'ఆంధ్రజ్యోతి'లో వర్ణం-కులం మీద చర్చగా సౌదారుణల వ్యాసం ఏదో వచ్చింది. ఆ వ్యాసాన్ని కూడా కలుపుకుని ఆ చర్చ సాగింది. మొదట వర్ణ నిర్మూలన జరగాలనేది వారి ప్రతిపాదని నా గుర్తు. ఐదారేళ్ళయింది గదా!- ఆ తరవాత మళ్ళీ మాట్లాడింది లేదు.

అయితే సౌదా అంటున్నానంటే అందులో అరుణ వుందనే నా అర్థం. అరుణను తలచుకుంటున్నా సౌదా కూడా ముందుకు వచ్చి కూర్చుంటున్నాడు. వాళ్ళిద్దరినీ విడివిడిగా చూడలేం. ఇంతలా ఇద్దరూ ఒకే వ్యక్తిత్వం కింద రూపొందడానికి వారికి 'వ్యక్తిగతం'లేదు, వున్నదల్లా ప్రగాఢమైన సామాజిక ఆకాంక్ష.

గుంటూరులో ఏదో మీటింగు, ఆ సందర్భంలో 'అపూర్వ పురాణ గాథలు' పుస్తకం కొత్తగా వేశారనుకుంటాను, ఇద్దరూ ఆ పుస్తకాలు పట్టుకుని వచ్చారు. నా చేతిలో ఆ పుస్తకం పెట్టి రెండు వందలు తీసుకున్నారు. మంచి 'బైండు'పుస్తకం, వాళ్ళకోసమే కొన్నానప్పుడు. దానిలో 'బర్బరీకుడు' ఎంత సంచలనమో! అన్ని కథలూ అంతే! ఇదంతా ఎందుకంటే ఆ పుస్తకం గెటప్- 'అపూర్వ పురాణ కథల'కు తగ్గట్టుగా- బ్రౌన్ కలర్ పాత టైప్ బైండింగ్‌తో- ఎంత చక్కగా అమరిందో! అదీ వారి సహజమైన సృజనాత్మకతకు ప్రతీక- దానికోసమే ఇది చెప్తున్నా! ఇప్పుడు ముట్టుకున్నా ఆ పుస్తకం అలానే అనిపిస్తుందనుకుంటాను.

అట్లా అన్నింటిలోనూ వాళ్ళ ప్రత్యేకత కనిపిస్తుంది. కథకు తగ్గ కథనశైలి, విషయానికి తగ్గ విశ్లేషణా వారి సొంతం. 'పింజారి' చరిత్రలాంటి డాక్యుమెంటరీ- మనం ఆ పుస్తకం చదువుతుంటే అలాగే అనిపిస్తుంది. 'నాజర్'ని గుంటూర్లో చూస్తున్నాం, ఆయన బుర్ర కథకూడా చూసివున్నాం. కానీ ఆయన జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ, 'పింజారి' నవల కళ్ళకు కట్టించింది.

ఎప్పుడో, గుర్తు రావడంలేదుగానీ- 'ఫూలే' నాటకం వేస్తున్నారని ఎవరో చెప్పారు. చూద్దామని 'బళ్ళారి రాఘవ ఓపెన్ థియేటర్'కి వెళ్ళాం. సడన్‌గా అక్కడ వీళ్ళిద్దరూ కనబడ్డారు. అదికూడా చాలా రోజుల తరవాత కావడంతో 'రుక్కమ్మా' అని వాటేసుకున్నాడు సౌదా- అరుణ నవ్వుతూ నించుంది. నన్ను 'రుక్కమ్మా' అని నోటారా పిలిచే ఇద్దరుముగ్గురిలో 'సౌదా' ఒకడు. ఎందుకో తెలియదుగానీ నా మీద ప్రత్యేకమైన అభిమానం వుండేది. ఇది మనుషులగా మామధ్య అనుబంధం మాత్రమే!.

అయితే సౌదా మా ఇంటికొచ్చే రోజుల్లో- వంట ఇంట్లో చేరి ఎన్ని కబుర్లు చెప్పేవాడో! అట్లా వంటగదిలో కొచ్చి, నా కోసం ప్రత్యేకంగా మెలిగేవాళ్లు ఒకరిద్దరే ఇప్పటికీ! అప్పటికింకా నేను 'కవితలు' బుక్‌లెట్ తేలేదు. ఆ మాటల సందర్భంలో ఆ కవితలు తీసి చూపించాను. అవి చదివి- ఆశ్చర్యంగా, ఆ కవితలు ఏ సందర్భంలో రాశావని పదేపదే అడిగి చెప్పించుకున్నాడు. అప్పట్లో అందరిలాగే నేనూ ఓ ఘర్షణ స్థితిని ఎదుర్కొంటున్న కాలం, అది ఆ కవితల్లో ప్రతిబింబిస్తున్నది. బహుశ ఈ ప్రత్యేకమైన జ్ఞాపకాలు కూడా నా పట్ల అభిమానం నిలుపుకోవడానికి కారణమై వుండవచ్చునేమో!

ఇవి నా వ్యక్తిగత జ్ఞాపకాలు మాత్రమే!

అయితే అసలు అరుణ ఏమిటీ? ఆమె రూపొందిన స్థితి ఏమిటి? దేనికోసం చివరివరకు తన కాలాన్ని వెచ్చించింది?

'ఎల్లి' అరుణగా- ఇంటిపేరుగా మార్చిన 'ఎల్లి' నవల, దాని విశిష్టత తరవాత, అసలు ఎల్లి నవల రాయడానికి అరుణకు ప్రేరణ ఎలా కలిగిందీ- ఈ విషయం ఎక్కడైనా చెప్పిందేమోగానీ- అది నా దృష్టికి రాలేదు. అప్పట్లో విరసంలోనే కాదు ఆంధ్రదేశమంతటా- స్త్రీవాదం మీదా, స్త్రీ పురుష సంబంధాలమీద, కుటుంబ వ్యవస్థమీద

చాలా వేడివేడి చర్చలు జరుగుతున్న కాలం. అది అరుణమీద ప్రభావం చూపిందనడం అర్థసత్యం.

అంతకంటే బాల్యం నుండి ఆమె పెరిగిన కుటుంబ వాతావరణం, వంటబట్టించుకున్న విలువలూ ఆమెను ఎక్కువ ప్రభావితం చేశాయి. తండ్రి వెంకటేశ్వర్రావు గొప్ప సాహిత్యాభిలాషి, స్వయంగా 'మాటిగరి' వంటి నవలలు అనువాదం చేశారు. ఆయన ఎలా ప్రేరేపితుడయ్యారో తెలియదుగానీ- గొప్ప సంస్కారవంతుడు. కమ్యూనిస్టు భావాలన్నా, అందుకోసం పనిచేసేవారన్నా ఎంతో అభిమానించేవారు. కార్యకర్తలుగానీ, నాయకులుగానీ ఎవరువచ్చినా ఆదరంగా వారిని ఆ ఇంటి 'అంతరం'లోకి తీసుకునేవారు. అందువల్లే ఉప్పులూరు వెళ్లడానికి ఆ రోజుల్లో స్నేహితులంతా ఎంతగానో ఉత్సాహపడుతుండేది. ఆ ఇల్లే వివాహవేదికైన సందర్భాలు కూడా వున్నాయి. ఆ లోగిలి అంత విశిష్టమైంది- ఆ ఇంటి నుండి వచ్చిన అరుణ ఆణిముత్యమైంది.

ఆయన ప్రభావంతో చిన్నప్పటి నుండే సాహిత్యం విరివిగా చదవడం అలవాటైంది. అప్పుడే చలం అంటే అభిమానం ఏర్పడింది. సాహిత్యం చదవమనడమేకాదు, చదివింది పిల్లలతో చర్చించేవాడాయన, అందువల్ల పిల్లలకు సాహిత్యమంటే శ్రద్ధ, అనుబంధం ఏర్పడింది. పిల్లల్ని ఎలా పెంచాలో తెలిసిన తండ్రి సహచర్యం 'అరుణ'ను అలవోకగా సాహిత్యంవైపు మలిచింది.

ఆమెకు చలం మీద ఏర్పడ్డ అభిమానం- ఆయనను చూడాలనే తహతహను కలిగించింది. కూతురు కోర్కెను తీర్చాలనుకుని 'చలం'ను చూపించడం కోసం అరుణను 'రమణాశ్రమం' తీసికెళ్ళాడు. అలా 'చలం' కోసం ఒకటికంటే ఎక్కువసార్లే వెళ్ళినట్లు తెలుస్తోంది.

ఇదంతా అరుణనే కాదు వారి పిల్లలందరినీ తీర్చిదిద్దింది.

అందువల్లే ఆ సాహిత్యాభిలాషే అరుణను విరసం వైపు నడిపించింది. అప్పటికింకా విరసంలో చేరలేదు. కృష్ణాజిల్లా యూనిట్ సాహిత్య సభలు మచిలీపట్నంలో జరుగుతున్నాయని తెలిసి తనంతట తానే- చెల్లెలితో కలిసి ఆ సభలకు వచ్చింది. అదే ఆమె మొదటిగా విరసం సభలకు రావడం. ఆ రెండురోజులూ క్లాసులు శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకుంది, విరసం మీద అభిమానం ఏర్పరచుకుంది. ఆ తరవాత కాలంలో సభ్యురాలైంది.

ఇలా సహజంగా బాల్యం నుండే- స్త్రీల సమస్యలపట్ల, స్త్రీ పురుష సంబంధాలపట్ల ప్రత్యేకమైన, ఆలోచనాత్మకమైన ఒరవడి కలిగింది. కనకనే 80-90 దశకంలో స్త్రీవాదం మీద చర్చ ముందుకు వస్తే, తను ఆసక్తిగా పాల్గొనడమేకాదు- అందుకోసం తీవ్రంగా చర్చించేది. అట్లా 'చారి' ఇంట్లో ఓ రాత్రి తెల్లవార్లూ నిద్రపోకుండా మిత్రులంతా చర్చ చేసినట్లు, అందులో రజని, భాను, చారి, సి.యస్.ఆర్, అరుణ కాక ఇంకా ఇద్దరు ముగ్గురు మిత్రులున్నారనీ తెలుస్తోంది.

అరుణ సంస్థలో వున్నన్నినాళ్ళు సంస్థ కార్యకలాపాలపట్ల బాధ్యతగా వుండేది. విరసం సభలూ, సమావేశాలకేకాక, యూనిట్ సమావేశాలకు కూడా తప్పనిసరిగా హాజరయ్యేది. ఆ యూనిట్‌లో తీసుకున్న నిర్ణయాలలో తనకు నిర్దేశించిన పనులు తప్పక పూర్తిచేసేది. ఒకవైపు కార్యాచరణలో వుంటూనే సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేయడం, మిగిలిన మిత్రులతో దాన్ని పంచుకోవడంలో చురుకుగా వుండేది. అలా తొమ్మిదవ రాష్ట్రస్థాయి విరసం సాహిత్యసభలు గుడివాడలో జరిగినపుడు, కన్వీనర్‌గా వున్న రజనికి, ఎంతో సహకరించింది. రజని గుడివాడలో వుండటంతో తనకు తోడ్పడడానికి సభలకు ముందే గుడివాడ వెళ్ళిందని- ఆ సభలకు అరుణ సహకారం లేకపోయినట్లయితే తాను అంత పని చేయగలిగేదాన్ని కాదని- నాకు కుడిభుజంగా నిలబడి అన్ని పనులూ నిర్వహించిందని ఆమె గుర్తుచేసుకుంటోంది.

అయితే ఆమె ఎంత కార్యక్రమాల్లో పాలుపంచుకున్నప్పటికీ- ప్రధానంగా అరుణ గాఢమైన ఆలోచనపరురాలనేది ఆమెకు దగ్గరగా వున్న మిత్రులందరి అభిప్రాయం.

అది నిజమేనని ఆమె రచనలే మనకు చెప్తున్నాయి. 'ఎల్లి' నవల చదువుతుంటే రచయిత్రి ఆ మాండలిక భాషకు చెందిందనే అభిప్రాయం కలిగేంతగా- ఆ యానాదివాళ్ళ నుడికారంతో రాయగలిగింది. దురగ, ఎంకన్నల గుడిసె వర్ణన, పంది కాలు విరిగినపుడు సన్నివేశం- అలాగే 'మాలచ్చిమి' పాత్రను నవలలో- కాలంతోపాటు ఆమె రూపాన్ని వర్ణించడం- పాత్రకూ కాలానికీ అన్వయించి చూపడం- గొప్ప అనుభూతిని మిగుల్చుతుంది. ఆమె లోతైన జిజ్ఞాస 'ఎల్లి' నవలలోని పాత్రలలో ప్రతిబింబించినందువల్లే ఆ నవల సుసంపన్నమైంది. మాలచ్చిమి, నీలి, ఎల్లి, కత్రేణి, పారోతి, అట్లా ఆ నవలలోని ఏ స్త్రీ పాత్ర తీసుకున్నా ఇది మనకు పట్టిస్తుంది. అరుణ సునిశిత దృష్టికి, కథాత్మతో కలగలిసిపోయిన విధం దీనికి గొప్ప నిదర్శనం. 'ఎల్లి' నవల గురించి, దాని విశిష్టత గురించి చెప్తే అదే పెద్ద వ్యాసమవుతుంది- అదిప్పుడు సందర్భం కాదు.

'ఎల్లి' నవలకోసం ఆ ఎరుకల, యానాదుల జీవితాలను అవగాహన చేసుకోవడంకోసం- వాళ్ళను ఎంతో దగ్గరగా తీసుకోకపోయినట్లయితే ఆ సంక్లిష్టమైన జీవితాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమయ్యేదికాదు. అసలు ప్రగాఢమైన అభిమానం ఆ యానాదుల నుండి పొందకపోయినట్లయితే- వారి జీవితాలను విప్పిచెప్పడానికి వాళ్లు ఇష్టపడేవాళ్ళేకాదు. అట్లా ఒక రచన కోసం తననుతాను ఇన్‌వాల్వ్ చేసుకోవడం 'ఎల్లి' నవలలో కనిపిస్తుంది. అందుకే ఆమె 'ఎల్లి అరుణ' అయింది. మధ్యతరగతిలోనేకాదు అన్ని వర్ణాలలోనూ స్త్రీల స్థితి- "ఏ రేవుకెళ్ళినా ముళ్ళపరిగే" అనగలిగింది.

అయితే తాము ప్రేమించిన వాళ్ళకోసం నిస్వార్థపరులుగా నిలబడేది ఆడవాళ్ళేననిపించింది అరుణ. 'నీలి'కోసం దాచిన డబ్బు, 'దువ్వ'కోసం ఖర్చుచేస్తుంది కోమలి. కులాన్ని ఎదిరించి 'దువ్వ'కోసం నిలబడుతుంది నీలి. కత్రేణి, వున్న వూరినీ, కన్నవారినీ వదిలేస్తుంది 'సిలారు'కోసం- అట్లా స్త్రీల నిజాయితీమీద ప్రగాఢమైన విశ్వాసాన్ని 'ఎల్లి' నవలలో మనకు చూపిస్తుంది అరుణ.

'పూలే' నాటకం చూసినపుడు కూడా- పాత్రల ఆహార్యం, డైలాగులు, సన్నివేశాల పొందిక అంతా ఎంతగా ఒకదానితో ఒకటి కలిసిపోయాయంటే- నాటకం అయిపోయాక కూడా దానినుండి తేరుకోలేకపోయాం, 'పూలే' పాత్రధారుడైతే 'పూలేనే తిరిగివచ్చాడన్నంతగా ఇమిడిపోయాడు. ఆ నాటకం జరుగుతున్నంత సేపూ తెరముందు కంప్యూటర్‌తో వున్న వాళ్ళిద్దరికీ దగ్గరలోనే కూర్చునివున్న నేను- అప్పుడు వాళ్ళను చూస్తుంటే -స్టేజీ మీద జరుగుతున్నదానితో వాళ్ళు లీనమైన తీరు అబ్బురమనిపించింది, కొత్తగా అనిపించి, ఆశ్చర్యమేసింది.

అరుణ, సౌదా లిద్దరి గురించి విడివిడిగా మాట్లాడటానికి ఏమీ లేదు. ఇద్దరూ అట్టడుగు జీవుల, కులాలవారి గురించిన చింతనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు. అందుకోసం ప్రత్యామ్నాయ

అరుణ స్మృతిలో

భానుమతి

అరుణ అంటే స్నేహానికి ప్రాణమిచ్చే మనిషి. అరుణ అంటే మనుషులను అపారంగా ప్రేమించే మనిషి. అరుణ అంటే చలంగారి భావ ప్రవాహ ధారలో ఓలలాడిన మనిషి. అరుణ అంటే మార్క్సిజాన్ని సజీవంగా మానవ జీవిత రంగాలన్నిటికి అన్వయించాలని తపించిన మనిషి. మార్క్సిజాన్ని పడికట్టు పదాల స్థాయిలో దిగజార్చడానికి పిడివాద స్థాయిలో అన్వయించే విధానానికి వ్యతిరేకి. మనుషుల మధ్య సజీవ మానవ సంబంధాలు ఉండాలని కోరుకున్న మనిషి. మార్క్స్ కమ్యూనిస్టు మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా బూర్జువా కుటుంబ వ్యవస్థ రద్దు కావాలని బలంగా నమ్మింది. స్త్రీ పురుషుల మధ్య ఇప్పుడు ఉనికిలో ఉన్న బూర్జువా కుటుంబ సంబంధాలకు భిన్నమైన సంబంధాలు ఎలా ఉండాలి, ఆ విధమైన సంబంధాలకు సంబంధించిన తాత్విక భావాలు ఏ రచనలో ఉన్నాయి, ఏ సిద్ధాంత గ్రంథాలలో ఉన్నయో వెతికి బయటకు తీసేందుకు విస్తృతమైన అధ్యయనం చేసింది. వ్యక్తిగత ఆస్తి, కుటుంబం, రాజ్యం ఆవిర్భావం అనే ఎంగెల్స్ గ్రంథంలో మాత్రమే మానవ సంబంధాలను గురించిన ఒక ఆశావహ దృక్పథం ఆమెకు దొరికింది. కొత్తతరం మానవులు ఉద్భవించినప్పుడు ఇప్పుడు సమాజంలో ఉనికిలో ఉన్న విలువలకు చిల్లిగవ్వ విలువ ఇవ్వరు. స్త్రీపురుషుల మధ్య డబ్బుతో విలువ కట్టలేని ప్రేమ సంబంధాలు ఏర్పరచుకుంటారు అని ఆ మానవ సంబంధాలు ఎలా ఉంటాయో ఇప్పుడు చెప్పలేము అన్న ఎంగెల్స్ తత్వాన్నే ఆమె హృదయపూర్వకంగా ఆమోదించింది. ఆమెకు శరత్ సాహిత్యంలో శేషప్రశ్నలో, ప్రబోధ్ కుమార్ సన్యాల్ ప్రియబాంధవిలో, అనతోలి ఫ్రాన్స్ థాయిస్‌లో, చలం అరుణలో నాయకీమణుల పాత్రలు చాలా ఇష్టం. స్త్రీలకు స్వేచ్ఛతో కూడిన ప్రగాఢమైన ప్రేమ సంబంధాలకు ఆ పాత్రలు సజీవ ఉదాహరణలు. ఠాగూర్ గీతాంజలి, కొన్ని కవితలు రజనితో పదేపదే చదివించుకొని వినేది. రైలు ప్రయాణాలు సైతనం సాహిత్య చర్చా వేదికలు, సాహిత్య అధ్యయన వేదికలుగా ఉండేవి. విద్వాన్ విశ్వం ప్రేమ సుదీర్ఘ కవితను రజిని పారవశ్యంగా చదువుతుంటే అరుణ కళ్ళలో భవిష్యత్ స్వప్నాలతో వినేది. మా చర్చనీయాంశం మానవ విలువలు, మానవ సంబంధాల గురించే. ఆ కాలంలో మాకు గోడలు లేవు, ఎల్లలు లేవు అనే ముద్రలు వేసి ప్రచారం చేసే అమాయక జనాలను చూసి చిరునవ్వు నవ్వేది అరుణ.

సాహిత్యాన్ని, నాటకాన్ని, షార్ట్‌ఫిలిమ్ మాధ్యమాన్ని ఎంచుకున్నారు. ఆ పనిలో నిమగ్నమయ్యారు.

మధ్య మధ్యలో 'సౌదారుణ' పేరుతో రచనలు వచ్చినా- మొత్తంగా వారి దృష్టి సృజనాత్మక సాహిత్యం మీద నుండి 'దృశ్య మీడియం' మీదకు మరలడంతో- 'ఎల్లి' వంటి మరో గొప్ప నవలను మనం మిస్ అయ్యామేమోననిపిస్తోంది. అయితే ఎందులో పనిచేస్తున్నా- అందులో నిమగ్నమై ఆ పనిపట్ల నిబద్ధతను కలిగివుండేవారు.

సూర్యంగారు ఎన్‌కౌంటర్ అయినప్పుడు- కోర్టులో కేసు వేయడంతో- ఆయన అంతిమయాత్ర వారంరోజులపాటు సందిగ్ధమైపోయింది. గుంటూరు-హైదరాబాదుల మధ్య తిరగడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారి వుంది. ఆ స్థితివల్ల ఆయనను చివరిసారి చూడాలన్నవారికి గందరగోళ పరిస్థితి ఎదురైంది.

అప్పట్లో వరంగల్ రైతుకూలీ మహాసభలకు అరుణ వెళ్ళింది. ఆ సభలను సూర్యంగారు నిర్వహించిన తీరు చూసి- ఆమె స్పందన అద్భుతం- ఆ సభల నుండి వచ్చాక- ఆయనమీద పదాలుకట్టి చాలా రోజులు పాడిందట- ఆ చెక్కుచెదరని అభిమానమే సూర్యంగారిని తప్పనిసరిగా చివరిసారి చూడలనుకుంది.

అదిగో ఆ సందర్భంలో ఆయనను చూడాలన్న కోరికతో భానుమతితో కలిసి గుంటూరు వచ్చింది. ఆ రోజంతా, ఆ రాత్రికూడా ఎలాగైనా చూడాలనే తపనతో వుండిపోయారు. అట్లా మననుషలపట్ల గాఢమైన అభిమానం కలిగిన వ్యక్తి ఆమె. అప్పటికే అందరం సుర్యంగారి మరణంతో తేరుకోలేని దు:ఖంలో మునిగివున్నాం. ఆ రోజు ఆయన గురించిన జ్ఞాపకాలు చెప్పుకోవడంలో, పంచుకోవడంలో ఒకరినొకరం ఓదార్చుకున్నాం. అప్పుడు అరుణ నాకు ఎంతో దగ్గరిమనిషి! అనిపించింది.

ఆమె వ్యక్తిగా చాలా విశిష్టత కలిగింది, నెమ్మదిగా వుంటూ లోతైన ఆలోచనలు కలిగి వుండేది. తొందరపడి మాట్లాడటం చేతకాదు కూడా- ఆచితూచి మాట్లాడినట్లు ఒక్కోమాట మాట్లాడేది, అయితే అది చాలా అర్థవంతంగానూ, పదునుగానూ వుండేది, తను నమ్మిన అభిప్రాయాలను చెప్పడంలో నిర్మొహమాటంగానూ వుండేది- అంతే తప్ప తనకు భిన్నమైన అభిప్రాయాలున్నవాళ్ళనుగానీ, మరెవరినిగానీ- ఒక్క వ్యతిరేకమైన మాట అనటం విని వుండరనే నా నమ్మకం. అలా ఆమె విరసానికి దూరమయినకాలంలో కూడా సంస్థ గురించి ఎక్కడా వ్యతిరేకమైనమాట ఆమె నుండి వినలేదు.

మార్క్సిజాన్ని పడికట్టు పదాలతోగాక సృజనాత్మకంగా అన్వయించాలనేది ఆమె ఆలోచన, అందుకు ఆమె తనదైన తోవను ఎంచుకుంది.

ఆమె ఎక్కడున్నా మనస్ఫూర్తిగా తను నమ్మిన వర్ణనిర్మూలనకూ, స్త్రీల అభ్యుదయానికి అంకితమైన వ్యక్తి- అట్లా ఆమె పేద ప్రజల కోసం పనిచేసే ప్రవాహాల్లో ఒక పాయగా పారింది.

అమెకు అరుణారుణ జోహార్లు.

కులవ్యవస్థలో కుళ్ళును చాలా దగ్గరగా పరిశీలించింది అరుణ. వాళ్ళ తాతలకాలం నుంచి కులవ్యవస్థ క్రూరత్వాన్ని ఆమె పరిశీలించింది. ఒక ఎస్‌సినో, బిసిలో బ్రాహ్మణ, కమ్మ, రెడ్ల ఇళ్ళకు వచ్చినప్పుడు అలవోకగా గేదల కాడ పేడకళ్ళు తీసి పెంటపోగులో పారెయి అని చెప్పినట్లు, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి కులస్తులకు బిసి, ఎస్‌సి కులస్తులు ఇప్పటికీ చెప్పలేరు కదా -అదే కులం అని ప్రాక్టికల్‌గా వివరించేది. అగ్రకులాల వాళ్ళు మేం కులాన్ని పాటించం అంటవే మోసం అని విమర్శించేది. వేల సంవత్సరాలుగా భారతీయ సమాజంలో పాతుకుపోయిన కుల, వర్ణ అహంకార తాతికతను అంతకంటే బలమైన కుల సమానత్వ తాత్వికతను ప్రతిపాదించడం ద్వారా ఆచరించడం ద్వారా మాత్రమే కుల సమానత్వం సాధించగలమని విశ్వసించేది. ఆ దిశలో విస్తృతంగా అధ్యయనం చేసింది. అరుణ రెండు సంవత్సరాలు మహిళా స్రవంతిలో పనిచేసినా పది సంవత్సరాలు విరసం పనిచేసినా ఎప్పుడూ ముందువరుసలో నిలబడేది కాదు. ఆమె సంఘాల తాత్వికత సుసంపన్నం చేయడం గురించి సమావేశాల్లో సుదీర్ఘంగా చర్చించేది. నినాదాలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలను అంత:సూత్రంగా నడిపించే తాత్వికత మీద ఆమె దృష్టి కేంద్రీకరించేది.

అరుణ విప్లవాన్ని మనసావాచా, కర్మణా ప్రేమించింది. విప్లవకారుల్ని ప్రేమించింది. ఆమె వరంగల్ రైతుకూలీ సభలలో పాల్గొన్నప్పుడు ఒక గొప్ప భావోద్వేగంతో మనసులోతులలో కదిలిపోయింది. ఆమె సూర్యం గారిని ఆయన పనితీరును చూసి పేరడీ కట్టి నాదగ్గర పాడటం మెదలుపెట్టింది. ఓ పీపుల్స్‌వార్ వెంకటస్వామి నిను నేను మరువలేనురా. ఓ గట్టివాడైన వెంకటస్వామి నిను నేను మరువలేనురా అని చాలా సార్లు పాడేది. సహజ కథకురాలైన అరుణ వాళ్ళ నాన్నగారు కుంతేటి వెంకటేశ్వర రావు గారికి కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పేది. ఆయన ఆ సభల్లో పాల్గొన్నవాడి వలెనే ఫీలయ్యే విధంగా ఉండేది ఆ వర్ణన. అరుణ విప్లవం సర్వమానవ విలువలను, సర్వమానవ సంబంధాలను సమూలంగా మార్చివేస్తుంది అనే తాత్వికతను నమ్మేది. అరుణ విప్లవం భూమిని చదునుచేస్తుంది. తరువాతనే కొత్త విత్తనాలను చల్లి కొత్త పంటలను పండిస్తుంది, దాని కోసం సాంస్కృతిక పోరాటం, ఆర్థిక పోరాటం సమాన స్థాయిలో సమాంతరంగా నడవాలి అని ప్రతిపాదించేది. పాతను ధ్వంసం చేయకుండా పాత కట్టడాలకు సున్నాలు, రంగులు వేయడం లాంటివే సంస్కరణవాదాలని యెద్దేవా చేసేది. సంస్కరణలు స్త్రీలను రామాయణ భారతాలు చదివేవరకే, చాకలి పద్దులు రాసేవరకే ఎదగనిచ్చాయి అని విమర్శించేది. సంస్కరణల పలుపుతాడు స్త్రీల మెడకు కట్టి ఆమేరకు గిరిగీసి తిరగమనడంలో మోసాన్ని అసహ్యించుకునేది. పాతవ్యవస్థలో సమస్త బూర్జువా భూస్వామ్య సంబంధాలను కూల్చకుండా నూతన సమాజ స్థాపన, ఆ సమాజ సుస్థిరత సాధ్యం కాదు అని చారిత్రంగా రుజువైంది అని చెప్పేది.

తాత్విక విషయాలపై అరుణ తన సహచరుడు సౌదాతో కలిసి విస్తృతంగా అధ్యయనం చేసింది. భావజాల రంగంలో విస్తృతమైన అధ్యయనం చేసి తాత్విక విషయాలలో పరిపుష్టి సాధించినప్పుడు మాత్రమే హిందూ ఫాసిజానికి ఎదురు నిలబడగలమని నమ్మేది. కులం, వర్ణం, మతం, రాముడు, యుద్ధం కార్డులను ఉపయోగించుకుంటూ దూసుకుపోతున్న బిజెపి, సంఘపరివార్ సునామీ ఎదుర్కోవాలంటే కులం, వర్ణం, మతం, రాముడు, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా అంతే బలమైన తాత్వికతను నిర్మించాలని అరుణ జీవిత పర్యంతం కృషి చేసింది. ఆమె తన శక్తికి మించి పని చేసింది. ఆ ప్రయత్నంలో భాగమే యానాదుల జీవితాలపై అరుణ రాసిన 'ఎల్లి' నవల. అరుణ అంటే ఎల్లి అరుణ. కార్గిల్ యుద్ధాన్ని అపహాస్యం చేస్తూ అరుణ సౌదాతో కలిసిన నల్లగుర్రపు నాడా, గులిస్థాన్ కథలు. వర్ణ వ్యవస్థ, బిజెపి హిందూ మతోన్మాదాన్ని తాత్వికంగా సవాల్ చేసే గ్రంథం 'లాస్ట్ బ్రాహ్మిన్'ను అరుణ సౌదా ఎడిట్ చేసి ప్రచురించారు. లాస్ట్ బ్రాహ్మిన్ రచయిత రాణీ శివశంకరశర్మ. నజర్ జీవిత చరిత్రను పింజారీగా ప్రచురించారు. అంబేద్కర్ వర్ణ నిర్మూలన, అంబేద్కర్ జీవిత చరిత్ర కలిపి అంబేద్కర్ వర్ణ నిర్మూలన అనే సంపూర్ణ గ్రంథాన్ని ప్రచురించారు.

అరుణా సౌదా కలిసి జ్యోతిరావ్ పూలే నాటకం, అంబేద్కర్ పూనా ఒడంబడికపై అంబేద్కర్ నాటకం, బలిరామన నాటకం, బర్బరీకుడు నాటకం, ఝల్కారీబాయి నాటకం స్వయంగా రచించి ప్రదర్శించారు. అరుణకు శక్తికి మించిన పనులు ఇవి. నేలను చదును చేసే తాత్వికతలో ప్రయోగాలే ఈ రచనలు, నటక ప్రదర్శనలు. గాంధీ నీడలో అణగారిపోయిన కస్తూర్బా జీవిత చరిత్రను బయటకు లాగారు.

విప్లవ సాహిత్యం అంటే పడుట్టు పదాలు పదేపదే వల్లె వేయటం, భాషా ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం, రొద్దకొట్టుడు కాదు. నినాదప్రాయమైన చిన్న విషయం కాదు. బలమైన భావజాలంతో కూడిన సాహిత్య రంగాన్ని ఎంచుకొని ఆ రంగం ద్వారా హిందూ ఫాసిస్టు రాజ్య వ్యవస్థ తాత్వికత మీద, భావజాలం మీద దెబ్బకొట్టడమే అరుణ లక్ష్యం. బలమైన ప్రజాతాత్వికతను సాహిత్యీకరించడం విప్లవమే. అరుణను ఆ విధంగానే చూడాలి. అరుణ పూర్తికాలం రచయిత. ఆమె పూర్తికాలం విప్లవకారిణి. ఆమె మార్క్సిజాన్ని సాహిత్యంలో సజీవంఆ అన్వయించడం కోసం తన సర్వశక్తులు ధారపోసింది. మార్క్సిస్టు ఆచరణ అంటే తందానతాన కాదు, పీఠాధిపత్యాలకు తలవంచడం కాదు, మనిషిని ఉన్నతుడుగా నిలబెట్టటవ అని నమ్మి ఆచరించింది. పీఠాధిపతులను గెలటిన్‌కు పంపాలి అని అపహాస్యం చేసేది. బంబార్డ్ ది హెడ్‌క్వార్టర్స్ ఆమెకు అత్యంత ప్రేమాస్పద నినాదం. భూస్వామ్య, బూర్జువా విషవృక్ష కొమ్మలు కాదం నరికివేయాలని, వేళ్ళతో సహా పెకిలించి వేయాలని కొండను తవ్విన ముసలివానిలా తన పనిలో తాను మునిగిపోయింది. విప్లవ ప్రేమి. స్నేహం ఎలా ఉండాలో అలా మనుషుల్ని, విప్లవకారుల్ని ప్రేమించింది. అరుణ స్నేహం ప్రేమ ఆక్టోపస్‌లా మనల్ని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అరుణ ప్రమలో మునిగి తేలకముందే 15 జూన్ 2022న అరుణ సుదూర తీరాలకు వెళ్ళిపోయింది. కా. అరుణకు నా ప్రేమపూర్వక జోహార్లు.

వాస్తవ సత్యాలను కనుగొనడం కోసం దేశమంతా నిజాయితీగా తవ్వకాలు జరిపిద్దామా?

బద్రీ రైనా

బాబ్రీ మసీదు వివాదం గతమయ్యాక తాజా రాజకీయ వేడి రగల్చడానికి హిందుత్వవాదులు జ్ఞానవాపి మసీదును తెరమీదికి తీసుకొచ్చారు. పనిలోపనిగా జ్ఞానవాపిని సర్వే చేసినట్లుగా తాజ్‌మహల్‌ను, కృష్ణ జన్మభూమిని కూడా సర్వే చేయాలని డిమాండ్ చేస్తూ సత్యాన్ని కనుగొనాలనే నినాదాన్ని ఎత్తుకున్నారు. సత్యాన్ని కనుగొనే పరిశోధన నిష్పాక్షికంగా, సమగ్రంగా చేయాలంటే కేవలం మసీదుల్ని మాత్రమే తవ్వితే సరిపోదు. శైవులు నాశనం వైష్ణవాలయాలను, వైష్ణవులు నాశనం చేసిన శివాలయాలను, ధ్వంసం కాబడిన బౌద్ధ, జైన ఆరామాలను, ఆదివాసీ సాంస్కృతిక చిహ్నాలను కనుగొనేందుకు ఎన్ని తవ్వకాలు జరపాల్సి ఉంటుందో ఢిల్లీ యూనివర్సిటీ అధ్యాపకుడిగా పనిచేసిన బద్రీ రైనా 'ది వైర్'కు రాసిన వ్యాసంలో విశ్లేషించారు. అరుణతార పాఠకుల కోసం ఆ వ్యాసం అనువాదం...

కేవలం ఇస్లామిక్ కట్టడాలు మాత్రమే కాదు, అనేక హిందూ కట్టడాల నిర్మాణం కూడా అంతక్రితం వున్న కట్టడాలను కూల్చివేసి జరిగింది.

అయోధ్య తరవాత మరికొన్ని మసీదులు వివాదంలోకి వచ్చాయి.

గదిలో ఏనుగుచుట్టూ తెలివిమంతులు నృత్యం చేస్తున్నారు. (A dance is underway around the elephant in the room)[1]

వినండి! వినండి! భారతీయ ముస్లింలందరూ మతాంతరీకరణ చెందినవారే. తమను మతమార్పిడి చేయించిన వాళ్లను గొంతెత్తి ఖండించాల్సిన సమయం వాళ్లకు ఆసన్నమైంది. వాళ్లు చేసిన చెడ్డపనులన్నింటినీ బహిరంగంగా కడిగేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తిరిగి మళ్ళీ పవిత్ర రక్తం కలిగిన హిందువులుగా వాళ్ళు రూపొందాలి.

'వాస్తవ సత్యాన్ని' సర్వేల వంటి సాధనాల ద్వారా కనుక్కోవాలనే హిందువులందరి సమిష్టి వాంఛగా ఈ కనీసపు అవసరాన్ని ముందుకు తీసుకువస్తున్నారు.

టి.వి.లో ఒక ప్రైమ్ టైమ్ షోలో, ఆశావాది అయిన న్యాయమూర్తి ప్రదీప్ నంద్రాజోగ్ చాలా అద్భుతంగా ఇలా వ్యాఖ్యానించారు. "సత్యం అందరికీ తెలుసు". ప్రార్థనా స్థలాలను ఒకరి తరవాత ఒకరుగా దేశమంతటా పాలకులు కూలగొట్టారు. ఇలాంటి పని దుర్మార్గుడైన ఔరంగజేబు మాత్రమే చేయలేదు.

ఈ దృష్టితో ఆయన ఒక జ్ఞానవంతుడుగా ఇలా అంటున్నారు. ప్రార్థనా స్థలాల చట్టం 1991 ఇప్పుడు అమలులో

వున్నది. దాన్ని మనసా వాచా కర్మణా తప్పనిసరిగా అమలుపరచాలి. 1947 ఆగస్టు 15నాటికి ఏ ప్రార్థనా స్థలాలు ఏ మత హోదాను కలిగివున్నాయో అవన్నీ అవే స్వభావాన్ని కలిగివుండాలి. అలాంటి ప్రార్థనా స్థలాల హోదాకు సంబంధించిన ఎలాంటి వివాదాల్ని న్యాయస్థానం స్వీకరించరాదు.

'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్టు, సంపన్నమైన వైవిధ్యంతో కూడిన నాగరికతను కలిగిన దేశాలన్నింటిలోకి, భారతదేశం అత్యంత సపంద్వంతమైనది. ఈ నాగరికతలన్నీ పొరలు పొరలుగా ఆయా కాలాలలో వర్ధిల్లినవే. కొత్తగా వచ్చిన నాగరికత అంతకుముందున్న నాగరికతకు సంబంధించిన చిహ్నాలపైన తన చిహ్నాలను ముద్రించుకున్నది.

అసలైన హరప్పావాసులనుండి, ఆదివాసీలనుండి తదనంతర శతాబ్దాలలో అనేకమంది ఈ దేశంలోకి వచ్చారు. ఆర్యన్‌లు, గ్రీకులు, జొరాష్ట్రియన్‌లు, యూదులు, ఆఫ్రికన్ సిద్దీలు[2], క్రైస్తవులు, ముస్లిములు (వీళ్ళు ఎనిమిదో శతాబ్దంలోనే వ్యాపారస్థులుగా తొలుత మలబార్ తీరానికి వచ్చారు), మంగోలులు, తురుష్కులు అలా వచ్చినవాళ్ళు. వీళ్ళందరూ ఆయా కాలాలలో తమ నాగరికత, సంస్కృతుల గురించి ఏర్పాటుచేసుకున్న చారిత్రక చిహ్నాలను తరవాత వచ్చినవారు కొంతమేరకు చెక్కివేయడం, లేదా పాక్షికంగా వాటిపైన తమకు చెందిన చిహ్నాలను చెక్కడం లాంటివి భారతదేశంలో జరిగాయి. అయినా ముందుతరాలవాళ్ళ నాగరికతా సంస్కృతులకు అద్దం పట్టే చిహ్నాలేవి పూర్తిగా కనుమరుగు కాలేదు. మీరు దేశంలో ఎక్కడైనా చూడండి! భారతదేశపు విస్తృతమైన బహుళ సంస్కృతుల సంపన్నతకు సాక్ష్యాలుగా నిలబడ్డ వస్తువుల్ని, ఆచారాల్ని, భాషా సంబంధమైన వాస్తవాలని మనం చూడగలం. ఈ రకమైన బహుళత్వం మరే ఇతర దేశంలోనూ కనబడదు.

భారతదేశంలో సహజంగా వున్న ఈ బహుళత్వం మన రాజ్యాంగంలో మనందరికి మార్గదర్శకమైన నిబంధనగా కూడా రూపొందింది. తాము ఎప్పటినుండో చేయదలచుకున్నదాన్ని ఇప్పుడు చేయడానికి అవకాశం వచ్చిందని హిందుత్వ మితవాద శక్తులు అనుకుంటున్నాయనేది వాస్తవం. ముస్లింల ఉనికికి సంబంధించిన అన్ని జ్ఞాపకాలను పూర్తిగా తుడిచిపెట్టి, చైనా ప్రజలందరూ హాన్‌జాతికి చెందినవాళ్ళే అన్నట్టు, భారతీయులందరూ హిందువులేనని సుస్థాపితం చేయడం కోసం వాళ్ళు ప్రయత్నిస్తున్నారు. (ముస్లింలు మాత్రమే భారతదేశంపై దురాక్రమణ చేసారని, బ్రిటీష్‌వాళ్ళు మనకు నాగరికత నేర్పడానికి వచ్చారని వాళ్ళ నమ్మకం.)

స్పష్టంగా వున్నదాన్ని వివాదాస్పదం చేయడం :

వాళ్ళిచ్చిన పిలుపు "సత్యాన్ని కనుగొనడం". అలాంటి ఉన్నతమైన జిజ్ఞాసను తీర్చుకోవడానికి జరిగే పరిశోధన, మనకిష్టం వచ్చినట్లుగా, సంకుచిత దృష్టితో కొన్ని పరిమితులలో జరగకూడదు. కేవలం మహమ్మదీయులు చేసిన నేరాలుగా ఆరోపించిన వాటిని నిరూపించడం కోసమే ఆ అన్వేషణ కొనసాగకూడదు.

అందుకనే మనం చిత్తశుద్ధితో తవ్వకాలు జరుపుదాం. భూమి పొరల అడుగున వున్న సత్యం మనల్ని ఎటు నడిపిస్తుందో చూద్దాం.

ఈ దేశంలో వున్న హిందూపాలకులు అనేక కారణాల మూలంగా ఆంతరంగిక యుద్ధాలు జరిపి, ఆ క్రమంలో పరస్పరం ఒకళ్లనొకళ్లు ఓటమిపాలు చేసుకున్నారు. గెలుపొందిన హిందూ రాజులు ఓడిపోయిన హిందూరాజుల ఆస్తులు కొల్లగొట్టటానికి వాళ్ళ దేవాలయాలను ధ్వంసం చేశారు. యుద్ధంలో తమకు విజయాన్ని చేకూర్చిపెట్టిన తమ దేవతలను, దేవుళ్ళను విజేతలైన రాజులు ఓటమిపాలైన రాజుల దేవుళ్ళను తొలగించి ప్రతిష్టించారు. దీని గురించి అనేక సంవత్సరాలుగా అనేకమంది రాస్తూనే వున్నారు.

అందుచేత వాళ్ళు రికార్డు చేసిన విషయాలలో సత్యమెంతో తెలుసుకోవడానికి మనం తవ్వకాలు జరుపుదాం.

శైవులు నాశనం చేసిన తమ దేవాలయాలను తాము తిరిగిపొందాలని వైష్ణవులు, అలానే వైష్ణవులు నాశనం చేసిన తమ దేవాలయాలను తిరిగిపొందాలని శైవులు కోరుకోవచ్చు. అది సత్యమైతే వాళ్ళు అలా ఎందుకు కోరుకోకూడదు. అలానే భారతదేశంలో తొట్టతొలి నివాసులైన ఆదివాసీలు– అంటే దానర్థం అనాదినుంచి ఇక్కడ వున్నవాళ్లని– కూడా నాశనం చేయబడిన తమ దేవతలకు సంబంధించిన వాస్తవాలను వెలికితీయడానికి తవ్వకాలు జరపాలని కోరుకోవచ్చు. లేదా హిందూసమూహం తమలో కలిపివేసుకున్న తమ ఆదివాసీ దేవతల గురించి కూడా వాళ్ళు ప్రశ్నించవచ్చు. (ఈ ఆదివాసీలను మత మితవాదులు వనవాసీలు అంటున్నారు. అంటే అడవుల్లో నివసించేవారని అర్థం. ఇలా అనడానికి కారణం ఆదివాసీలు ఈ దేశంలో వేం మూలవాసులమని చేస్తున్న వాదనను నిర్వీర్యం చేయడంకోసం)

కాబట్టి వాళ్ళుకూడా తవ్వకాలు జరపమని కోరవచ్చు.

బౌద్ధులు:

వీళ్ళకు సంబంధించి చాలా తవ్వకాలు అవసరమౌతాయి. బౌద్ధ ఆరామాలను ఎంత విస్తృతంగా ఇతరులు కొల్లగొట్టారో చరిత్రకారులు వివరంగా రికార్డు చేశారు. ఆశ్చర్యకరంగా మితవాద సంస్థల సభ్యులు కూడా దీన్ని రికార్డు చేశారు. ప్రాచీన భారతదేశ చరిత్రను వెలికితెచ్చిన చరిత్రకారులలో ఆద్యుడైన డి.యన్.ఝా తన Against the Grain : Identity, Intolerance, History పుస్తకంలో బౌద్ధ విహారాలను, బౌద్ధ స్థూపాలను హిందువులు ఎంతగా ధ్వంసం చేశారో అత్యంత సమగ్రంగా అధ్యయనం చేసి రికార్డు చేశారు.

ఇలా వివిధ సమూహాలకు చెందిన వ్యక్తులు వాళ్ళు నమ్ముతున్న వాస్తవాలను నిర్ధారించడానికి మనం తవ్వకాలకు పూనుకుంటే అది చాలాకాలం పడుతుంది. కానివ్వండి! ఎంతకాలం పట్టినా సత్యాన్ని తెలుసుకోవడం కోసం తవ్వకాలు జరపాల్సిందేకదా. స్వామి వివేకానంద, దయానంద సరస్వతి, చివరకు తీవ్రజాతీయవాది బంకించంద్ర ఛటర్జీ కూడా చేసిన వ్యాఖ్యలు మనకు ఈ తవ్వకాల బాధ్యతను తప్పనిసరి చేశాయి. బుద్ధిలేని కొందరు లౌకికవాదులు కొన్ని హిందూ దేవాలయాలకు సంబంధించి, వాస్తవాలంటూ చేస్తున్న వ్యాఖ్యలకు వీళ్ళ భావనలు బలం చేకూరుస్తున్నాయి.

స్వామి వివేకానంద :

"భారతదేశ చరిత్ర గురించి ఏ మాత్రం తెలిసిన వ్యక్తికైనా పూరీలోని జగన్నాథ దేవాలయం పురాతన బౌద్ధ దేవాలయమని

తెలుసు. ఈ దేవాలయాన్ని, ఇంకా అనేక ఇలాంటి దేవాలయాల్ని మనం స్వాధీనం చేసుకుని తిరిగి హిందూ దేవాలయాలుగా మార్చాం. అలాంటివి చాలా పనులు ఇంకా మనం చేయాల్సే వుంది". (స్వామి వివేకానంద, 'భారతీయ ఋషులు The Sages of India', స్వామి వివేకానంద సంపూర్ణ రచనలు, అద్వైత ఆశ్రమం, కలకత్తా, వాల్యూమ్3, పేజీ 264)

స్వామి దయానంద సరస్వతి :

"ఆది శంకరాచార్యుడు పది సంవత్సరాలు దేశమంతా పర్యటించి జైన మతాన్ని ఖండించి వైదిక మతాన్ని ప్రచారం చేశాడు. ఈ రోజుల్లో తవ్వకాలలో బయటపడుతున్న విరిగిపోయిన దేవుళ్ళ ప్రతిమలన్నీ శంకరాచార్యుడి కాలంలో ధ్వంసం చేయబడ్డవే. అయితే కొన్ని ప్రతిమలు ధ్వంసం కాకుండా దొరుకుతున్నాయి. మరికొన్ని ఇంకా భూమిలోనే వున్నాయి. జైన మతాన్ని త్యజించినవాళ్ళు తమ దేవాతామూర్తులను ధ్వంసం చేస్తారన్న భయంతో జైనులు భూమిలో దాచిపెట్టిన మూర్తులు అవి" (సత్యార్థ ప్రకాష్, చాప్టర్ 11, పేజీ 347)

బంకిం చంద్ర ఛటర్జీ :

"జనరల్ కన్నింగ్ హామ్ తాను రాసిన 'భిల్సా టోప్స్'(Bhilsa Topes) అనే పుస్తకంలో జగన్నాథ దేవాలయంలో రథోత్సవం ఎలా ప్రారంభమైందో చాలా హేతుబద్ధంగా వివరించిన ఎరుక నాకున్నది. ఆయన దీని మూలాలను బౌద్ధులు జరుపుకునే ఇలాంటి ఉత్సవంలోనే కనుగొన్నారు. బౌద్ధుల విశ్వాసంలో మూడు చిహ్నాలున్నాయి. అవి బుద్ధ, ధమ్మ, సంఘ. ఈ మూడింటిని వాళ్ళు ఒక రథంలో వుంచి ఊరేగించేవారు. పూరీలో ఇప్పుడు రథ యాత్ర జరుగుతున్న సమయంలోనే అప్పట్లో అదికూడా జరిగేది. పూరీలో జరుగుతున్న ఊరేగింపులో రథంలో వుండే జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల ప్రతిమలు దాదాపుగా బుద్ధ, ధమ్మ, సంఘ అనే మూడింటికి నకలు అనే నమ్మకం బలంగా వుంది. వాటి నమూనాలోనే ఈ మూడు విగ్రహాలను తయారుచేసినట్లు కనపడుతోంది." (బంకిం చంద్ర ఛటర్జీ, 'హిందూ పండుగల పుట్టుక', వ్యాసాలు-ఉత్తరాలు'(On the Origion of The Hindu Festivals, in Essays & Letters) రూపా, ఢిల్లీ 2010, పేజీలు 8-9)

మనం అంతగా ఊహించని వైపునుండి కూడా తవ్వకాలకు డిమాండ్ వచ్చే అవకాశం వుంది. అయితే వాటిని కూడా మనం గౌరవించాలి. ఎందుకంటే హక్కులు, సందేహాలు ఏ ఒక్కరి గుత్తసొత్తూ కాదు.

మావో చేసినట్లుగానే, మనంకూడా మన సంస్కృతికి సంబంధించిన సత్యాల్ని తిరిగి కనుగొనడం కోసం శ్రద్ధతో తవ్వకాలను కొనసాగిద్దాం. ఒకవేళ ఈ తవ్వకాల ఫలితంగా ఒక సంస్కృతికాక బహుళ సంస్కృతులున్నాయనే సత్యం బయటపడవచ్చు. సత్యం బహుముఖీనం కాదని అనగలమా?

ఈ తవ్వకాల కసరత్తు రెండు రకాల ప్రయోజనాలను కలిగిస్తుంది. మొదటిది, ఒకరకమైన ధార్మిక సంబంధమైన నరేగా (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కల్పన చట్టం) లాంటిది. ఒకవైపు నిరుద్యోగులైన భారతీయ యువతకు అత్యవసరమైన ఉపాధిని కల్పిస్తుంది. అదే సమయంలో ఆధ్యాత్మికవాదులు భారతదేశానికి సంబంధించిన అంతిమవాస్తవాన్ని కనుగొనే ప్రయత్నంలో దేవుళ్ళు, దేవతల చుట్టూ సమయం గడుపుతారు కాబట్టి వాళ్ళకు ఆధ్మాత్మిక ఆహారం లభిస్తుంది.

Note :

(1. 1814లో ఇవాన్ క్రైలోగ్ అనే ఒక కవి 'ది ఇంక్విజిటివ్ మాన్' (The Inquisitive Man) అనే ఒక కల్పిత కథ రాశాడు. ఈ కథలో, మ్యూజియంకు వెళ్ళిన ఒక వ్యక్తి అతి చిన్నవస్తువులను కూడా చూస్తాడుగాని, ఏనుగును మాత్రం గమనించడు. అప్పటి నుండి అది సామెతగా మారింది. అంటే కళ్ళముందు నగ్నంగా కనపడుతున్న వాస్తవాన్ని చూడకుండా లేదా చూడనట్లు నటిస్తూ అతి స్వల్పమైన విషయాల గురించి మాట్లాడే తత్వం అని అర్థం.
2. ఆఫ్రికన్ సిద్దీలు : భారతదేశంలో, పాకిస్థాన్‌లో నివశిస్తున్న ఒక తెగ. వీళ్ళు ఆగ్నేయ ఆఫ్రికాకు చెందిన బంటూ తెగ వారసులు. వీళ్ళు వ్యాపారులుగా నావికులుగా బానిసలుగా ఈ రెండు దేశాలకు సుమారు నాలుగువందల సంవత్సరాల కిందట వచ్చారు. భారతదేశంలో వీరి జనాభా సుమారు 50వేలమంది. వీళ్ళలో ఎక్కువమంది కర్ణాటక రాష్ట్రంలో నివసిస్తున్నారు.- అను)

(అనువాదం - సి.యస్. ఆర్. ప్రసాద్)

(3వ పేజీ తర్వాత)

జ్ఞాపకాలు, వర్తమాన అనుబంధాలు, భవిష్యత్తు భరోసా, రేపటి తరానికి ఆసరా ఉంటాయి. ఆ ఇల్లు ఉద్యమకారిణి ఫాతిమాది మాత్రమే కాదు. అనేకులు ఇంటి నిర్మాణంలో సహకరిస్తారు. ఆరేళ్ళ పిల్లవాని నుండి, ఇరవై ఏళ్ళ ముదుసలి వరకు శ్రమ చేస్తారు. అది మొత్తం కుటుంబ సామూహిక ఆస్తి. ఈ ఎరుక మన ప్రజాస్వామ్యానికి ఉండదా.

మన దేశ న్యాయస్థానాలు ఏమంటున్నాయి? నేర స్వభావం కలిగిన వారి ఇళ్ళను కూల్చడం ప్రభుత్వం బాధ్యత అని వంత పాడుతున్నాయి. అసలు ఇక్కడికి నేరం అనే భావన ఎందుకు వచ్చింది? ఒక నిరసన ఈ దేశంలో నేరమవుతుందా? అదే నేరమయితే ఈ దేశంలోని ఇళ్ళన్నిటినీ కూల్చివేయవలసిందే. భారతదేశం స్మశాన భూమి, నేను నిర్జీవ దేహాన్ని ప్రేమిస్తాను అనే ప్రతిజ్ఞ చేయవలసిందే.

ఫాతిమా ఇంటిలాగానే వందలాది ఇళ్లు ధ్వంసం అయ్యాయి. ఇప్పుడు వారిదంతా అద్దె బతుకు.

ఇల్లే కాదు, ఈ దేశం మీది కాదు అని మైనారిటీ మతస్తులనుద్దేశించి అంటున్నారు. ఈ రోడ్లు మీవి కావు, ఈ నేల మీది కాదు, ఈ నీరు మీది కాదు, ఈ ప్రకృతి మీది కాదు అని మెజారిటీ సమూహాలనంటున్నారు. వారిదంతా అద్దెబతుకు.

బుల్డోజర్ ఫాతిమా ఇంటిని మాత్రమే తాకలేదు. ఆమె అసమ్మతిని తాకింది. ఈ అసమ్మతి ఫాతిమాది మాత్రమే కాదు. అనేక విధాల దగాపడ్డ దేశప్రజలది. రైతులది, కార్మికులది, ఆదివాసులది, దళితులది. సకల పీడిత సమూహాలది అని పాలకులు గుర్తించే రోజు తప్పక వస్తుంది.

ముగ్గురు స్త్రీమూర్తుల విజ్ఞత
ప్రేమ్‌చంద్
'ప్రతిజ్ఞ'

కె. ఆంజనేయకుమార్



ప్రేమ్‌చంద్ 1880-1936 మధ్య జీవించిన హిందీ అభ్యుదయ రచయిత, మొదటి అరసం అధ్యక్షుడు. ఆయన రాసిన కర్మభూమి, గోదాన్ లాంటి నవలలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మన దేశ నవలా సాహిత్యంలో ఎంతో మంది రచయితలు ఎన్నో స్త్రీ పాత్రలు సృష్టించారు. కానీ ప్రేమ్‌చంద్ సృష్టించిన స్త్రీ పాత్రలు ఇప్పటికీ చాలా ఉన్నతంగా, హృద్యంగా ఉంటాయి. ఆయన రాసిన పుస్తకాలు గ్రంథాలయాల్లోని 'రాక్'ల నుండి ఇప్పుడు తీస్తే చాలా శిథిలావస్థలో, రంగుమారి, పట్టుకుంటే చిరిగిపోయే స్థితిలో ఉండవచ్చు. కానీ ఒక్కసారి ఆ నవలలు చదివితే ఆ స్త్రీ పాత్రలు మన అంతరంగంలో తిష్ఠ వేసుకుంటాయి. నవల చదవడం అయిపోయాక కూడా పదే పదే గుర్తుకొస్తూ వెంటాడుతుంటాయి. ఆయన రాసిన కర్మభూమిలోని సుఖదా పాత్రను తీసుకొని ఆయన మిత్రుడు జ్ఞానేంద్రకుమార్ ఏకంగా ఒక పెద్ద నవలనే రాసాడు. ఇది ప్రేమ్‌చంద్ స్త్రీ పాత్రల విశిష్టతకు ఒక మచ్చుతునక.

ప్రేమ్‌చంద్ 'ప్రతిజ్ఞ' నవలలో మూడు ముఖ్యమైన స్త్రీ పాత్రలు ఉంటాయి. మూడూ ఎంతో విభిన్నంగా, మానసిక పరిపక్వతతో, సమయోచితంగా, చాకచక్యంగా, ధైర్యంగా, స్థిరంగా నిండుకుండల్లా వ్యవహరిస్తాయి. నవల మొదటి పేజీలో ఉన్న రచయిత పేరు తెలియకపోతే... పుస్తకాన్ని మళ్ళీ ముద్రిస్తే 'ఆధునిక నవల' అని అందరూ భావిస్తారు.

1. ప్రేమావతి, 2. ఆమె స్నేహితురాలు పూర్ణ, 3. వదిన సుమిత్ర. ప్రేమావతి అక్కభర్త అమృతరాయ్. తన అక్క చనిపోవడంతో బావకి తనని ఇచ్చి పెళ్ళి చేయాలని తల్లి దేవకి, తండ్రి బదరీప్రసాద్ భావిస్తారు. అమృతరాయ్ స్నేహితుడు దాననాథ్ ప్రేమావతిని ప్రేమిస్తాడు. కానీ అమృతరాయ్, ప్రేమావతిల ప్రేమ చూసి తన అభిమానాన్ని మనసులోనే దాచుకుంటాడు.

కానీ ఒకరోజు అమృతరాయ్ ఒక సభలో తను వితంతువివాహం చేసుకుంటానని ప్రతిజ్ఞ చేస్తాడు. "అరె! ఏం? అలా మాట్లాడుతున్నావ్ యీ వేళ? ప్రేమ అంటే కిరాణాకొట్టులో దొరికే సరుకు అనుకున్నావా ఏమిటి? ఇష్టమైతే కొనుక్కోవడానికి, కష్టమైతే మానేయడానికీనా? ప్రేమ సాక్షాత్తు ఒక బీజం. ఒక్కసారి గనుక నాటుకుపోయిందంటే, దాన్నిక నిర్మూలించడం కష్టసాధ్యం! నీరూ, గాలి, వెలుతురు అనేవి లేకపోయినా అది జీవిస్తుంది. ఇక ప్రేమావతి సంగతి అంటావూ... ఆమె నీ కాబోయే ధర్మపత్నియే కాదు; నీ కింతకు ముందెన్నడో అంకితమైపోయిన ప్రేమరాశి! అలాంటి ప్రేమైకజీవి నువ్వీనాడు చేసిన ప్రతిజ్ఞ విన్నదంటే... అమాంతంగా హృదయాన్ని బద్దలు చేసుకోదూ? నిజంగా... అమృత్, ఆమె ప్రాణం మీదకు తెచ్చావ్ గొప్ప ముప్పును" అంటాడు దాననాథ్.

అమృతరాయ్‌కి బావ ప్రతిజ్ఞ వినేసరికి ప్రేమహృదయం గజగజలాడిపోయింది. అబ్బ! మూడేళ్ళ నుంచీ తన ప్రియమైన బావని తన ప్రేమమూర్తిగా తలుస్తూ ఉపాసిస్తున్నది. గాఢంగా పాతుకుపోయిన ఆ దివ్య విగ్రహాన్ని ఆమె హృదయ మందిరంలోనుంచి తీసివేయడానికి ఎవరికి తరం? పోనీ ఆమె మటుకు దాన్ని అలాగే ఉంచుకొని, వివాహరీత్యా వచ్చే 'భర్త' అనే వేరే బొమ్మకు ఆ పక్కనే స్థానం ఇవ్వగలదా? అన్నీ తలంపుకి వచ్చేసి, ఏదో తపన పుట్టించాయి. కాలి వేళ్ళను నలేమీద రాస్తూ, రుద్ధంగా అన్నది "ఒద్దు అమ్మా! నన్ను గురించి వేరే పెళ్ళి ప్రయత్నం గురించి మీరెలాంటి ఆలోచన చేయవద్దు. నన్ను ఇలాగే ఉండి పోనీయండి" అని తల్లి దేవకితో అంటుంది.

ఈ విషయం తన స్నేహితులు పూర్ణకి చెబితే ఆమెకు అమృతరాయ్ మీద ఉన్న గౌరవం తగ్గిపోతుందని భయపడి "అసలు ఆయనకి మళ్ళీ పెళ్ళి చేసుకుందామని లేనే లేదు. అక్కమీద ధ్యాస ఉ ండిపోయి, అదో విరక్తి చేసుకున్నారు మనస్సును. కాని - అమ్మా, నాన్నా ఎంతో ప్రాధేయపడ్డాక దాంతో బాటు నా మీద ఏదో దయపుట్టి "ఊఁ" అన్నారు గానీ, ఇప్పుడు ఆ ఆలోచన మార్చుకున్నారు. ఇక ఏదో అలాగే ఒంటరిగా వుంది సంఘసేవ చేస్తూ జీవితం గడుపుదామని అనుకున్నారు. అలాంటప్పుడు ఆయన కాళ్ళకి బంధంలాగా

నేనెందుకూ? నిజంగా పూర్తా... మనస్సాక్షిగా చెబుతున్నాను...ఇలా ఉండిపోయినా నాకు చింత లేదు. కావలిస్తే ఏమైనా అదృష్టమూ... అవకాశమూ ఉంటే... ఆయన తల పెట్టే సత్కార్యంలో చేయూత ఇస్తాను" అని పూర్ణతో అంటుంది. ఇక్కడ ప్రేమ సున్నిత మనసూ... తనని కాదన్న బావకి గౌరవం తగ్గిపోతుందని బాధపడటమూ... పరిస్థితులను సర్ది చెప్పడమూ, మనకెంతో అద్భుతం అనిపిస్తుంది. "ఆయన సత్కార్యాలకు చేయూతనిస్తాను" అని ప్రేమ మాటవరసకే అంటుంది. కానీ... ప్రేమ్‌చంద్ ఆ మాటలని వృధాకానివ్వడు. భవిష్యత్తును ముందే సూచిస్తాడు. జరగబోయే కథని ఇలా పాత్రలతో చూచాయగా పలికించడం కూడా ప్రేమ్‌చంద్ గొప్ప టెక్నిక్. దీనివల్ల మనకి జరగబోయే కథ పట్ల ఆసక్తి పెరిగి మనస్సు కొన్ని సన్నివేశాలను ముందుగా ఊహించుకునే ఆస్కారం కలుగుతుంది. తర్వాత దాననాథ్‌ని పెళ్ళి చేసుకొమ్మని తల్లితండ్రులు అడగ్గానే "తను మటుకు ఏమంత పరాయివాడుగాడు, తన బావ స్నేహితుడు అంతే! బావంత భాగ్యవంతుడు గాకపోయినా, తనకేమి? దైనందినమూ విలాసగాల్లోనే మునిగి తేలుతూ ఉండాలని తనకభిలాష లేదుగదా?'' అనుకొని మనసును కుదుటపర్చుకొని వివాహానికి అంగీకారం తెలుపుతుంది. ఈ వివాహానంతరం ప్రేమ పాత్రల ఔన్నత్యం అద్భుతంగా తీర్చిదిద్దారు రచయిత.

ఉత్తమ సాంప్రదాయం గల హిందూ బాలికకు మల్లేనే ప్రేమ కూడా తన భర్త దగ్గరకు వచ్చేసాక పూర్తిగా ఆయనకే కైవసం అయిపోయింది. 'ప్రాణమే ముఖ్యము. ప్రాణేశ్వరుడే ముర్యాతమము' అన్నట్టుగ తననర్పించుకొని సంచరించడానికి బాగా అలవాటు పడిపోయింది. అమృతరాయ్ అంటే ఎక్కడో స్వప్నంలో చూచిన పరాయిమనిషి అనే భావం ఆమెలో ఉన్నట్టు కన్పిస్తోంది. అని రచయిత వ్యాఖ్యానిస్తారు. దాననాథ్ తల్లికి కొంత అసంతృప్తి ఉంది. "కొడుకు తక్కిన విషయాల్లో ఎంత బాగున్నప్పటికీ, డబ్బు విషయంలో మటుకు తన మాట వింటే బాగుండునని. మరేమీ లేదు, ప్రతినెలా వచ్చే జీతం అట్లాగే తన చేతిలో పోస్తే ఇంటికయ్యే ఖర్చును తాను అనుకునే ప్రకారంగా అతిక్లుప్తంగా జరుపుకుంటూ పోవాలని ఆమె అభిలాష. అంతలోనే ప్రేమ కాపురానికి వచ్చింది. వచ్చిన రెండే రెండు నెలల్లో అన్నీ చక్కబడినాయి. ప్రేమ ప్రతినెలా జేబు ఖర్చుకోసమని ఒక పాతికరూపాయలు భర్తకు ఇచ్చేసి తక్కినదంతా అత్తగారి చేతిలో పోస్తుండేది. ఏమయినా ఇంట్లోకి కావలసి వస్తే ఆమెకే చెప్పి వివరంగా తెప్పిస్తూ ఉండేది. ఇందువల్ల ఆ ముసలిదాని చిరకాలవాంఛా తీరుతున్నది. సంసారం కూడా చక్కగ ఏమీ వొడుదుడుకుల్లేకుండా సాగిపోతున్నది.

కానీ దాననాథ్‌కు మొదటి నుంచి కొంత అనుమానం ఉంది. ప్రేమ మనస్సులో ఇంకా అమృతరాయ్ ఉన్నాడేమో అని. ఇదే అనుమానం అతని మనసులో తొలిచేస్తుంటే ఇంట్లో ఎంత ప్రశాంతత వుంటే ఏమిలాభం? ఆఖరికి ప్రేమ తన ప్రాణాన్ని అర్పించి గూడా అతని ఈ అనుమానాన్ని తీర్చలేదేమోగూడాను. అంత గాఢంగా అల్లుకుపోయి వుంది అంటారు రచయిత. నెల జీతమే గాకుండా పరీక్ష పేపరు దిద్దడం వల్లనూ ఈ మధ్య దాననాథ్‌కు పైగా డబ్బు వస్తూ వున్నది. ఆ డబ్బుతో ప్రేమకు ఎన్నో రకాల అలంకారాలు చేయించి... ఎంతో ప్రసన్నంగా ఉంచసాగాడు. తనకు సాధ్యం కాలేదు గానీ, లేకపోతే ఆ ఆకాశం మీద నక్షత్రాలన్ని తెచ్చి మాలగుచ్చి, స్వయంగా ఆమె మెళ్ళో వేసేవాడే... అంతలాగా మనసిచ్చి... అతిమురిపెంగా, ముచ్చటగా ఉంటున్నాడు. అయినా అమృతబాబు, ప్రేమ ఇద్దరూ ఒక్కసారిగా స్ఫురణకొచ్చేసరికి మటుకు దాననాథ్ అనుమానం ఇంకా అనుమానంగానే ఉండిపోతున్నది. ఎలాగైనా ఒక్కసారి పూర్తిగా ఆమె అంతఃకరణను పరీక్షిస్తే గానీ వీల్లేదనుకున్నాడు. అంటే తనకు కనీకనబడకుండా ఆమె మనోభావాల్లో కలిసిపోయి, తననెంతో అనుమానం పీడిస్తోన్న ఒక భావాన్ని మాంచి ఎరకట్టి గేలం వేసి పైకి లాగేయాలనుకున్నాడు. ఒకసారి ఇంటికి ఆలస్యంగా వస్తే ప్రేమ అడిగిందని "అమృతబాబు దగ్గరకి వెళ్ళివచ్చాను. తన దగ్గరున్న డబ్బునంతా రాయికి రప్పకి ఖర్చు పెట్టాడు. ఇక ఇప్పుడు చందాలంటూ జోలెకట్టుకొని బయలుదేరుతున్నాడు" అని అంటాడు దాననాథ్.

"ఊ! పోనిద్దురూ మాయగొడవలు? త్వరగా భోజనానికి లేవండి. వంటమనిషి గోల పెట్టేస్తోంది" అని దాటేస్తుంది ప్రేమ. కాని దాననాథ్ కదలడు. భార్యని ఇంకా పరీక్షిద్దామనుకుంటాడు. అమృతరాయ్ గురించి కావాలనే నీచంగా మాట్లాడతాడు.

ప్రేమమటుకు ఆ మాటలకు మంటలో పడిన పచ్చి ఆకులాగా బుసబుసలాడిపోయింది. అమృతరాయ్ అంటే ఆమెకింకా భక్తిభావం లేకపోలేదు. పైగా ఎంతో ఆత్మీయ మిత్రుడనిపించుకుంటున్న తన భర్తకి అమృతరాయ్ అంటే కుత్సితభావాలు వుంటాయని ఆమె ఎన్నడూ అనుకోలేదు. అయిష్టంగా భర్తతో అన్నది "మీరు అమృతరాయ్‌ని ఆడిపోసుకోవటం నిజంగా మీ చూడలేనితనమే" తన భర్త అనుమానపడుతున్నాడని తెలిసికూడా ఆమె తన మనస్సులోని యదార్థభావాన్ని వెల్లడించడంలో చూపించే తెగువ, ధైర్యం భర్తతో తన వాదనలో బిగ్గరగా వినబడుతుంది. తన భర్త, తన అన్న ఎన్నిసార్లు అమృతరాయ్ గురించి చులకనగా మాట్లాడినా ఖండిస్తుంది. ఒకసారి అమృతరాయ్ పెద్ద సభపెట్టి వనితాశ్రమం కోసం చందాలు వసూలు చేయడానికి ప్రయత్నం చేయబోతే దానిని భగ్నం చేయడానికి కుట్ర జరుగుతుందని తెలిసి అడ్డుకోవడానికి తాను వెళ్ళాలని నిర్ణయించుకుంటుంది. కాని దాననాథ్‌కు తెలిస్తే? ఈ ప్రశ్న చప్పున పుట్టి కాస్త కలవరపాటు కలిగించింది కానీ... మరుక్షణమే మాయమైపోయింది. ఏదో ధృడశక్తితో, ధృడభావంతో ఆమె ముఖం వీరోత్తేజమై పోయింది. "ఛా! నేనొకరికి లొంగివుండటానికి బానిసను గాను. నా మనస్సును మటుకు ఎవ్వరికీ అమ్ముకోలేదు. నా ప్రేమ నా పతికోసమే ఉంది! కానీ నా భక్తి మటుకు ఆ అమృతరాయ్ కోసం ఉంటుంది. అంతే..." అని తన నిర్ణయాన్ని ధృడపరుచుకుంటుంది.

అమృతరాయ్ సభలో గలాభా జరిగి, అతన్ని కొట్టడానికి పదిమందీ పది కర్రలెత్తారు. ఇకనేముంది? గొల్లున గోల బయలుదేరింది. తన్నండి.. అంటే తన్నండి అంటూ కేకలు పుట్టినాయి. కుర్చీలు, బెంచీలు పైకి చేతుల్లోకి వచ్చినయ్. ఇక అరక్షణంలో రక్తాలు చిమ్ముతాయే... అలాంటి సంక్లిష్ట పరిస్థితిలో రివ్వుమంటూ ప్రేమ సభావేదిక మీదకి వచ్చి "మహాశయులారా!" అంటూ అతి బిగ్గరగా సంబోధిస్తుంది.

"దిక్కుమొక్కు లేక అనాథలైపోయివున్న మన అభాగ్య సోదరీమణులకు ఒక ఆశ్రయం కల్పించుదామనే సంకల్పంతో అమృతరాయ్ చేస్తున్న పవిత్ర కార్యక్రమాన్ని సమర్థించండి" అని అద్భుతమైన ఉపన్యాసం అలవోకగా ఇస్తుంది. ఆమె ఉపన్యాసం చదువుతుంటే మనకి ప్రేమ్‌చంద్ ఉపన్యాసం వింటున్నట్టే వుంటుంది. సభలోని ప్రేక్షకుల్లా మనం కూడా ముగ్ధులైపోతాం. "అన్నగానీయండి,

(మిగితాది 18వ పేజీలో...)

చెర స్మరణ

హృద్ఘోషకు జైలు లేదు
జనవాహినికి ఎదురులేదు

ఆదివారం, జూలై 03, 2022

దొడ్డి కొమరయ్య హాలు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్

విప్లవ రచయితల సంఘం 52వ ఆవిర్భావ సభ

చెరబండరాజు సమగ్ర సాహిత్య ఆవిష్కరణ

సాహిత్యంపై చెరిగిపోనీ ధిక్కార సంతకం చేసిన కామ్రేడ్ చెరబండరాజు 40వ వర్ధంతి ఏడాది ఇది. ధిక్కార కలాలకు, గళాలకు ఇదే అదునుగా పదును పెడుతున్న కాలం మరోసారి చెరను స్మరించుకునేందుకు సిద్ధమైంది. గతంలో ఒకసారి పునర్ముద్రించిన చెరబండరాజు పుస్తకాలు ఎప్పుడో అయిపోయాయి. ఆయన సమగ్ర సాహిత్యాన్ని తిరిగి ప్రచురించి విప్లవ రచయిత సంఘం 52వ ఆవిర్భావ సభలో ఆవిష్కరిస్తున్నాం. కనీసం ఐదేళ్లుగా చెర సాహిత్యం కావాలని అడిగేవారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా యూనివర్సిటీల విద్యార్థులు, సినిమా సహా వేర్వేరు కళాత్మక రంగాల్లో పనిచేస్తున్న యువత అడుగుతోంది. ఈ దేశం కళ్లు మీరే.. కాళ్లు మీరేనని ఏ యువతరం గురించి చెర గొంతెత్తారో ఆ తరం ప్రతిసారీ ఆయన సాహిత్యాన్ని చదువుతోంది. సాహిత్యం, కళాత్మక ప్రక్రియల్లో ఆయన ప్రాసంగికతను అపూర్వరీతిలో యువత ఇప్పుడు చర్చలోకి తీసుకొస్తోంది. తెలంగాణ తన సాంస్కృతిక మూలాలను, ప్రాంతీయ ప్రతీకలను అన్వేషించి, ప్రతిష్ఠించుకునే క్రమంలో పునరుత్తేజం అందిస్తున్న కవి చెర. పాలితుల ఆసక్తులకు భిన్నంగా బహుశా చెరబండరాజు, అలిశెట్టి ప్రభాకర్ వంటి ప్రభావశీల వ్యక్తులపై కొత్త అంచనాలకు ఈ తరం సిద్ధమవుతున్నది. నాగరికతా విలువలను, ప్రాతినిధ్యాన్ని నిరాకరిస్తున్న ఫాసిస్టు సన్నివేశాన్ని ఎస్.సి, ఎస్.టి, బి.సి, మహిళ, ముస్లిం సమూహాలు గట్టిగా ఎదుర్కొంటున్నాయి. ఈ సామాజిక పునాదుల నుంచి వచ్చిన యువత మీద చెరబండరాజు వ్యక్తిత్వ, సాహిత్య ఆచరణ, పోరాట ప్రభావాలు కొత్త వెలుగులను ప్రసరిస్తున్నాయి. అకడమిక్ పరిశోధనల కంటే విముక్తి పోరాట చైతన్యంతో సాగే అన్వేషణకు చెర పాటలు సాంస్కృతిక తెరచాపల్లా దారి చూపుతాయి.

దిగంబర కవి, విరసం వ్యవస్థాపకుల్లో ఒకరు, 27 ఏళ్లకే విరసం కార్యదర్శి, మూడుసార్లు జైలు నిర్బంధం, మరో మూడుసార్లు బ్రెయిన్ ట్యూమర్‌కు ఆపరేషన్లు! ఇంతాచేసి చెరబండరాజు జీవించింది 38 ఏళ్లే. ఎవరు జీవించేను మూడు యాభైలు అని శ్రీశ్రీ అన్నారు. కానీ, ఒక యాభై కూడా చెర జీవించలేదు. అందులోనూ యవ్వనకాలమంతా జైళ్లు, ఆస్పత్రిలోనే హరించుకుపోయాయి. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో బతికించడానికి డాక్టర్లు చేసిన చివరి ప్రయత్నం కూడా విఫలమై 1982 జూలై రెండో తేదీన చెరబండరాజు అమరుడయ్యాడు. కాదు.. ఆయనను ప్రభుత్వం అనే పిచ్చికుక్క హత్యచేసిందని శ్రీశ్రీ అన్నాడు. శ్రీశ్రీ, శివసాగర్, చెర తెలుగు కవిత్వంలో ప్రజాకర్షక, విప్లవోత్తేజ కవులుగా సాహిత్య చరిత్రలో నమోదయ్యారు.

కార్యక్రమం

ఉదయం 10 గంటలకు

పుస్తకావిష్కరణ

ప్రారంభ ప్రసంగం

రాము, సిటీ యూనిట్ కన్వీనర్

ఉదయం 10.30 గంటలకు

మొదటి సెషన్

అధ్యక్షత : అరసవిల్లి కృష్ణ

చెర సాహిత్య సర్వస్వం ఆవిష్కరణ

ఆవిష్కర్తలు : కృష్ణబాయి, రత్నమాల, చెంచయ్య

ఉదయం 11.00 గంటలకు

అంశం : చెర జీవితం - వ్యక్తిత్వం

వక్త : అల్లం రాజయ్య

ఉదయం 12.00 గంటలకు

అధ్యక్షత : సి ఎస్ ఆర్ ప్రసాద్

అంశం : చెర జ్ఞాపకాలు-ప్రభావాలు

వక్తలు : నగ్నముని, ఖాదర్ మొహియుద్దీన్, ఎన్. వేణుగోపాల్, రుక్మిణి, భూపాల్

(మధ్యాహ్నం 1.30 - 2.30 భోజన విరామం)

మధ్యాహ్నం 2.30 గంటలకు

అంశం : మా చెర ఏతం పట్టిన మందిపాట ఉరవడిలో..

అధ్యక్షత : తంగెళ్ల సుదర్శన్

మధ్యాహ్నం 3.30 గంటలకు

అధ్యక్షత : ఉజ్వల్

అంశం : చెర రాజకీయ దృక్పథం

వక్త : రివేరా

అంశం : చెర సమకాలీనత-విప్లవోద్యమం

వక్త : పాణి

ప్రజా కళామండలి, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు కలవు.

విరసం కవులు నినాదాలు రాసి కవిత్వంగా దబాయిస్తున్నారనే ఆరోపణ వినిపించిన రోజుల్లో కవిత్వ ప్రయోజనాలు నెరవేరేలా, శిల్ప ప్రమాణాలకు నిలబడేలా చెర కవిత్వం రాసి పోరాట ప్రజలకు నినాదాలుగా అందించాడు. ఒక తరం యువకులు శివసాగర్, చెర, వరవరరావు కవిత, పాటలను గోడలపైనే చదువుకున్నారు. అయితే..శ్రీశ్రీ తర్వాత ఎక్కువగా కోట్ అయిన కవిత్వం మాత్రం చెరదే. సరళం, సూటిదనం, ఉద్దీపనలు కలిగించే పదాలతో ఆయన పాటలు యువకుల పెదాలపై కవాతులు చేసేవి. ఆర్ఎస్‌యు, ఆర్‌వైఎల్, పిడిఎస్‌యు సభల్లో ప్రాణాలన్నీ గొంతులోకి తెచ్చుకుని పాడితే ఒక గర్జన ప్రకంపించేది.

నాగళ్లు, కొడవళ్లు యూనివర్సిటీలను నడిపించిన నక్సల్బరీ కాలం సృష్టించిన రాడికల్ భావాల బలం ఆయన గొంతుకలో ప్రస్ఫుటించేది.

తొణకని చెర వ్యక్తిత్వగుణం కూడా దీనికి తోడవడంతో విప్లవ కవితకు, పాటకు అమేయమైన ప్రభావం వచ్చింది. అయితే..రాజకీయాలను నిరాకరించే శుద్ధ సాహిత్య ధోరణి సహజంగానే చెర సాహిత్యంపై పెదవి విరిచింది. కళ్ల ముందు మార్పును చూడలేని, యువకుల ఆకాంక్షలను చేరదీసుకోవడానికి చేతులు రాని నిలువనీటి దుర్గంధమీ ధోరణి. విప్లవ సాహిత్యోద్యమం ఈ ధోరణితో తలపడుతూ వచ్చింది. వర్గపోరాటాన్ని విప్లవ భావజాలాన్ని కొనసాగించింది. విప్లవ సృజన, భావాల చేవ, వాటి చారిత్రక విలువ పదే పదే రాటుదేలుతూ వచ్చాయి. ఇంకో వైపు నుంచి కూడా విప్లవ సాహిత్యంపై వ్యతిరేకుల విమర్శను చెరబండరాజు ఎదుర్కొన్నారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోనూ ఆయన ప్రయత్నపూర్వకంగా రచనలు చేశారు. నవలలు, కథలు, నాటికలు, నాటకాలు, ఏకాంకికలు సృష్టించారు. సాహిత్యంలో రాజకీయాలు వద్దనే వాదనను ఓడించడానికి చెరబండరాజు వంటి తొలితరం విప్లవ సాహిత్యకారులు పూనికతో పని చేశారు. అయినా కాలం తిరస్కరించిన భావనలు, నాగరికత విసర్జించిన ధోరణులు, అకాడమీ, పురస్కార వాదాలు తిరిగి తిరగబెడుతూనే ఉంటాయి. విశ్వవిపణిలో అంగాంగాన్నే కాదు. ఆత్మలనూ అమ్ముకుంటుంటాయి. రాజుల సంస్కృతిని ప్రజల సంస్కృతిగా రుద్దుతుంటాయి. ఆగస్టు 15 ద్రోహాన్ని అమృత మహోత్సవంగా చాటింపు వేస్తుంటాయి. వాటితో పడే ఘర్షణే విప్లవ రచనను, కళాత్మక ఆచరణలను రాటుతేలుస్తాయి. ప్రత్యామ్నాయ వాదనలకు, సిద్ధాంత భావనలకు విస్తృతిని పెంచుతాయి. గతంలో దృష్టి పడని కొత్త ఆవరణలను మన ఆచరణల పరిధిలోకి తెచ్చి నిలుపుతాయి.

పీడిత కులాల, మహిళల, యువతరాల పోరాట ఆకాంక్షలను యాభై ఏళ్ల కింద చెర తన కవిత్వంలో ఆవిష్కరించాడు. వర్గపోరాట చైతన్యంతో విప్లవోద్యమ భవితవ్యాన్ని తొలి రోజుల్లోనే కలగన్నాడు. ఆయన కోరుకున్న విప్లవోద్యమం అనేక సంక్షోభాల మధ్యనే ఈ దేశంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. ఇంకో పక్క అగ్రకులతత్వం, హిందుత్వం, పితృస్వామ్యం వికృత క్రీడలు ఆడుతున్న తరుణం కూడా ఇదే. ఈ సంఘర్షణామయ వర్తమానంలో చెరను మళ్లీ చదువుకుందాం. ఆయన పాటలు పాడుకుందాం. అందరికీ ఇదే ఆహ్వానం.

“చీకట్లను చీలుస్తూ వెలుగులొస్తాయి. మోకాలు లేనివాడు మొండెముతోనైనా ఇంటికొస్తాడు. పండు రాలిపడితే విత్తనం అవుతుంది. యేటిని ఎల్లకాలం ఆపాలనుకుంటే ఎంత పెద్ద కట్టలయినా కొట్టుకుపోతాయి. ఎంత బలంగా కొడితే అంత బలంగా పైకెగురుతుంది బంతి. భేరిని జోకొట్టాలనుకుంటే శబ్దిస్తోంది. నేలను తన్నితే కాలికే గాయం తగులుతుంది. వాయుపీడనం భరించలేక ఉక్కు గొట్టాలే ముక్కలవుతాయి. అనివార్యంగా మానవ చరిత్ర పరిణామ సూత్రాన్ని అనుసరించి నడవాల్సిందే.”

– *చెరబండరాజు*

(16వ పేజీ తర్వాత)

భర్తగానీయండి – ఎవ్వరైనా సరే – ఒక మంచి ఉద్దేశంతో జరుగుతున్న సమావేశాన్ని ఆటంకపరిస్తే నేను సహించనని ముందుకొచ్చిన సంఘటన నవలలో చదువుతుంటే మన మనస్సు, కన్నులు ఒకేసారి ఆర్ద్రమై పోతాయి.

“కర్మభూమి”లో సుఖదా – సౌందర్యం, సౌశీల్యం, అన్నీ వుండి భర్త అనాదరణకు గురై ఏమాత్రం నిరాశపడకుండా తను సమాజ సేవలో ముందుంటుంది. అలాగే ఈ “ప్రతిజ్ఞ”లో ప్రేమావతి – తన భర్త అనుమానపడుతున్నాడని తెలిసికూడా సమాజ సేవ చేస్తున్న బావకి అండగా నిలుస్తుంది. ఇంత అద్భుతమైన స్త్రీ పాత్రలు ప్రేమ్‌చంద్ చేతిలో ప్రాణం పోసుకొని ఇప్పటికీ సజీవంగా, స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.

ప్రేమ్‌చంద్ నవలల్లో గొప్పతనమేమిటంటే... అద్భుతమైన మానసిక సంఘర్షణ... పాత్రల మధ్య! రచయిత ఒక పాత్ర వైపే మొగ్గుచూపకుండా అన్ని పాత్రల భావాల్ని, వేదనల్ని నాణానికి రెండువైపులను నైపుణ్యంగా చూపిస్తారు. ఈ సంఘర్షణ “ప్రతిజ్ఞ” నవలలో పూర్ణ, సుమిత్ర పాత్రల మధ్య సహేతుకంగా సాగుతుంది. పూర్ణ వైధవ్యం పొంది సుమిత్ర ఉన్న ఇంట్లోనే ఉంటుంది. సుమిత్ర తన భర్త కమలప్రసాద్ నిరాదరణకు గురై మానసిక క్షోభ అనుభవిస్తూ వుంటుంది. ఇక కమలప్రసాద్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే “కన్యాశుల్కంలోని గిరీశం లాంటివాడు!” భార్యని చిన్నచూపు చూస్తూనే పూర్ణని లొంగదీసుకోవాలని అనేక ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు.

సుమిత్ర తన భర్త పూర్ణ వైపు ఆకర్షితుడవుతున్నాడని పూర్ణని హెచ్చరిస్తూ ఉంటుంది. పైకి పూర్ణని సూటిపోటిమాటలు అంటూ వుంటుంది.

కానీ మనసులో పూర్ణకి అండగా వుంటుంది. ఈ విషయాన్ని చివరలో రచయిత వెల్లడిస్తాడు. పూర్ణ యవ్వనంలో భర్తని కోల్పోయి స్నేహితురాలు ప్రేమ ఇంటికి చేరి, స్నేహితురాలు అన్న కమలప్రసాద్, సుమిత్ర సంసారాన్ని చక్కదిద్దలేక, కమలప్రసాద్ తనని లొంగదీసుకోవడానికి చేసే ప్రయత్నాల్ని అడ్డుకోవడంలో సందిగ్ధతని చంపుకోలేక మానసిక సంఘర్షణ పడుతూ... తనవల్ల తనని ఆదరించిన కుటుంబానికి చెడ్డపేరు వస్తుందని బాధపడుతూ...పరిపరి విధాలా ఆలోచిస్తూ..... చివరికి కమలప్రసాద్‌ని ధైర్యంగా, భౌతికంగా ఎదుర్కొంటుంది. కమలప్రసాద్ చేసిన వ్యతిరేక ప్రాపగాండా తననెంత బాధించినా... ఒక్కొక్కసారి ఆత్మహత్య చేసుకోవాలన్నంత నిరాశ కలిగినా...మళ్ళీ మళ్ళీ తనని తాను జయిస్తుంది.

ప్రేమావతి, పూర్ణ, సుమిత్రలని ఒక్కసారి మీ మదిలోకి ఆహ్వానించండి. మీకు వెయ్యి ఏనుగుల బలం వస్తుంది. ఈ నవలని మన యువతరం చేత కానీ చదివించగలిగితే... దిశచట్టాలు, నిర్భయ చట్టాలు అఖర్లేదు.

వ్యాసం

పేరులో ఏముంది?

పి. వరలక్ష్మి

కడప జిల్లాను వైయస్ఆర్ జిల్లాగా పేరు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించినప్పుడు ఈ ప్రాంత భౌగోళిక ప్రత్యేకత, చరిత్ర, సంస్కృతి గురించి దాదాపుగా చర్చ లేదు. 2009లో వైయస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తర్వాత తీసుకున్న నిర్ణయమది. చాలా కొద్ది మందిమి మాత్రమే అభ్యంతరం తెలుపుతూ శతాబ్దాల నుండి ఉనికిలో ఉన్న పేరును రద్దు చేయవద్దన్నాం. రాజశేఖరరెడ్డికున్న పెద్దపేరును, జిల్లాకు సంబంధించి మరుగున పడిన చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతల్ని ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్‌కు, హైకోర్టుకు కూడా ఇచ్చి, రచయితల దగ్గరి నుండి వివిధ పార్టీల రాజకీయ నాయకుల దాకా అందరి చుట్టూ తిరిగి 'కడప' ప్రతిష్ట దిగజార్చొద్దని విజ్ఞప్తి చేసుకున్నాం. అప్పటికే మనోభావాల బ్యాచ్ చీటికీ మాటికీ సంస్కృతి పేరుతో హల్‌చల్ చేస్తూ ఉంది కానీ పెట్టింది రెడ్డిగారి పేరు కాబట్టి చప్పుడు చేయలేదు. వైయస్ కుటుంబం పట్ల ఉండే భయభక్తులు, సొంత ప్రయోజనాలు కూడా చాలా మందిని మాట్లాడనివ్వలేదు. పైగా అసలు ఈ పేరు గొడవ మీకెందుకు అని అడిగినవాళ్లున్నారు. ఇక్కడ రవ్వంతైనా ప్రజాస్వామిక సంస్కృతి ఎదగకపోవడానికి అతి ఎక్కువ దోహదం చేసిన మనిషి పేరు ఈ ప్రాంతానికి రావడం ఎంత విషాద ప్రహసనం అనుకున్నాం. మనసు కలుక్కుమన్నా సార్థకనామంలే అనుకుని విరక్తిగా నవ్వుకున్నాం. ఇక ఇప్పుడైతే రాయలసీమ అస్థిత్వవాదులకు అది ఒక పవిత్రనామం అయిపోయింది.

సీన్ కట్ చేస్తే జిల్లాల పునర్విభజన సందర్భం. రాయలసీమకు మరో ఆణిముత్యం దొరికింది. ఆధ్యాత్మిక ప్రచారకుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన మిరకిల్ బాబా పేరు ఒక కొత్తజిల్లాకు పెట్టేశారు. ఆ ప్రాంతానికి చేసిన సేవా కార్యక్రమాల మాటున ఆయన ఆశ్రమంలో జరిగిన అకృత్యాలు ఒకటి కాదు, రెండు కాదు సుమారు వెయ్యి పేజీల గ్రంథం అయింది. మహిమల పేరుతో ఆయన చేసే గారడీలు కెమెరాలకు చిక్కి ఎన్నోసార్లు బహిరంగమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా పేరు పట్ల సామాజిక మాధ్యమాల్లో కొన్ని పోస్టులు తప్ప సుమారుగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. ఇక ఎన్‌టిఆర్ పేరు అంతకన్నా వివాదాస్పదమైనది కాదు కదా.

మళ్లీ సీన్ కట్ చేస్తే జిల్లాల పునర్విభజన ప్రకటన తర్వాత నెలన్నరకు కోనసీమ జిల్లాకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యంతరాలు ఉంటే నెల రోజులలోపు తెలపొచ్చని కూడా చెప్పింది. ఇదివరకు ఏ పేరు పట్ల లేని అభ్యంతరాలు, ఆగ్రహావేశాలు అంబేద్కర్ పేరు వినగానే పెల్లుబికాయి. అయితే ఇదివరకు మా ప్రాంతానికి ఫలానా పేరు పెట్టాలని డిమాండ్ కూడా ఏ ప్రాంత ప్రజల నుండి రాలేదు. ఒక్క అంబేద్కర్ పేరు కోసమే చాలా ఏళ్లుగా ఆ డిమాండ్ ఉంది. దళితుల డిమాండ్‌ను అన్ని రాజకీయ పార్టీలు బలపర్చాయి. తీరా ఆ పేరే వివాదాస్పదమూ అయింది.

ప్రాంతాల పేర్లు ఆ సమాజ సాంస్కృతిక స్థాయిని తెలుపుతాయి. సంస్కృతిని, చరిత్రను ఏ పునాది నుండి, ఏ కోణం నుండి చూస్తున్నారు అన్న విషయం ఇందులో ఉంది. ఆ ప్రకారంగానే ఏ ప్రతినిధులను కోరుకుంటున్నారో వ్యక్తమవుతంది. వైయస్ఆర్, సత్యసాయి, ఎన్‌టిఆర్, అంబేద్కర్ పేర్ల చుట్టూ వచ్చిన ప్రతిస్పందనలు ఇదే చెప్తున్నాయి.

కోనసీమకు ఆయన పేరు పెట్టడానికి అంబేద్కర్ ఇక్కడ పుట్టాడా అని అడిగినవాళ్లున్నారు. ఇది దళిత వ్యతిరేకతను ప్రదర్శించడానికి సాకు మాత్రమే. ఎందుకంటే అంబేద్కర్ పేరు ఇప్పుడు దళిత చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక. అంబేద్కర్ మేధస్సు, కృషి అంతకు మించినది కావచ్చు. మొత్తంగా ఆధునిక ప్రజాస్వామ్యపు విలువల వైపు ఆయన నిలబడ్డాడు. అయితే ఇటీవలి దశాబ్దాల్లో బలంగా ముందుకు వచ్చిన సామాజిక ఉద్యమాలు అంబేద్కర్‌ను వాటికి సంబంధించిన రాజకీయ ప్రతినిధిగా ఏకగ్రీవంగా నిలబెట్టాయి. అంబేద్కర్ విగ్రహాల స్థాపన, అంబేద్కర్ పేరు దానినే సూచిస్తాయి. మా ప్రాంతానికి అంబేద్కర్ పెట్టాలి అని అడగడం వెనక కూడా అంతర్లీనంగా తమ సామాజిక రాజకీయ ఆకాంక్షలను గుర్తించి గౌరవించాలనే డిమాండ్ ఉంది. కనీసం ఇలా అర్థం చేసుకున్నారు కాబట్టే అగ్రకులాలు దానిని సహించలేకపోయాయి.

మొదట మాట వరసకు సమర్థించిన పార్టీలన్నీ తీరా నోటిఫికేషన్ విడుదల చేశాక వారి అసలు నైజాన్ని ప్రదర్శించాయి. మే 24 ఆందోళనల్లో ఆ పార్టీల శ్రేణులన్నీ పాల్గొన్నాయి. నిరసన ప్రదర్శనకు జరిగిన సమీకరణ, విధ్వంసకాండ కేవలం భావోద్వేగాల వెల్లువ కాదు. కోనసీమ పేరుపట్ల సెంటిమెంటు అసలే కాదు. ఒక సామాజిక డిమాండ్‌కు వ్యతిరేకంగా జరిగిన సామాజిక సమీకరణ ఇది. ఒక మంత్రి ఇంటిని, ఒక ఎమ్మెల్యే ఇంటిని, వాహనాలను తగలబెట్టినా, ఇరవై మంది పోలీసులకు గాయాలైనా, ఆందోళనకారుల పట్ల 'సంయమనం'తో వ్యవహరించారంటే వారు ఏ వర్గమో గుర్తించి ఇచ్చిన మర్యాద అది. సాధారణ ప్రజలు అటువంటి కోపోద్రేకాలు ప్రదర్శిస్తే పోలీసు తూటాలు నేరుగా వారి గుండెల్లోకి దిగుతాయి.

మామూలుగా ఇటువంటి సమీకరణలు చేసి, హింసాకాండను రెచ్చగొట్టే మనువాద పార్టీగా బిజెపికి పేరుంది. ఆ విషయంలో అది నాలుగాకులు ఎక్కువ చదివుండొచ్చు గాని ఏ బూర్జువా పార్టీ దానికి తీసిపోదు. ఇది మన సామాజిక వ్యవస్థకున్న బలం. ఆస్తితో పాటు ఆధిపత్య కులబలం లేకుండా ఆ పార్టీల మనుగడను ఊహించలేం. ఈ సందర్భంలో గుర్తించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. ఇష్టమున్నా లేకపోయినా అంబేద్కర్‌ను బహిరంగంగా వ్యతిరేకించే సాహసం ఏ పార్టీ చేయలేదు. అంటే దళిత సామాజికవర్గాన్ని మునుపటిలాగా పక్కన పెట్టే స్థితి ఇప్పుడు లేదు. కనీసం పైపై మాటలతో వారిని మభ్యపెట్టడమో, సంతృప్తిపరచమో చేయాలి. ఇది ముఖ్యమైన సామాజిక చలనాన్ని సూచిస్తుంది. అదే సమయంలో దళితులు సామాజిక ఆర్థిక రాజకీయ వాటాకు సంబంధించిన మౌలిక డిమాండ్లు లేవనెత్తితే తీర్చే స్థితిలోనూ ఏ పార్టీ లేదు.

ఎవరు ఎంత అరిచి గోలపెట్టినా చివరికి అంబేద్కర్ కోనసీమ పేరే ఖరారవ్వడం కొసమెరుపు.

"నా పుస్తకం నా ఇతర సహ ముద్దాయిలకు సహాయ పడుతుందని ఆశిస్తాను"

'ఇన్నోసెంట్ ప్రిజనర్స్' (బేగునాహ్ ఖైదీ) పుస్తక రచయిత **అబ్దుల్ వాహిద్ షేక్** తో **జియాఉస్‌సలామ్** ఇంటర్వ్యూ



తప్పుడు ఆరోపణలతో ఆయన సుదీర్ఘకాలం జైల్లో గడపాల్సి రావడం ఆయనను సదృఢపరచింది. ఇవ్వాళ అబ్దుల్ వాహిద్‌షేక్ 2006 ముంబై ట్రయిన్ (వరుస) పేలుళ్ల కేసు గురించి, ముద్దాయిగా తాను గడిపిన తొమ్మిది సంవత్సరాల గురించి ఏ ద్వేషభావం లేకుండా మాట్లాడుతాడు. ఇంకెవరి అనుభవం గురించో వివరిస్తున్నట్లుగా మాట్లాడుతాడు. వాస్తవమేమిటంటే (ముంబై)లో లోకల్ ట్రెయిన్లలో వరుసపేలుళ్లు జరిగి 180 మందికన్నా ఎక్కువ చనిపోయినట్లుగా నమోదయ్యాక, మామూలుగా ప్రశ్నించి వదిలిపెడతామని షేక్‌ను అరెస్టు చేశారు.

అప్పుడా బడి పంతులుకు 2006 సెప్టెంబర్‌లో తన ఇంటి నుంచి స్థానిక పోలీసు స్టేషన్‌కు ఆయన నడక ఆ దారిలో ఒక దశాబ్దంపాటు ఆఖరి ప్రయాణమవుతుందని తెలీదు. ఆయన సహ ముద్దాయిలు 13 మందిలో 2015లో నిర్దోషిగా విడుదలయినవాడు ఆయన ఒక్కడే.

ఆయన విడుదలను, జైల్లో తన అనుభవాన్ని 'బేగువాహ్ ఖైదీ' అనే పుస్తక రూపంలో రాయడంలో అర్థవంతం చేసున్నాడు. దీని ఇంగ్లిషు అనువాదం 2019 అక్టోబర్‌లో 'ఇన్నోసెంట్ ప్రిజనర్'గా విడుదలయింది. ఇప్పుడు షేక్ ప్రతి లిటరరీ ఫెస్టివల్/ సాహిత్య ఉత్సవాలకు ఆహ్వానితుడే. ఆయనను ఆ పుస్తకం గురించి మాట్లాడడానికి పోటీపడి పిలుస్తున్నారు. ఆయన తన పుస్తకం గురించి మొదట ఢిల్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, తర్వాత ముంబైలో మాట్లాడాడు. ఆ తర్వాత బెంగళూరు లిటరరీ ఫెస్టివల్‌లో పాల్గొన్నాడు. 'ఫ్రంట్‌లైన్' వేసిన కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి ఆయన కొంత సమయం కేటాయించాడు. ఆ ఇంటర్వ్యూలో కొన్ని భాగాలు:

ప్రశ్న: ముంబై ట్రయిన్‌లో పేలుళ్ళ జరగడానికి ముందు మీరు ఒక స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు కదా, ఏ ఒక రోజయినా రచయితనవుతానని కలలుకన్నారా?

జవాబు: లేదు. రచయిత కావాలని ఆలోచన నాకెప్పుడూ లేదు. నన్ను జైల్లో పెట్టాకే నాకా ఆలోచనవచ్చింది. నన్ను అరెస్ట్ చేయకముందు నేను ముంబైలో పిఎచ్‌డి చేస్తున్నాను. నేను అబ్దుల్ ముజీహిబ్ జహీద్, అనే ఉర్దూ కవిపై పరిశోధన చేస్తున్నాను. నన్ను జైలుకు పంపారు కనుక నేను అది వదిలిపెట్టాల్సి వచ్చింది. బదులుగా జైల్లో నా అనుభవాలు రాయాలని నిశ్చయించుకున్నాను. ప్రపంచానికి (ముంబై అర్థర్ రోడ్) జైల్లో మా (13 మంది నిందితులు) అనుభవాలు చెప్పాలనుకున్నాను.

ప్రశ్న: జైల్లో ఒక పుస్తకం రాయడం దాదాపు అసాధ్యం కదా. ఎప్పుడూ మీ మీద నిఘా ఉంటుందే, మీరు ఎట్లా (ఆ నిఘా తప్పించుకొని) రాయగలిగారు?

జావాబు: అవును అది చాల కష్టం. వాళ్లెప్పుడూ నిన్ను అనుమానంతో చూస్తారు.

ప్రశ్న: మీ రాతలను జైల్లోపల స్వాధీనం చేసుకున్నారా?

జవాబు: ఓహ్! అవును అది ఎన్నోసార్లు జరిగింది. నేను రాసిన కాగితాలను లాక్కున్నారు. చాలసార్లు చాలా కాగితాలు తగులబెట్టారు. అయినా నేను మానుకోలేదు. నేనేదో మార్గం కనిపెట్టాను. నన్ను చూడడానికి వచ్చిన కుటుంబ సభ్యులతో అవి బయటికి పంపగలిగాను. కొంతమంది పోలీసులూ కూడ సహకరించారు. మెల్లగా అవన్నీ పోగుపడ్డాయి. 2015 తీర్పుతో నేను బయటికి వచ్చాక 'బేగునాహ్ ఖైదీ' కి తుది రూపం ఇచ్చి ప్రచురణకర్తలకు పంపాలని నిర్ణయించుకున్నాను. దాని ఇంగ్లిషు అనువాదం 'ఇన్నోసెంట్ ప్రిజనర్' అక్టోబర్‌లో వెలువడింది. అది మహారాష్ట్రకు చెందిన డాక్టర్ యూసుఫ్ అనువదించాడు.

ప్రశ్న: మూల లిఖిత్ గ్రంథంలో ఎన్ని పదాలు లేదా పేజీలున్నాయి?

జవాబు: నేను 500 పేజీల దాకా రాశాను. బహుశా లక్షకన్నా ఎక్కువ పదాలు. నేను చాల నిజాయితీతో, చిత్తశుద్ధితో రాసాను. పరిణామాలు ఎట్లా జరిగితే అట్లా రాసాను. ఎవరి సానుభూతి పొందడానికో నా అనుభవాలను ఎక్కువచేసి రాయలేదు. అదే సమయంలో, బయటి ప్రపంచానికి, కేవలం ఆరోపితుడయినంత మాత్రాన ముద్దాయి ఏ అనుభవాలను చవి చూస్తాడో తెలియజెప్పాలనుకున్నాను.

ప్రశ్న: మీరు స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) యాక్టివిస్ట్ (క్రియాశీల కార్యకర్త) అని అందుకే మీరు ఈ (నేరంలో) ముద్దాయి అయ్యే అవకాశం ఉందని అరెస్టు చేశారని విన్నాము.

నన్ను అరెస్టు చేశారు. అదొక తప్పుడు కేసు.

ప్రశ్న: మీకు సిమితో ఏ సంబంధమూ లేదా?

జవాబు: లేదు. ఏమాత్రం లేదు. నేను ఒక ఉపాధ్యాయుడ్ని. ఎప్పుడైనా నన్ను సిమి మీటింగ్‌లకు పిలిచేవాళ్లు. నేను వెళ్లేవాణ్ని. కాని నేను ఎప్పుడూ సభ్యుణ్ని కాదు. పోలీసులు నేను సభ్యుణ్నని ఆరోపించారు. సిమిని నిషేధించిన తర్వాత కూడ నేను దాని కార్యకలాపాల్లో పాల్గొన్నానని ఆరోపించారు. దాని నుంచి ఒక కేసును రచించారు. అందువల్ల పోలీసు రికార్డులలో నా పేరు నమోదయింది. అపుడప్పుడు పోలీసులు నన్ను వేధించడం ప్రారంభించారు. నగరంలోగానీ, బయటగానీ ఏ సంఘటన జరిగినా నన్ను స్థానిక పోలీసు స్టేషన్‌కు పిలిపించేవాళ్లు. ప్రతిసారీ నేను వెళ్లేవాణ్ని. నాకు సిమితో ఏ సంబంధమూ లేదని, లేదా ఏ సంఘటనతోనూ సంబంధం లేదని రుజువుచేసుకోవడానికి నేను వాళ్లకు సహకరించేవాణ్ని.

ప్రశ్న: సిమి (నిషేధం) సంఘటనలో మీరు ఎంత కాలం జైల్లో ఉన్నారు?

జవాబు: నేను జైల్లో రెండు నెలలు ఉన్నాను. ముంబైలోనే ఉన్నాను.

ప్రశ్న: 2001-2005 మధ్యన పోలీసులు వచ్చి మిమ్ములను ప్రశ్నించినపుడు అది కేవలం ప్రశ్నించడానికే (ఇంటరాగేషన్ -విచారణ)కే పరిమితమైందా. లేదా హింసా ప్రయోగం చేసారా?

జవాబు: వాళ్లు మానసికంగా నన్ను వేధించారు. వాళ్లు నన్ను పోలీసు స్టేషన్‌లో గంటల తరబడి కూర్చోబెట్టి ప్రశ్నల వర్షం కురిపించేవారు. ముంబై పేలుళ్ల గురించి కూడ మొదట్లో ప్రశ్నలడగడం వరకే పరిమితమయ్యారు. నేను వాళ్లకు సహకరిస్తూపోయాను. ఐనా సరే వాళ్లు నన్ను ముంబై పేలుళ్ల కేసులో పెట్టారు.

ప్రశ్న: పేలుళ్ల తర్వాత, మీరు ఐదేళ్లుగా వాళ్ల విచారణకు సహకరిస్తూ వస్తున్నారు కదా. అటువంటప్పుడు పోలీసులు ఏ విధంగా ఆ నిర్ణయానికి రాగలిగారు?

జవాబు: పోలీసులు ఆ రికార్డులన్నీ చెరిపేసారు. నన్ను తీవ్రవాది అని, బాంబు పేలుళ్ల నిందితుడని అన్నారు. నేను వాళ్ల రేడార్‌లో పడిపోయానని, అజ్ఞాతంలోకి వెళ్లిపోయానని, ఒక ఇన్ఫార్మర్ నా ఆచూకీ తెలిపాడని, తప్పించుకు పారిపోతున్నపుడు నన్ను ఘట్‌కోపర్ రైల్వేస్టేషన్ నుండి ఎత్తుకొచ్చారని ఆరోపించారు. వాస్తవానికి వాళ్లు నా ఇంటి నుండి నన్ను తీసుకెళ్లారు.

ప్రశ్న: తొమ్మిది మంది పాకిస్థానీలకు మీరు ఆశ్రమిస్తున్నట్లు ఆరోపించారు కదా?

అవును, వాళ్లదే చెప్పారు. ముంబ్రాలో నేనొక ఫ్లాటు అద్దెకు తీసుకున్నాను. పేలుళ్లకు ముందు, తర్వాత కొంతమంది పాకిస్థానీలు అక్కడికొచ్చారని, నేను వాళ్లకు ఆశ్రయమిచ్చానని చెప్పారు. వాళ్ల ఆరోపణ ఏమిటంటే పేలుళ్ల నిందితులైన పాకిస్థానీలకు నేను ఆశ్రయమిచ్చానని.

ప్రశ్న: మీకు పాకిస్థానీలతో సంబంధం లేదు. మరి పోలీసులు ఆ నిర్ధారణకు ఎలా వచ్చారు?

పోలీసులు కథ అల్లారు. అటువంటి కల్పనలలో వాళ్లు నిపుణులు. వాళ్లు ఆరోపిస్తున్నది సత్యమనడానికి సాక్షులను సృష్టించారు. వాళ్లను కూడ దేహశుద్ధిచేసి, బెదిరించిన తర్వాత సాక్షులుగా మార్చగలిగారు. నా ఒక బంధువును అరెస్టు చేసారు. అతణ్ని చిత్రహింసలు పెట్టారు. నాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవలసిందిగా ఒత్తిడిచేసారు. అతడు భయపడిపోయాడు. అతడట్ల చెప్పడం వల్ల నేను తొమ్మిది సంవత్సరాలు జైల్లో ఉండాల్సివచ్చింది.

ప్రశ్న: అది మీ సంబంధాలను శత్రు భావనగా మార్చి ఉంటుంది?

జవాబు: లేదు. అతడది పోలీసుల ముందు మాత్రమే చెప్పాడు. కాని ఆరు సంవత్సరాల తర్వాత అతడు కోర్టులో చెప్పాల్సివచ్చినపుడు, అతడు నిజం చెప్పాడు. అతడు తన మొదటి వాఙ్మూలం పోలీసుల ఒత్తిడి వల్ల ఇచ్చానన్నాడు. నా ఇంట్లో తానే పాకిస్తానీని చూడలేదన్నాడు.

ప్రశ్న: పోలీసులు నిజంగానే మిమ్ములను ఖాళీ కాగితాల మీద సంతకం చేయమన్నారా? మీరట్లా పుస్తకంలో రాసారు కదా?

జవాబు: అవును, వాళ్లు నన్ను ఖాలా కాగితాల మీద సంతకం చేయమన్నారు. ఆపైన వివరాలన్నీ తమ న్యాయవాది నింపుతాడన్నరు. నేను నిరాకరిస్తే, నన్ను మూడో డిగ్రీ హింసతో చిత్ర హింసలు పెట్టారు. వాళ్ల ఒత్తిడి, బెదిరింపుల వల్ల నేనా సంతకం చేయాల్సివచ్చింది.

ప్రశ్న: వాళ్లు అత్యంత తీవ్రంగా చిత్రహింసలు పెట్టారని, వాటికి లొంగిన వాళ్లలో మీరు ఆఖరి వారని విన్నాము. మిగతా ముద్దాయిలందరూ ముందే ఒప్పుకోలు పత్రాలిచ్చారని చదివాం.

జవాబు: అవును. ఆ చిత్రహింసలు అతి తీవ్రమైనవి. అవి దుర్భరమైనవి. కొన్నిసార్లు నగ్నంగా చేసి, రహస్య అంగాలకు కరెంట్ షాక్ ఇచ్చేవాళ్లు - మల రంధ్రంలో ఒక రకమైన తైలాన్ని ఇంజక్షను

ద్వారా పంపుతారు. అది శరీరమంతా మంటలు మండీ వేదన కలిగిస్తుంది. అప్పుడు వాళ్ళు నిన్ను కట్టివేసి నీళ్లల్లో నిలువునా గంటలతరబడి ముంచి ఉంచుతారు. నిన్ను ఒంటరి నిర్బంధంలో కట్టిపడేసి రోజుల తరబడి వుంచుతారు. నీకు ఆహారం కానీ, నీళ్లు కానీ ఇవ్వరు. నిద్రపోనివ్వరు.

ప్రశ్న: ఖైదీ ఇవన్నీ తట్టుకొని ఎట్లా బతకగలడు?

జవాబు: వీళ్లకో టెక్నిక్ (నైపుణ్యం) ఉన్నది. నువ్వు మరణించకుండాఉండేలా చిత్రహింసలు పెడతారు. ఎందుకంటే నిన్ను కోర్టులో హాజరుపరచాలి.

ప్రశ్న: ఆ సమయంలో మీరు మీ న్యాయవాదులను కలవగలిగారా?

జవాబు: రెండు విధాల కస్టడీ ఉంటుంది. పోలీసు కస్టడీ–జుడిషియల్ కస్టడీ. నిందితుడు పోలీసు కస్టడీలో ఉన్నపుడు, వాళ్లు అతన్ని న్యాయవాదిని కానీ, కుటుంబ సభ్యులను కానీ కలవనివ్వరు. ఎవరినీ కలవనివ్వరు. పోలీసు కస్టడీలోనే ఒప్పుకోలు పత్రంపై సంతకం తీసుకుంటారు. నా విషయంలో నేను పోలీసు కస్టడీలో ముప్పై రోజులున్నాను.

ప్రశ్న: మీరు పుస్తకం రాస్తున్నపుడు మీకు సలహాలు ఇవ్వడానికి ఎవరైనా ఎడిటర్ ఉన్నారా?

జవాబు: లేరు. ఎవ్వరూ లేరు. కాని నేను జైలులో ఉన్నపుడు, నేను పుస్తకం రాయాలని కృతనిశ్చయం తీసుకున్నపుడు, ఇటువంటి కేసులకు సంబంధించిన కొన్ని పుస్తకాలు చదివాను. ఆ తర్వాత కోర్టు అనుమతితో కొన్ని పుస్తకాలు తెప్పించుకున్నాను. నేను ఖైదీల డైరీలు చదివాను. నేను ఎస్ హుస్సేన్ జైదీ 'బ్లాక్ ఫ్రైడే' చదివాను. నేను భారతీయ, విదేశీ రచయితలను చదివాను. నేను చిత్రహింసలకు సంబంధించి, తత్సంబంధిత ఇతర విషయాల గురించి డాక్యుమెంట్‌లు చదివాను. నేను నా స్వీయ గాథ చెప్పాల్సిన అవసరం ఉందని గుర్తించాను. క్రమంగా విషయాలు దారికొచ్చాయి?

ప్రశ్న: పుస్తకం విడుదలయ్యాక పోలీసులు మిమ్మలను వేధించారా?

జవాబు: నేరుగా ప్రత్యక్షంగా కాదు కాని ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లు నా పుస్తకాన్ని చదువుతున్నరని తెలిసింది. నన్ను వేధించడానికి పోలీసులు మఫ్టీలో వచ్చేవాళ్లు. ఒక్కొక్కసారి వాళ్ల యూనిఫాంలోనే వచ్చేవాళ్లు.

ప్రశ్న: మీరు ఉపాధ్యాయుడుగా మళ్లా మీ ఉద్యోగం ఎట్లా పొందగలిగారు?

జవాబు: నేను తొమ్మిదేళ్లుగా సస్పెన్షన్‌లో ఉన్నాను. అది మైనారిటీ సంస్థ. వాళ్లు నన్ను పునర్నియామకం చేసారు కాని ఆ తొమ్మిదేళ్ల పూర్తి జీతం ఇవ్వలేదు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడ ఏ నష్టపరిహారం ఇవ్వలేదు. కాంగ్రెస్ నాయకులు కానీ, ఇంకే రాజకీయ పార్టీ నాయకులు కానీ నాకు సహాయం చేయడానికి ముందుకు రాలేదు. ఒక్క సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అబు ఆజ్మీ మాత్రమే నన్ను చూడడానికి వచ్చాడు. నాకు సహాయం చేయడానికి ప్రయత్నించాడు. అతడు పాఠశాల వాళ్లను కలిసి నన్ను ఉద్యోగంలోకి తీసుకొమ్మన్నాడు.

ప్రశ్న: మీ పుస్తకం ఇతర భారతీయ భాషల్లోకి అనువదింపబడుతున్నదా?

జవాబు: అవును. ఈ పుస్తకం బెంగాలీ, మరాఠీ, గుజరాతీలో వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రచురణకర్తలు అంతర్జాతీయ సాహిత్యోత్సవాలకు తీసుకపోయే ఆలోచనలు చేస్తున్నారు. నా పుస్తకం ఇంకా జైళ్లలో మగ్గుతున్న నా సహ ముద్దాయిలకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. వాళ్లను నేరస్తులుగా కోర్టు తీర్పు ఇచ్చింది. వాళ్లంతా అమాయకులు.

ఈ పుస్తకం వాళ్ల కష్టాలను వెలుగులోకి తెచ్చి వాళ్లకు న్యాయం లభించడంలో సహాయపడాలని నేను కోరుకుంటున్నాను. ఏ అమాయకుడు కూడ శిక్షింపపడకూడదు.

... ...

కోర్టు నిర్దోషిగా విడుదల చేసినప్పటికీ వహీద్‌షేక్ 2005 టెర్రర్ కాన్విక్ట్ అని (పోలీసు) నమోదు చేసారు. అతడు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసాడు. అక్టోబర్ 23, 2019 టు సర్కిల్స్.నెట్ స్టాఫ్ రిపోర్టర్ కథనం ప్రకారం...

గత ఐదు సంవత్సరాలుగా అబ్దుల్ వాహిద్ షేక్ సాపేక్ష స్వేచ్ఛా జీవితాన్ని అనుభవించాడు. ఈ కాలంలో న్యాయవాది కావడానికి రచయిత కావడానికి కేంద్రీకరించి కృషి చేశాడు.

కాని జైల్లో ఆయన గడిపిన దాదాపు ఒక దశాబ్ది టెర్రర్ కుట్ర ఆరోపణతో ఆయన జీవిత చీకటి దశ నుంచి విముక్తం చేసినట్లు లేదు. ఆయననట్లా వదిలేట్లు లేదు. అందుకే అతడు ఢిల్లీ హైకోర్టు తలుపు తడుతున్నాడు.

2019 సెప్టెంబర్ నెలాఖర్లో వహీద్ షేక్, ఇపుడు న్యాయవాది, సుప్రసిద్ధ రచయిత పేరు ఢిల్లీ హైకోర్టుకు సంబంధించిన ఒక ట్రిబ్యునల్ ఆయనను సిమిలో 'కాన్విక్ట్' (శిక్షపడిన వానిగా) జులై 2019లో చూపింది. అతనిపై అన్ని ఆరోపణలు కొట్టివేసి, ఆయనను నిర్దోషి అని 2015లో కోర్టు విడుదల చేసిన నాలుగు సంవత్సరాల తర్వాత కూడా ఇది జరిగింది. అంతకన్నా ముఖ్య విషయమేమంటే సెషన్ స్థాయి స్పెషల్ కోర్టు ఆయనకు అన్ని ఆరోపణలలో నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసిన తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం కానీ టెర్రర్ స్క్వాడ్ కానీ ఏ ఉన్నత కోర్టులోనూ సవాల్ చేయలేదు.

ఈ కరెస్పాండెంట్‌తో సుదీర్ఘంగా మాట్లాడిన షేక్ "సిమి నిషేధాన్ని సరియైందేనని తీర్పు చెప్పిన హైకోర్టు ఉత్తర్వులు అధికార గెజిట్‌లో ఆగస్టులో పెట్టారు. కాని నేనది సెప్టెంబర్‌లో కానీ చూడలేదు. అప్పుడు దానిని అంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే సిమితో నాకెన్నడూ ఏ సంబంధాలు లేవు, వాళ్ల ఏ చర్యల్లో నేను పాల్గొనలేదు. నన్ను అధికారులు కూడ హెచ్చరించలేదు. ఈ అంశంపై నన్ను మళ్లా ఎప్పుడూ పిలిచి ప్రశ్నించలేదు. ట్రిబ్యునల్ విచారణ ఢిల్లీలో జరిగింది. నేను ముంబైలో నివాసముంటాను." అని అన్నాడు. ఈ కేసు ఎందుకు తీసుకువచ్చారో నేనెంతకూ అర్థం చేసుకోలేకపోతున్నాననికూడ వహీద్ అన్నాడు. "2014-2019 మధ్యన సిమి కార్యకలాపాలు ఏమిటనేది ప్రభుత్వం నుంచి, సిమి తాలూకనుంచి కూడా ట్రిబ్యునల్ విన్నది. అటువంటప్పుడు ఇది 2006 నుంచి ఎందుకు తిరగతోడారు." తాను ఎక్కడ అపీల్ చేయవలసి ఉంటుందో మొదట తనకు ఏమీ తోచలేదని, చివరకు ఢిల్లీ హైకోర్టులో అపీల్ చేయడమే ఉచితమని భావించానన్నాడు. "ట్రిబ్యునల్ ఢిల్లీలోనే ఏర్పాటు చేయబడింది. కనుక నేను కూడ ఢిల్లీలోనే ట్రిబ్యునల్ గెజిట్ ఉత్తర్వులను

(మిగితాది 41వ పేజీలో...)

బతుకులపై బుల్డోజర్

కెక్యూబ్ వర్మ

ఇళ్ళు అంటే
ఒట్టి
ఇటుక సిమెంటు
గోడలు కాదురా

ఒక జీవిత కాలపు
నెత్తురూ చెమటతో
కట్టుకున్న కలల గూడు

ఇళ్ళంటే
కొన్ని నవ్వులూ
కొన్ని దుఃఖాలూ
పసిపాపల కేరింతలూ
చావు పుటకల
మధ్య మనిషికో
చిరునామా కదా

కలలని చిదిమేస్తూ
గూడునూ కూల్చే
నీ రాజ్యంలో
పావురాలకు చోటు లేదా?

ఈ నేలే చిరునామాగా
ఈ గాలే ఊపిరిగా
జీవించే వాళ్ళను
వేరు చేసి చూపే
నీ కుట్ర ఇంకెన్నాళ్ళు!

బతుకులపై
నీ బుల్డోజర్
నడకను కాలం
సహించదు!

అఫ్రీన్ ఫాతిమా
ఇప్పుడు
ఒంటరి కాదు!!

వెన్నెల తాకని గుమ్మానికి

కిరణ్

మనసుని
మబ్బులు కమ్మేసినప్పుడు
దప్పు దరువుతో
దిగులు
దారులు ముసుకుపోతాయి

మెతుకు దూరమై
ఆకలి వెంటాడుతున్నప్పుడు
పాటతో
పిడికిలి బిగుసుకున్న నడక
పోరుజెండాతో
పయనమవుతుంది

వెలివాడకు
దారివేసిన
అంటరానితనం
బొడ్రాయిదగ్గర
చరమగీతం పాడుతుంది

ఇల్లంతా చీకటి అలముకొని
వెన్నెల తాకని గుమ్మానికి
పాదాలను హత్తుకున్న
గజ్జల సవ్వడి
దిశను
నిర్దేశిస్తుంది

నిదానమైన గుండెచప్పుడు
నెత్తుటి జెండాను భుజంపై భారం మోపి
అంతిమయాత్రగా
పడమర దిక్కు
పయనమయ్యింది

ఒకరిగొంతు పూడుకుపోయింది
ఒకరి కనుపాపలనుండి కన్నీరు వొలికింది
ఒకరి ఆరాధన
ఒకరి ఆలాపన
ఒకరి నినాదం

పిలుపు పిడికిళ్లు

ఉజ్వల్

పిడికిళ్ళు.. పిడికిళ్లు..

మొక్క మొక్కనూ
పొడుచుకొచ్చిన చిగురుటాకులై..

చెట్టు చెట్టుకూ
విరగకాసిన పూపిందెలై..

ఎటుచూసినా పిడికిళ్ళే..

అడవి నిండా
పిడికిళ్ళ రెపరెపలే..

పుటుకో.. స్థానికతో.. లైంగికతో..
ఏదైతేనేం.. ఏదైతేనేం..

సకల వర్గాగ్రహాల్ని..
వళ్ళోకెత్తుకుని రణముగ తీర్చి
ఇక నీగేరీ..నా గేరీ.. సిలింగేరేనంటూ
పోరుకు సిద్ధం కమ్మంటున్నది ఎర్రజెండా..!!

విస్ఫోటనం

కెనరి

ఆకలిపేగు విసిరిన ఆఖరి కేక
ఆకులు రాలిన చిటారు కొమ్మల్లో రెపరెపలాడింది
తడి ఆరిన గుండెగదుల్లో రేగిన అలజడి
మట్టి వాసనను పల్లవిగా పాడుతోంది

అరవిరిసింది అనాది కల
ధారగ కురుస్తున్నది వెన్నెల అల
అగ్నివీణ మీటుతున్నది అడవి
భగ్న కళలో నిమగ్నమైవున్నది పరాన్నజీవి

పడుతూ లేస్తూ
పదునుదేరుతున్నది నైపుణ్యం
విస్తుపోయి చూస్తున్నం
కిటికీకి ఆవల
గిరికీలు కొడుతోన్న సాహసగాథలు
ఉద్వేగంతో వింటున్నం
తెగిపడుతున్న శిరస్సులనుండి
రహస్య పరిమళం రాలిపడుతున్నది
బొట్లుబొట్లుగా

ఆకుపచ్చని దేహంపై పారుతున్న
నులివెచ్చని నెత్తురు మడుగు
ఆశగా అడుగుతున్నది
ప్రశ్న పాతదే
'మానవ మాత్రులారా మీ
మౌనం
బద్దలయ్యే రోజెపుడని'

విద్వత్తులోంచి

గవిడి శ్రీనివాస్

నేను
విద్వత్తులోంచి ప్రశ్నల ముడులు విప్పి
ఉదయాలని ముస్తాబు చేస్తూ
ఒక నిర్లిప్త నిశీధిలోనుంచి
ఒక నిశ్శబ్ద విప్లవాన్ని జనింపచేశాను

కాలాన్ని కళ్లెలుకట్టి ఆపటం ఎవడివసం
సూర్యుణ్ణి చేతుల్లో బంధించటం
అజ్ఞాన వారధికి అంకురం వేయడమే

నిత్యం కాలాన్ని కాగుతున్నపుడు
శ్రమ ఓ పక్క వాడిపోతున్నపుడు
ఫలితం ముక్కలౌతున్నపుడు
కన్నీళ్లు రెక్కలు తొడుక్కున్నప్పుడు
ఎర్రని సూర్యోదయాలు రెపరెపలాడుతాయి

కాళ్ళ కింద
కూసింత నేలకూడా పరాయిదయినపుడు
తెలియని గాలానికి చేపలయినపుడు
ఒక ప్రశ్న పదునెక్కుతుంది
ఒక ఉద్యమం తలకెక్కుతుంది

జాత్యహంకారాల అంధకారానికి
చరమగీతం వినబడుతుంది.

వేట

గలణ్

అవును నిజమే
నాతో నీకు ఎట్లైనా కష్టమే
వదిలేస్తే నిత్యం
నీ భీభత్సాన్ని తూర్పార బడతాను
తూటా పేలిస్తే నా రక్తం
నీ పైకే చిందుతుంది
జైల్లో పడేస్తే
వెనక్కి తిరిగి
నీ వైపే చూస్తాను

స్వేచ్ఛను ఖూనీచేసే మరో నిరంకుశ చట్టం

ఎ. నర్సింహారెడ్డి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పౌరస్వేచ్ఛపైన, ప్రజాతంత్ర హక్కులపైన దండెత్తుతున్నది. నేరస్తులను గుర్తించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అత్యంత దూకుడుగా కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. 1920లో బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన చట్టం స్థానంలో దీనిని ప్రతిపాదించగా ప్రతిపక్షాలు, సామాజిక మేధావులు వ్యతిరేకించినా వారి మాటలను పట్టించుకోకుండా పార్లమెంటు బిల్లుకు ఆమోదం తెలిపింది. ది క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) బిల్, 2022 చట్టరూపం దాల్చితే పోలీసులు మరింత ప్రమాదకరంగా మారుతారన్నది ప్రతిపక్ష సభ్యులు అభిప్రాయం. రాష్ట్రపతి ఏప్రిల్ 18న ఈ బిల్లుకు ఆమోదం తెలుపడంతో అది చట్టంగా మారింది. వ్యక్తి స్వేచ్ఛ ఒక అనుల్లంఘనీయమైన మానవ హక్కు, ఒక మానవ హక్కును నిరాకరించడమనేది దాని రద్దుకు ఆరంభమే అనడంలో సందేహం లేదు. కేంద్ర ప్రభుత్వ హోంశాఖ సహాయమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా 2022 మార్చి 28న ప్రవేశపెట్టిన- 'క్రిమినల్ ప్రొసీజర్(ఐడెంటిఫికేషన్) బిల్లు 2022' స్వేచ్ఛ హృదయంలోకి దిగబడిన బాకు.

నేర పరిశోధన రీతిలో 'డిఎన్‌ఎ' టెక్నాలజీ అందివచ్చిన కాలాన్ని గమనంలోకి తీసుకొని 1980లో 'ఇండియన్ లా కమీషన్' ఆధునిక వనరులను నేర పరిశోధనకు ఉపయోగపడే విధంగా వలసపాలన నాటి 1920 చట్టాన్ని సవరించాలని సూచించింది. అలాగే 2003 మార్చిలో జస్టిస్ వియస్ మలిమత్ ఆధ్వర్యాన నేర విచారణ వ్యవస్థ సంస్కరణలపై ఏర్పడ్డ నిపుణుల కమిటీ నేరస్తుల వేలిముద్రలు, ఒడ్డు పొడవు వంటి కొలతలు, ఫోటోలతో పాటు 'డిఎన్‌ఎ' పరీక్షకై రక్తం, తల వెంట్రుకలు, వీర్యం సేకరించేందుకు సిఫార్స్ చేసింది. పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టు, ఇప్పుడు వలస పాలకుల చట్టాలను తలదన్నే దుర్మార్గమైన చట్టాన్ని తెచ్చారు.

ఈ నూతన చట్టం వ్యక్తి(ఖైదీ) గోప్యత హక్కుకు విఘాతం కలిగిస్తుంది. ఈ చట్టం అమలులోకి వస్తే దేశం అంధకారంలోకి ప్రవేశించినట్లు అవుతుందని న్యాయకోవిదులు హెచ్చరించారు. ఈ చట్టం ద్వారా ఖైదీల బయోమెట్రిక్ వివరాలను సేకరించేందుకు దర్యాప్తు అధికారులకు విచక్షణాధికారాలు లభిస్తాయి. బయోమెట్రిక్‌తో సదరు వ్యక్తి వేలిముద్రలు, అరచేయి, పాదాల ముద్రలు, ఫోటోలు, ఐరిస్, రెటీనా స్కాన్‌లతో పాటు ఇతర భౌతిక, జన్యు సమూనాలను సేకరించే వీలు పోలీసులకు లేక జైలు అధికారులకు ఉంటుంది. ఖైదీల చేతిరాత, సంతకం నమూనాలనూ వారు సేకరించవచ్చు. పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా మాట్లాడుతూ సరైన రక్షణ చర్యలు లేకుంటే ప్రభుత్వానికి అపరిమితంగా విచక్షణాధికారాలను ఈ చట్టం కట్టబెడుతుందని అన్నారు. స్టాండింగ్ కమిటీ పరిశీలనకు దీనిని పంపాలని ఆమె కోరారు.

ప్రతిపక్షాల అభ్యంతరాల మధ్య పార్లమెంటులో ప్రవేశపెట్టిన క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) బిల్లు-2022 మోడీ ప్రభుత్వ మరో నిరంకుశ చర్య. బ్రిటిష్ వలస పాలకులు ప్రవేశపెట్టిన ఖైదీల గుర్తింపు చట్టం(1920)ని రద్దు చేసి, దాని స్థానే తీసుకొచ్చే బిల్లు ఆధునిక ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పౌర స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చేలా ఉండాలని ఎవరైనా ఆశిస్తారు. కానీ, మోడీ ప్రభుత్వం దీనికి పూర్తి భిన్నమైన రీతిలో బిల్లును తీసుకొచ్చింది. ఈ బిల్లు జీవించే హక్కును, మానవ హక్కులను మంటగలిపేదిగా ఉందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేసినా లెక్క చేయకుండా లోక్‌సభలో తనకున్న బండ మెజార్టీని ఉపయోగించుకుని చట్టానికి ఆమోదం పొందింది. ఇప్పటివరకు అమల్లో

ఉన్న ఖైదీల గుర్తింపు చట్టానికి ఇది మరిన్ని కోరలు తొడగడమే గాక, పరిధిని కూడా విస్తరింపజేసింది. పాత చట్టం ఒక పరిమిత కేటగిరీకి చెందిన దోషుల పాద ముద్రలు, వేలి ముద్రలు మాత్రమే నమోదు చేయాలని చెబుతోంది. కొత్త చట్టం దోషులతో బాటు, విచారణలో ఉన్న ఖైదీలు, అరెస్టయిన వ్యక్తుల నుంచి కూడా శరీర, జీవ నమూనాలను సేకరించే అధికారాన్ని దర్యాప్తు సంస్థలకు కట్టబెడుతున్నది.

ఈ చట్టం రాజ్యాంగంలో ఆర్టికల్ 21కి విరుద్ధం. దేశ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును బాహాటంగా ఉల్లంఘించడమే అవుతుంది. విచారణలో ఉన్న ఖైదీలను, నేరం చేసి ఉంటారన్న అనుమానంతో అరెస్టు చేసిన వారి నుంచి ఈ కొలతలు, నమూనాలు సేకరించడమంటే వారిని అవమానించడమే. 'నేరంతో సంబంధం ఉన్న వ్యక్తి' అని పేర్కొనడం ద్వారా ఈ బిల్లు విచారణ ఖైదీ, నిర్బంధంలో ఉన్నవారు, అనుమానితుడు, శిక్ష పడ్డవాడు అన్న తేడాను తుడిపివేసింది. మన రాజ్యాంగంలో లోటుపాట్లు ఎన్ని ఉన్నాగానీ ప్రతి పౌరునికి సమాన హక్కులను కల్పిస్తుంది. మన చట్టాల ప్రకారం నేరం రుజువు అయ్యేంత వరకు నేరస్తుడిని దోషిగా పరిగణించేందుకు వీలు ఉండదు. 1920 చట్టం ప్రకారం ఏడాది లేక అంతకంటే ఎక్కువ కాలం శిక్ష అనుభవించిన వ్యక్తులు లేక జైలుశిక్ష పడే నేరాలు చేసిన వారి 'కొలతల'ను తీసుకునేందుకు అనుమతిచ్చేది. కానీ ప్రస్తుత చట్టం అందుకు భిన్నంగా ఖైదీలు అందరి డేటా సేకరణకు అనుమతిస్తోంది. అమల్లో ఉన్న చట్టం కింద అరెస్టు అయిన వారుగానీ నిర్బంధ నిరోధక చట్టం కింద నిర్బంధించబడిన వారుగానీ అందరినీ ఒకటిగానే పరిగణిస్తోంది. 'స్మార్ట్ పోలీసింగ్' నెపంతో ఇప్పటికే 'ఫేషియల్ రికగ్నీషన్' పేరుతో చాలా రాష్ట్రాలలోని పోలీసులు ఈ టెక్నాలజీని వాడుతున్నారు.

బ్రిటీష్ వలసవాద ప్రభుత్వం 1920లో నేరస్తుల గుర్తింపు చట్టాన్ని ఆమోదించింది. మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైన నెల రోజుల తర్వాత ఈ చట్టం అమలులోకి వచ్చింది. జాతీయవాదం పెల్లుబుకుతున్న సమయంలో దేశ ప్రజలపై నిఘా పరిధిని విస్తరించడం ద్వారా వారిని మరింతగా నియంత్రించడానికిగానూ బ్రిటీష్ పాలకులు ఆనాడు నేరస్తుల గుర్తింపు చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టం నేరస్తుల ఫోటోగ్రాఫ్‌లు, వేలిముద్రలు, పాదముద్రలు వంటి వాటిని (కొన్ని పరిమిత కేసుల్లో నేరస్తులు కానివారిని కూడా) భద్రపర్చే అధికారాలను చట్టాన్ని అమలు చేసే అధికారులకు దఖలు పర్చింది. ఇలాంటి వివరాలను భద్రవర్చడానికీ, తొలగించడానికీ మరిన్ని నిబంధనలు తీసుకొచ్చారు. ఇప్పుడు 102 సంవత్సరాల తర్వాత, స్వతంత్ర భారతదేశంలో నెహ్రూ తర్వాత సుదీర్ఘ కాలం దేశాన్ని పాలిస్తున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం, వలస పాలనా కాలంనాటి చట్టం కంటే మరింత అధికంగా వ్యక్తిగత డేటాను సేకరించడానికి ప్రయత్నిస్తూ తాజా చట్టాన్ని తీసుకొచ్చి నేరస్తుల గుర్తింపు చట్టాన్ని మార్చింది.

'నేరంతో సంబంధం ఉన్న వ్యక్తి' అని పేర్కొనడం ద్వారా ఈ చట్టం విచారణ ఖైదీ, నిర్బంధంలో ఉన్నవారు, అనుమానితుడు, శిక్షపడ్డ వాడు అన్న తేడాను తుడిపివేసింది. 1920 చట్టం ప్రకారం ఏడాది లేక అంతకంటే ఎక్కువ కాలం శిక్ష అనుభవించిన వ్యక్తులు లేక జైలుశిక్ష పడే నేరాలు చేసిన వారి 'కొలతల'ను తీసుకునేందుకు అనుమతిచ్చేది. కానీ ప్రస్తుత చట్టం అందుకు భిన్నంగా ఖైదీలు అందరి డేటా సేకరణకు అనుమతినిస్తోంది. అమల్లో ఉన్న చట్టం కింద అరెస్టు అయిన వారుగానీ నిర్బంధ నిరోధక చట్టం కింద నిర్బంధించబడిన వారందరినీ ఒకటిగానే పరిగణిస్తోంది. సెక్షన్-2 కింద శిక్షను ఏడాది నుంచి ఏడేళ్లకు పెంచాలని సూచిస్తుంది. ఇదే సెక్షన్‌లో క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని సెక్షన్లు 53, 53-ఎ, 54ను ప్రస్తావించారు. అంటే నార్కో ఎనాల్సిస్, పాలీగ్రాఫ్ టెస్ట్, సైక్రియాట్రిక్ టెస్ట్‌లు కూడ 'కొలతలు'లో భాగమేనా? అన్నది సమాధానం లేని ప్రశ్న.

సెక్షన్-3లో ఏ చట్టం కింద అయినా శిక్షార్హమైన నేరానికి పాల్పడినట్టు నిర్ధారింపబడిన వ్యక్తితో సంబంధం ఉన్న 'ఏ వ్యక్తి నుంచి అయినా' కొలతలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే ఏ చట్టం కింద అయినా అరెస్టయిన వ్యక్తి నుంచీ ముందు జాగ్రత్తగా నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తి నుంచి కూడా 'కొలతలు' తీసుకోవచ్చని ఆ సెక్షన్ స్పష్టం చేసింది. ప్రతి చట్టమూ ఈ సెక్షన్ పరిధిలోకి రావడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అరెస్టయిన వ్యక్తిని, డిటెన్యూను కూడా నేరానికి పాల్పడినట్టు రుజువయిన వ్యక్తితో కలిపివేయడం మరింత దిగ్భ్రాంతికరంగా ఉంది. సెక్షన్ 144 (నిషేధాజ్ఞలు) ఉల్లంఘించడానికి ప్రయత్నించిన నిరసనకారులకు కూడా ఈ సెక్షన్ వర్తిస్తుంది. అరెస్ట్ కాని పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, రాజకీయ కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులు, ప్రగతిశీల రచయితలు, కవులు, కళాకారులు ఎవరైనా ఉన్నారా? తాను జీవిత కాలంలో ఏనాడు నిరసన తెలుపనని, అరెస్ట్ కాబోనని చెప్పగలిగే వారు ఎవరైనా ఉంటారా?

అలాగే సెక్షన్ 4 కింద ఏడేళ్ల కంటే తక్కువ శిక్షపడిన వ్యక్తి కొలతలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసే అధికారం మేజిస్ట్రేట్‌కు ఉండదన్న స్పష్టత లభించలేదు. అలాగే భారతీయ పౌరుని ఆయుర్దాయం 69.6 ఏళ్లు కాగా ఈ బిల్లు 75 ఏళ్ల రికార్డుల నిల్వకు అనుమతిస్తుంది. అంతేకాకుండా ఏదేని లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీతో వ్యక్తిగత డేటాను పంచుకునేందుకు జాతీయ నేరాల నమోదు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి)కు అనుమతిస్తుంది. సెక్షన్ 4 ప్రకారం వ్యక్తుల నుంచి తీసుకున్న కొలతలను నిల్వచేసి, 75 సంవత్సరాల పాటు సంరక్షించి, అవసరమైనప్పుడు చట్టాన్ని అమలుపరిచే ఏ ఏజెన్సీతోనైనా ఆ సమాచారాన్ని పంచుకోవచ్చని పేర్కొన్నారు. 'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ' అని మాత్రమే ఉంది గానీ ఒక నేరంపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీ అని లేకపోవడం గమనార్హం. పంచాయత్ లేదా మున్సిపల్ అధికారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ కానిస్టేబుల్, ట్యాక్స్ కలెక్టర్ తదితర ప్రభుత్వాధికారులు అందరూ ఏదో ఒక చట్టాన్ని అమలుపరిచేవారే.

ఈ సెక్షన్ 4 ప్రకారం వీరందరూ నిల్వచేసిన ఆ కొలతల సమాచారాన్ని డిమాండ్ చేసి పొందవచ్చు. మొత్తం మీద డేటా పరిరక్షణ ఉత్తమ పద్ధతులను అతిక్రమిస్తుంది. డేటా సేకరణ చట్టబద్ధమే అయినప్పటికీ ఓ ప్రత్యేక ఉద్దేశం కోసం సేకరించిన దానిని పరిమితంగా వినియోగించాలేగానీ ప్రతిదాని కోసం కాదు. బిల్లులో పదప్రయోగం చాలా చోట్ల అస్పష్టంగా ఉంది. కొన్ని నేరాల విచారణ కోసం శాశ్వత-వ్యక్తిగత డేటా సేకరణ అవసరం కావచ్చుగానీ అలాంటి నేరాలు ఏవన్నది గుర్తించగలగాలి. ఈ బిల్లులో అందుకు ఎలాంటి సూచనలు లేవు.

అలాగే సెక్షన్ 5 ప్రకారం ఖైదీల వ్యక్తిగత వివరాలను సేకరించే అధికారం సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి పోలీసు అధికారులకు మాత్రమే 1920 చట్టం కల్పించింది. సవరించిన కొత్త చట్టంలో హెడ్ కానిస్టేబుల్ స్థాయికి తగ్గని పోలీసు అధికారి లేక హెడ్ వార్డెన్ స్థాయికి తగ్గని జైలు అధికారి ఎవరికైనా వివరాలు సేకరించేలా సూచిస్తుంది. మేజిస్ట్రేట్ ఆదేశాలిస్తే చాలు ప్రతి వ్యక్తి తన వ్యక్తిగత వివరాలన్నింటిని సంబంధిత పోలీసు లేక జైలు అధికారికి ఇవ్వాల్సిందే. ఇలాంటి వివరాలు ఇవ్వాల్సిన వ్యక్తుల పరిధినీ కొత్త బిల్లు విస్తృతపరిచింది. వివరాలు ఇచ్చేందుకు

నిరాకరిస్తే ఐపిసిలోని సెక్షన్ 186 కింద నేరంగా పరిగణిస్తారు. ప్రతిఘటనకు/ నిరసనకు/ వ్యతిరేక గళానికి ఏమాత్రం ఆస్కారం ఉండదు. సంబంధిత వ్యక్తి నిరాకరించినప్పటికీ తమకు కావాల్సిన వివరాలను అధికారులు బలవంతంగా తీసుకుంటారు. మేజిస్ట్రేట్ నిర్ణయాన్ని సవాల్ చేసేందుకూ ఈ చట్టంలో అవకాశం కల్పించడం లేదు.

లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా దీనిని సమర్థించుకునేందుకు చేసిన వాదనలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయి. నూట రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన చట్టం వల్ల కేవలం వేలిముద్రలు, కాళ్ల ముద్రలు తీసుకోవడానికి మాత్రమే అవకాశం ఉందని, ఇప్పుడు తెస్తున్న చట్టం వల్ల వేలి, కాలి ముద్రలే కాకుండా అరచేయి ముద్రలు, ఫోటోలు, ఐరిస్, రెటీనా స్కాన్, శారీరక కొలతలు, జీవ నమూనాలు, చేతి రాత సంతకాలు సేకరించడానికి వీలు కలుగుతుందన్న మంత్రి అంతటితో ఆగలేదు. దీనివల్ల శిక్షల శాతం కూడా పెరుగుతుందని ముక్తాయింపు ఇచ్చారు. చట్టాలు ఎంత కఠినంగా ఉంటే శిక్షల శాతం అంత ఎక్కువగా ఉంటుందన్న మంత్రివాదన పసలేనిది. నేర నిర్ధారణ అవుతున్న కేసుల సంఖ్య తక్కువగా ఉంది నిజమే, దానికి కారణమేమిటి? దర్యాప్తు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, ప్రాసిక్యూటర్లు సరైన వారు కాకపోవడం, రికార్డుల నిర్వహణ సవ్యంగా లేకపోవడం వంటివి అసలు కారణాలు. అరెస్టయిన వ్యక్తుల, డిటెన్యూల, ఖైదీల మానవ హక్కులను ఉల్లంఘిస్తే ఆ అవరోధాలన్నీ తొలగిపోతాయా?

లఖింపూర్ ఖేరి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇదే మంత్రి తనయుడు ఆశిష్ మిశ్రా ఒక పథకం ప్రకారమే రైతులను కారుతో తొక్కించి చంపారని దీనిపై దర్యాప్తు జరిపిన సిట్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. అయినప్పటికీ అరెస్టయిన కొద్ది రోజులకే ఆ పెద్ద మనిషి బెయిల్‌పై బయటకొచ్చారు. ఏ తప్పు చేయని హక్కుల కార్యకర్త స్టాన్‌స్వామికి బెయిలు పుట్టకపోవడంతో నెలల తరబడి జైలులోనే మగ్గి, అక్కడే అనారోగ్యంతో కన్నుమూయాల్సి వచ్చింది. హక్కుల కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, ఉద్యమకారులపై ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయించడమే తప్పు. అటువంటి వారి నుంచి శరీర, జీవ నమూనాలు సేకరిస్తామనడం మరీ తప్పు. బ్యాంకులను వేల కోట్ల మేర ముంచేసే ఆర్థిక నేరగాళ్లు, పన్నులు ఎగ్గొట్టి కూడబెట్టుకున్న నల్లధనాన్ని విదేశాలకు తరలించే ఘరానా మోసగాళ్లు దర్జాగా తిరుగుతుంటే వారిని అరెస్టు చేయకుండా శిక్షల శాతం తగ్గిపోతుందని వగచి ఏం ప్రయోజనం? కఠినమైన చట్టాలు చాలా ఉన్నాయి. వాటిని ఎవరిపై ప్రయోగిస్తున్నారన్నదే ముఖ్యం. దీని నుంచి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం ఇటువంటి వాదనలను ముందుకు తెస్తున్నది.

బ్రిటీష్ కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేసినంతగా స్వతంత్ర భారతదేశంలో మరే ప్రభుత్వమూ చేయలేదంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ప్రభుత్వ విధానాన్ని ఆమోదించని ఎవరినైనా రాజద్రోహానికి పాల్పడిన వారిగా పరిగణిస్తున్నారు. జాతీయ నేర నమోదు సంస్థ(ఎన్‌సిఆర్‌బి) అందించిన గణాంకాల ప్రకారం 2014 నాటికి అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఒక్క రాజద్రోహ కేసు కూడా నమోదు కాకుండా ఉంటే, తర్వాత కాలంలో ఈ చట్టాన్ని ప్రయోగించిన రాష్ట్రాల సంఖ్య 19కి చేరింది. మోడీ ప్రభుత్వ హిందుత్వ- కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా విమర్శలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా ఉపా చట్టం కింద జైళ్లలో కుక్కుతున్నది. నేర శిక్షా స్మృతి (ఐడెంటిఫికేషన్) చట్టం జీవించే హక్కును కూడా అది హరిస్తుంది. పార్లమెంటులో చట్టం చేసిన పద్ధతి ఆందోళన కలిగిస్తోంది. ఇది మన ప్రజాస్వామ్యంలో చట్టాల రూపకల్పన విషయంలో పెరుగుతున్న సాధారణ అంశమనే చెప్పాలి.

ఇలాంటి నల్ల చట్టాలు చూపి ప్రజల నోరు నొక్కి వేయవచ్చు. యుఎపిఎ సవరణ చట్టం తెచ్చినప్పుడు అందరు వ్యతిరేకించారు. ఆచరణలో యుఎపిఎ తీవ్రస్థాయిలో దుర్వినియోగమవుతోంది. 2016-19 నుంచి యుఎపిఎ కేసులు భారీగా పెరిగాయి. 2016-19లో 5,128 కేసులు ఉంటే 7,050 మంది అరెస్టు అయ్యారుగానీ 2.2 శాతం కేసుల్లో మాత్రమే నేరాలు రుజువయ్యాయి. నిర్బంధం నిరోధక చట్టం కింద కేసులూ పెరిగాయి. అసమ్మతి గళాన్ని ఈ ప్రభుత్వం అణచివేస్తోంది. కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు సమయంలో 177 మంది రాజకీయ నేతలు అరెస్టు కాగా వారిలో 71 మంది ఎన్‌సి, 35 మంది పిడిపి వారు ఉన్నారు. ఈ రెండు జమ్మూ-కశ్మీర్‌కు చెందిన ప్రధాన రాజకీయ పార్టీలు. సిఎఎ వ్యతిరేక ఆందోళనప్పుడు 1,100 మందికి పైగా అరెస్టు కాగా 5,558 మందిని యూపీలో సిఎఎ వ్యతిరేక ఆందోళనల తర్వాత ముందస్తు అరెస్టులో భాగంగా నిర్బంధించారు. 2014-20లో ఏటా దేశద్రోహ కేసుల్లో 28 శాతం వరకు పెంపుదల కనిపించింది. సిఎఎ వ్యతిరేక ఆందోళనలప్పుడు 22 దేశద్రోహ కేసులు 3,700 మందిపై బిజెపి పాలిత రాష్ట్రాల్లో నమోదయ్యాయి. దశాబ్దంగా దేశంలో జర్నలిస్టుల నిర్బంధాలు, అరెస్టులు కూడా పెరిగాయి. ఫ్రీ స్పీచ్ కలెక్టివ్ నివేదిక ప్రకారం దశాబ్ద కాలంలో 154 మంది జర్నలిస్టులు తమ విధిని నిర్వర్తించినందుకు అరెస్టు అయ్యారు లేక నిర్బంధానికి గురయ్యారు.

ఈ నూతన చట్టం నిందితులనుంచి, నేరస్థుల నుంచి తీసుకున్న మెజర్మెంట్ సాంపిల్స్ స్టేషన్లో క్రైమ్ బ్యూరో డాటాబేస్‌లో 75 ఏళ్లు డిజిటల్ డాటాబేస్‌లో రికార్డుగా ఉంటుంది! నేరాల నిరోధన, పరిశోధనల కోసం ఇది వినియోగపడుతుంది! ఈ చర్య సమంజసమా? విజ్ఞులు, మేధావులు, ప్రాథమిక హక్కులను కాపాడటానికి శ్రమించే ప్రజాస్వామ్య వాదులు ఈ చట్టం విషయంలో దేశవ్యాప్తంగా చర్చించాల్సిన అవసరం ఏర్పడింది. నవరణల పేరుతో తెచ్చిన క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) చట్టం 2022, న్యాయాధీశులు, న్యాయవాదులు కూలంకషంగా అధ్యయనం చేసి ప్రైవేట్ హక్కులకు విఘాతం కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది! అయితే దేశవ్యాప్తంగా సమగ్ర చర్చ జరుగకమునుపే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం సరికొత్త పరిణామం.

ఈ బిల్లును ముందస్తుగా ప్రజల్లో చర్చకు పెట్టలేదు. ప్రజలు తమ అభిప్రాయం చెప్పడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. అందుకే 'లక్ష్యాలు, కారణాల ప్రకటన' విషయంలో బిల్లు సైలెంటుగా ఉండిపోయిందన్న వాస్తవంలోనే ఇది ప్రతిఫలించింది. వాస్తవానికి ప్రభుత్వ నిఘా అధికార పరిధిని విస్తరించాల్సిన అవసరం గురించి ఇది పేర్కొనాల్సి ఉండింది. ప్రజా చర్చలో భాగంగా ఈ అంశాన్ని లేవనెత్తేవారు. అందుకే ఈ బిల్లును అసలు ప్రజా సంప్రదింపుల్లో భాగం చేశారా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఈ అన్ని కారణాల వల్ల, ఈ కొత్త బిల్లు గురించి తీవ్రమైన ఆందోళన కలుగుతోంది. మరింత ప్రజాస్వామికమైన, సమ్మిశ్రితమైన ప్రక్రియ ఈ భయాలన్నింటికీ పరిష్కారంగా ఉంటుంది. కానీ ఈ ప్రక్రియకు ఎలాంటి ఆస్కారం లేకుండానే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడమే విచారకరం.

బ్రాహ్మణిజం - బుద్ధిజం - హిందూయిజం

రమేష్ పట్నాయక్

'మతాలను వర్గీకరించడానికి ఉపయోగించే పదాలు దేశ ప్రజలకు పరిచయం లేకపోవడం అనేది సరియైన నివేదికలు రాబట్టడానికి పెద్ద అడ్డంకిగా ఉంది. ప్రజల నానుడిలో ఉన్న మతం అన్న భావనలను ఎన్యూమరేటర్లు వాడిన పదాలు వ్యక్తం చేయలేదు. ప్రధానంగా 'హిందూ', 'ఆనిమిస్ట్' అనే పదాలు సమస్యాత్మకంగా ఉన్నాయి. ఏ భారతీయుడికి కూడా తన మతానికి అనువర్తించబడిన హిందూ అన్న పదం పరిచయం ఉన్నది కాదు. నీ మతం ఏమని అడిగితే ఉదాహరణకు ఆయన నేను శైవుణ్ణి అంటాడు...'

సెన్సెస్ కమీషనర్, 1921

నేడు మనం చూస్తూన్న హిందూమతం గత మూడు, నాలుగు వేల సంవత్సరాల కాలంలో రూప, సార, నామాలలో ఎన్నో మార్పులకు లోనయ్యింది. ఒక నాటి బ్రాహ్మణ మతం లేదా వైదిక మతం శ్రమణ మతాలు, ప్రధానంగా బుద్ధిజం ప్రభావం వలన తీవ్రమైన మార్పులకు గురయ్యిందని చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ చారిత్రక విషయాలను పరిచయం చేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ఈ వ్యాసం పొడుగునా మనం శ్రమణులు, శ్రమణ భావజాలం, శ్రమణ మతాలు అనే పదాలను ఉపయోగిస్తాం. అయితే, ఈ పదాలకు సరళమైన అర్థం రొమిలా థాపర్ రచన 'ఎర్లీ ఇండియన్స్ 172 వ పేజీ' లో కనిపిస్తుంది. దానిని ఇక్కడ ఉటంకిస్తున్నాను: "పునర్జన్మ నుంచి విముక్తి కొరకు కృషిచేసే వారే శ్రమణులు". అదలా ఉండగా, ఈ వ్యాసం లాల్ మణి జోషి రచన 'బ్రాహ్మణిజం - బుద్ధిజం - హిందూయిజం' కేంద్రకంగా నడుస్తుంది. లాల్ మణి జోషి లేవనెత్తిన ప్రశ్నలను చర్చించే ముందు అసలు హిందూ మతం అనే నానుడి చరిత్రలో ఎప్పుడు ప్రారంభం అయిందో, అధిక జనాభాలో ప్రాచుర్యం పొంది ఎన్నేళ్ళయిందో ముందుగా పరిశీలిద్దాం.

గత వంద సంవత్సరాల క్రితం వరకు, మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే క్రీ.శ 20వ శతాబ్దం ప్రారంభం వరకు మెజారిటీ భారత ప్రజలు తమను తాము హిందువులుగా పిలుచుకోలేదు. ప్రజలు తమను తాము తమతమ గోత్ర నామాలతో, తెగ నామాలతో అలాగే వర్ణ లేదా కుల నామాలతో పిలుచుకునే వారు. తొలి కాలంలో ఆర్యులు, అనార్యులనే బేధాలను చూపిస్తూ, తరువాత కాలంలో వైదికులు, శ్రమణులు అని, మరొక కాలంలో ముస్లింలు, శైవులు, వైష్ణవులు అనే బేధాలను చూపిస్తూ వ్యవహరించేవారు. ఆ పిలుపులు కూడా 'ప్రధాన స్రవంతికి' చెందినవి. విశాల భారత దేశంలో ఈ పిలుపులకు బయట పెద్ద సంఖ్యలో ప్రజలు ఉండినారు. ప్రధాన స్రవంతిలో గాని, బయటగాని ఎవరూ తమను తాము హిందువులని పిలుచుకోలేదు. అసలా శబ్దమే వారికి తెలియదు. అత్యధిక ప్రజలు హిందూ అన్న శబ్దం విన్నది బ్రిటిష్ కాలంలో జనగణనకు వచ్చిన ఎన్యూమరేటర్ల నుంచి మాత్రమే. ఇది ఆశ్చర్యకరమైన విషయమైనా వాస్తవమైనది. ఈ క్రింద చరిత్ర క్రమాన్ని పరిశీలిద్దాం.

క్రీస్తు పూర్వం 5, 6 శతాబ్దాలలో జైన మహావీరుడు, గౌతమ బుద్ధుడు వంటి శ్రమణులు వేదాలను నమ్మేవారిని వైదిక మతస్థులని, లేదా బ్రాహ్మణ మతస్తులని పిలిచేవారు. తొలి, మలి వేద సాహిత్యంలోనే కాదు తరువాత కాలానికి చెందిన బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులలో ఇంకా పురాణాలలో అలాగే రామాయణ, భారతాలు వంటి ఇతిహాసాలో, కౌటిల్యుని అర్థశాస్త్రంలో, మనుధర్మశాస్త్రంలో ఇతర 'ధర్మశాస్త్రాల'లో మనకు హిందూ అనే పదమే కనిపించదు. గుప్తుల కాలంలో కూడా ఈ పదం ఉపయోగంలో లేదు. క్రీస్తు శకం 8వ శతాబ్దానికి చెందిన శంకరాచార్యుడు కూడా తన రచనలలో ఎక్కడా హిందూ పదాన్ని ఉపయోగించలేదు. పర్షియన్ రాజు డేరియస్ I సింధూ నదీ లోయను గెలిచినప్పుడు (క్రీ.పూ 515) ఆ ప్రాంతాన్ని హిందూ ప్రాంతం అని వారు వ్యవహరించారు. మధ్య యుగాలలో అరబ్‌లు, తొలి ముస్లిం యాత్రికులు పశ్చిమ భారతదేశ ప్రాంతాలను హింద్ అని పిలిచేవారు. క్రీ.శ 11వ శతాబ్దంలో సింధూ నదికి తూర్పున ఉన్న ప్రజలనుద్దేశించి మొదటిగా పర్యాదేశ బహుళ రంగ మేధావి అయిన ఆల్ బెరూనీ హిందువులు, శ్రమణులు అని తన రచనలలో (క్రీ.శ 1030) పేర్కొన్నాడు. హిందువులన్న ఈ భావన మొదట్లో పశ్చిమ భారత ప్రజలకు మాత్రమే వర్తించి ఉండేది. క్రమంగా అది ఉత్తర, తూర్పు, దక్షిణ, ఈశాన్య భారతాలకు విస్తరించింది. అది కూడా మతపరమైన అర్థంలో కాదు. ఆ కాలంలో బౌద్ధ, జైన మతాలలో చేరని సూద్రులను వైదిక లేదా బ్రాహ్మణ మతస్తులు అని పిలిచారా లేక వారి వారి తెగల నామాలతోనే పిలిచారా అనేది ఒక ప్రధానమైన సమస్య. ఈ సమస్యను ప్రొఫెసర్ రొమిలా థాపర్ తన 'ఎర్లీ ఇండియన్స్' గ్రంథంలో స్పృశించారు. ఈ గ్రంథంలో 12 వ అధ్యాయంలో పుట 439లో ఆల్‌బెరూని దేశ ప్రజలను హిందువులు మరియు శ్రమణులు అని వ్యవహరించడాన్ని రొమిలాథాపర్ పేర్కొంటారు. అయితే వెంటనే తాను వివరిస్తూ ఆనాటి ప్రజలు తమను తాము హిందువులు అని పిలుచుకోలేదని, ఇతరులు అలా పిలిచినా వారిలో అనేక మందికి అది విడ్డూరంగా ఉండడమే కాదు కొందరికైతే అది చీదరింపుగా ఉండిందని ఎందుకంటే ఆ విధంగా బ్రాహ్మణులు మరియు అంటరానివారైన సూద్రులను సమానంగా చూసినట్లు వారికనిపిస్తుందని ఆమె రాస్తారు. ఆ తరువాత పుటలో థాపర్ 14వ శతాబ్దం వరకు

ఎవరూ తమను తాము హిందువులని పిలుచుకోలేదని, ఆవిధంగా పిలుచుకోవడం ప్రారంభం అయినప్పుడు కూడా అక్కడక్కడ మాత్రమే అలా పిలుచుకునేవారని వివరిస్తారు. అయితే ఈ విషయం డి.యన్.ఝా మరింత వివరంగా రాస్తాడు.

డి.యన్.ఝా హిందూ గుర్తింపుపై చాలా సాధికారమైన రచన చేశాడు. 'లుకింగ్ ఫర్ హిందూ ఐడెంటిటీ' అనే తన ఉపన్యాస పాఠంలో డి.యన్.ఝా 14వ శతాబ్దం వరకు ఎవరూ తమను తాము హిందూగా పరిగణించుకోలేదని చెప్తూ అసలు ఈ హిందూ అన్న పదం జన సామాన్యం దగ్గర చేరడానికి ఇంకా ఐదారు శతాబ్దాలు పట్టిందని వివరిస్తాడు. "కృష్ణ చైతన్య సాంప్రదాయాన్ని 'అధికారిక' అద్వైత వేదాంతానికి అనుబంధమైనదిగా వివరించడానికి ప్రయత్నించిన గౌడీయ వైష్ణవ ఆచార్యుడైన బలదేవ విద్యాభూసన (vidyabhusana) 1750 లలో బ్రహ్మసూత్రకు రాసిన టిప్పణి (కామెంటరీ)లో 'హిందు' కనిపించదు" అని "16వ శతాబ్దం తొలి నాళ్ళ నుంచి 18వ శతాబ్దం చివరి వరకు వచ్చిన, గౌడ వైస్నవ (Vaisnava) సంప్రదాయానికి చెందిన మూడు గ్రంథాలలో 'హిందూ' అనే పదాన్ని వాడడం కనిపించదని" చెప్తాడు. అదే ప్రసంగ పాఠంలో డి.యన్.ఝా భక్తి ఉద్యమంలో గురువులు హిందూ అన్న పదాన్ని కులతత్వాన్ని ముందుంచుతున్న బ్రాహ్మణీకాన్ని సంబోధించడానికి వాడారని చెప్పాడు. తాము ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నామో వారికి ఆ పదాన్ని ఉద్దేశించారని అంటాడు. అంటే భక్తి ఉద్యమం తనను హిందూ భావజాలంగా భావించకపోవడమే కాదు తనను తాను హిందూ భావజాలానికి వ్యతిరేకంగా నిలబెట్టుకుంది. అదే రచనలో డి.యన్. ఝా 14, 18 శతాబ్దాల మధ్య చాలా తక్కువ సందర్భాలలో అదీ చాలా అస్పష్టమైన అర్థంతో మాత్రమే హిందూ పదం ఉపయోగించబడిందని అనేక వివరాలతో చెప్పాడు. ఝా తన వ్యాసం ఫుట్ నోట్ 77లో బ్రిటిష్ రాజకీయవేత్త మరియు ఇవాంజెలికల్ క్రిష్టియన్ అయిన చార్లెస్ గ్రాంట్ (ఇతను ఈస్టిండియా కంపెనీకి డైరెక్టర్‌గా కూడా చేసాడు) తన ఒక మిత్రుడు జాన్ థామస్‌కు 1787 లో రాసిన ఒక లేఖలో మొదటి సారిగా హిందూ అనే పదాన్ని ఉపయోగిస్తాడని తరువాత తానే 1792 లో రాసిన మరొక వ్యాసంలో ఆదే పదాన్ని తిరిగి వాడతాడని తరువాత వరుసగా ఆంగ్లేయ మేధావులు ఈ పదాన్ని ఒక మత గుర్తింపుగా స్థిరంగా వాడడం కనిపిస్తుందని అంటాడు. 'బ్రిటిష్ వారు హిందూ అన్న పదాన్ని భారత్ నుంచే అప్పు తీసుకునిపోయి దానికి అక్కడ కొత్త అర్థాన్ని, కొత్త ప్రాధాన్యతను కల్పించి తిరిగి దానిని భారత్‌కు దిగుమతి చేశారని' ఝా రాస్తాడు. 'హిందూ గుర్తింపు' వలసవాదులు కల్పించినదే గాని అది ఇక్కడ పుట్టింది కాదని వివరిస్తాడు. బ్రిటిష్ వారు వచ్చేసరికి భారతదేశంలో మెజారిటీ ప్రజలు తమను తాము హిందువులుగా భావించుకోలేదు. ఈ గుర్తింపు కట్టబెట్టింది ఆంగ్లేయులే. తరువాత వారు తమ గెజిట్‌లో, జనాభా గణనలో హిందూ, ముస్లిం అనే వర్గీకరణ వాడడం ప్రారంభించారు. ఒక్క మాటలో చెప్పాలంటే భారతదేశంలో బ్రిటిష్ వారు వచ్చిన తరువాత మాత్రమే, వారి చర్యల వలననే ఇస్లామేతర ప్రజలు తమను తాము హిందువులని క్రమంగా పిలుచుకోవడం జరిగింది. జనాభా లెక్కల ద్వారా మాత్రమే ఇది గ్రామాల వరకు వెళ్ళింది. 1871 లో బ్రిటిష్ ప్రభుత్వం జనాభా గణన చేసినప్పుడు హిందూ అనే 'గుర్తింపు'ను ఒక



కేటగిరీగా ఉపయోగించింది. అయితే ఎవరిని హిందూ అనాలి అనే సమస్య వచ్చింది. చివరికి ముస్లింలు, క్రిష్టియన్లు, బౌద్ధులు, జైనులు కాని వారిని, 'మిగిలిన వారిని' హిందువులని ఎన్యూమరేట్ చేశారు. అప్పటినుండి ఏభయ్యేళ్ళ తరువాత, అంటే 1921 జనగణన నాటికి కూడా, పరిస్థితులలో పెద్ద తేడా రాలేదు. ఆ విషయం నాటి జనాభా కమీషనర్ మాటలలో: 'మతాలను వర్గీకరించడానికి ఉపయోగించే పదాలు దేశ ప్రజలకు పరిచయం లేకపోవడం అనేది సరియైన నివేదికలు రాబట్టడానికి పెద్ద అడ్డంకిగా ఉండింది. ప్రజల నానుడిలో ఉన్న మతం అన్న భావనలను గణకుల వాడిన పదాలు వ్యక్తం చేయలేదు. ప్రధానంగా 'హిందూ', 'ఆనిమిస్ట్' అనే పదాలు సమస్యాత్మకంగా ఉండినాయి. ఏ భారతీయుడికి కూడా తన మతానికి అనువర్తించబడిన హిందూ అన్న పదం పరిచయం ఉన్నది కాదు. నీ మతం ఏమని అడిగితే, ఉదాహరణకు, ఆయన నేను శైవుణ్ణి అంటాడు...' (Geoffrey A Oddie రచన Hindu Religious Identity with special reference to the origion and significance of the term 'Hinduism', c 1787 - 1947). ఒడ్డీ పై మాట చెప్తూ ఏ భారతీయుడికీ హిందూ అనే పదం పరిచయం లేదనడం సరికాదని, కొద్దిమంది విద్యావంతులకు, అదీ ఇంగ్లీషు మేధో చర్చలతో సంబంధం ఉన్న వారికి ఆ పదం పరిచయం ఉందని వివరిస్తాడు. ఈ మొత్తానికి అర్థం ఏమంటే 1920 నాటికి కూడా హిందూ అన్న పదం జనసామాన్యంలో ప్రాచుర్యంలో లేదు. జనం తమను తాము ముస్లింలు, క్రిష్టియన్లు, బౌద్ధులు, జైనులు, శైవులు, వైష్ణవులు ఇత్యాదిగా పిలుచుకునేవారు. ఇంకా కుల గుర్తింపు ప్రధానంగా ఉండేది. ఇక గిరిజనులకు ఈ పేర్లు కూడా తెలియవు. నేడు తమను

తాము హిందువులు అని పిలుచుకుంటున్న వారి పూర్వీకులు, ఒక వంద సంవత్సరాల క్రితం వారు కూడా, తమను తాము హిందువులని పిలుచుకోలేదు. హిందువులనే ఈ గుర్తింపు గత ఐదు తరాలకు చెందినది మాత్రమే. స్వాతంత్ర ఉద్యమ కాలం నాటిది మాత్రమే. ఇక మనం లాల్ మణి జోషి రచనపై కేంద్రీకరిద్దాం.

ముందు పేరాలో బ్రాహ్మణ మతం ఎన్ని రూపాలను మార్చుకుందో, హిందూ మతంగా ఎలా వ్యవహారంలోనికి వచ్చిందో చూశాం. అయితే బ్రాహ్మణ మతం పేరులోనే కాదు, వస్తు సారంలో కూడా చాలా మార్పుచెందింది! నిజానికి మార్పుచెందింది అనడం కంటే తద్విరుద్ధంగా మారింది అనడం సత్యానికి దగ్గరగా ఉంటుందేమో. ఋగ్వేద కాలంలో (క్రీ.పూ 1500 నుండి 900 వరకు) ఉన్న దానిని బ్రాహ్మణ మతం అని మలివేద కాలం (క్రీ.పూ 900 నుండి 500 వరకు) దాటి, ఉపనిషత్తుల కాలం దాటి, పురాణాలు, ఇతిహాసాల కాలం వచ్చేసరికి, అంటే క్రీస్తు శకం తొలి శతాబ్దాల కాలం నాటికి అనేక పరిణామాలు చెంది బ్రాహ్మణ మతం నయా బ్రాహ్మణ మతం అయిందని లాల్ మణి జోషీ అంటారు. ఇవి చరిత్ర విశ్లేషణకు అనుకూలంగా మనం పెట్టుకునే పేర్లే కాని బ్రాహ్మణ మతం తనను తాను ఎప్పుడూ నయా బ్రాహ్మణ మతం అని పిలుచుకోలేదు. అంతే కాదు జైన, బౌద్ధ మతాలు పుట్టేవరకు బ్రాహ్మణ మతం అన్న మాట కూడా ఉండి ఉండదు. ఆనాటికి ఆర్య, అనార్య సంప్రదాయాలుగానే వ్యవహరించబడ్డాయి. అదలా ఉంటే, బ్రాహ్మణ మతం తన అంతర్గత తర్కం ద్వారానో లేక లాల్ మణి జోషి వివరించినట్లు బౌద్ధమత భావజాలాన్ని మార్మిక పద్ధతులలో స్వీకరంచడం ద్వారానో నైతిక విలువలు, సన్యాసత్వం, జీవన్ విముక్తి వంటి వాటిని స్వీకరించిన తరువాత, ఆర్యేతర నాగరికతలను తనలో కలుపుకున్న క్రమంలో వచ్చిన మార్పులు చాలా ఆశ్చర్యకరమైనవి. క్లుప్తంగానైనా ఇక్కడ పేర్కొందాం.

తొలివేద కాలంలో ఆర్యులకు ఇంద్రుడు ప్రధాన దేవుడు. ఇంద్రుడు తరువాత వరుణుడు. ఇంద్రుడు వర్షాలు కురిపిస్తాడు, (ఇంద్రం అంటే నీరు). ఇంద్రుడు యుద్ధాలలో విజయాన్ని సాధిస్తాడు, వరుణుడు ఋతాన్ని (ప్రకృతిపరమైన క్రమాన్ని) నిర్వహిస్తాడు. ఇక నయా బ్రాహ్మణ మతంగా పరిణామం చెందిన నాటికి ఇంద్రుడుకి ప్రాధాన్యత పోయింది. ఆ దేవుడు ఒక తాగుబోతు, తిరుగుబోతుగా వ్యవహరించబడ్డాడు. కాగా ఒకప్పుడు అంత ప్రాధాన్యత లేని ఇంద్రుని స్నేహితుడైన విష్ణువు దేవాదిదేవుడయ్యాడు. అలాగే ఋగ్వేద కాలంలో ఇంద్రుడుకి శత్రువుగా పరిగణించబడిన, తిరుగుబోతుగా వ్యవహరించబడిన శ్రీకృష్ణుడు పురాణ కాలానికి మహావిష్ణువు అవతారమైనాడు. ఋగ్వేద కాలంలో ఈసడించబడిన లింగారాధన తరువాత ప్రధానమైపోయింది. ఋగ్వేద కాలంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు వర్ణాలు మాత్రమే ఉండినాయి. అయితే వాటి మధ్య ఎటువంటి అడ్డుగోడలూ లేవు. ఎవరు ఏ వృత్తి అయినా చేపట్టవచ్చు. వృత్తిని బట్టే వర్ణం. వర్ణాంతర వివాహాలపై ఎటువంటి అభ్యంతరాలు లేవు. కాని తరువాత కాలంలో మార్పు వచ్చింది. ఆర్యులు గంగా మైదానంలో తూర్పుకు కదులుతున్న కొద్దీ ఓడించబడిన వారిని తమ దాసులుగా చేసుకున్నారు. వారిని శూద్రులు అన్నారు. విస్తారమైన శూద్రవర్ణం ఏర్పడింది. అయితే అదే క్రమంలో పాలక వర్ణంలో మూడు వర్ణాలు ఘనీభవించాయి, వాటి మధ్య అంతరాలు ఏర్పడ్డాయి. చరిత్రలో విజేత జాతిలో (జన సమూహం అనే అర్థంలో) అంతరాలు ఏర్పడడం, విజేత జాతిలో మెజారిటీ తమ పూర్వ సమాన హక్కులు కోల్పోవడం ఎప్పుడూ ఉన్నదే. 'జూలియస్ సీజర్' నాటకంలో షేక్స్పియర్ దీనిని హృద్యంగా చిత్రిస్తాడు. పొరుగు రాజ్యాలపై యుద్ధంలో విజయం సాధించి సంపదలను, బానిసలను తీసుకువచ్చిన సీజర్ తన దేశంలో అప్పటికి ఉన్న పరిమిత ప్రజాస్వామ్యాన్ని (అరిస్టోక్రసిని) రద్దుచేస్తాడు, తనను తాను రాజుగా ప్రకటించుకుంటాడు. మన విషయానికి వస్తే 'ఆర్యావర్తం'లో నాలుగు వర్ణాలు, తారతమ్యాలు, వర్ణ వివక్షలు కుదురుకున్నాయి. ఇంకా అనంతర కాలంలో శూద్రులలో వృత్తులను బట్టి ఆర్య సమాజం బయట ఉన్న తెగలు కులాలుగా వ్యవస్థీకృతం చేయబడ్డాయి. (ఈ విషయాలు డి.డి. కోసాంబి వివరించిన విషయం తెలిసిందే. డి.డి. కోసాంబి మరియు ఇతర రచనల ఆధారంగా నేను 'తెగ, కులం, కుటుంబం' అని ఒక వ్యాసం ప్రచురించి ఉన్నాను.) 'మను కాలం నాటికి 61 కులాలు నమోదు చేయబడగా, గుప్తుల అనంతర కాలంలో 100 కులాలను పురాణాలు పేర్కొంటాయి (డి.యన్.ఝా - ఏన్షియంట్ ఇండియా, పుట 159)'. ఋగ్వేద కాలంలో బ్రాహ్మణులు గొడ్డు మాంసం తినేవారు. అయితే పురాణ కాలం నాటికి వారు మాంసాహారం మానివేశారు. నాలుగు వేదాల తరువాత బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు వచ్చాయి. ఉపనిషత్తులు ముందా, బౌద్ధం ముందా అన్న చర్చ అలా ఉంచితే ఉపనిషత్తులు యజ్ఞ యాగాలను నిరసించాయి. ఫలితంగా యజ్ఞ యాగాల ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. జ్ఞాన, యోగ, భక్తి మార్గాలు ముందుకు వచ్చాయి. మొదటిగా వచ్చిన వేదాల కంటే, తరువాత వచ్చిన ఉపనిషత్తుల కంటే ఇంకా తరువాత వచ్చిన 'ధర్మశాస్త్రాలు' ఉదాహరణకు మను ధర్మశాస్త్రం, ప్రధానమైపోయాయి. వర్ణ ధర్మాలు, పితృస్వామిక నిర్బంధాలే ధర్మశాస్త్రాల సారాంశం అన్న విషయం తెలిసిందే. ధర్మశాస్త్రాలు అప్పటికే ఉన్న దైవభక్తినుంచి గురుభక్తి, రాజభక్తి, పతిభక్తులను నిగమనం (డెడ్యూస్) చేసాయి. ఋగ్వేద కాలంలో స్త్రీలు సమానంగా చూడబడకపోయినా వారికి వైధవ్యం లేదు, శీల పరీక్షలు లేవు, సతీ సహగమనం లేదు. పరిస్థితి మారి, పురాణ కాలం నాటికి స్త్రీ దేవతలకు ప్రాధాన్యత వచ్చింది. కాగా స్త్రీ అన్ని రకాలుగా వంచించబడింది. సుమారు మహాభారత రచన పూర్తయిన క్రీ.శ 4 వశతాబ్దానికి తొలి బ్రాహ్మణ మతం నయా బ్రాహ్మణ మతంగా మారిపోయింది. అప్పటికే రామాయణ రచన పూర్తయింది. భగవద్గీత రచన, దానిని భారతంలో ఇరికించడం, పురుష సూక్తం రచన దానిని ఋగ్వేదంలో పదవ మండలంగా ప్రక్షిప్తం చేర్చడం పూర్తయినాయి. రామాయణంలో స్త్రీని అగ్ని పరీక్షకు గురిచేయడం, బ్రహ్మజ్ఞానం కొరకు తపస్సు చేస్తున్న శూద్రుడు శంభూకుడ్ని చంపివేయడం కనిపిస్తాయి. మహాభారతంలో నిండు సభలో స్త్రీ వస్త్రాపహరణం, కులం పేరున ఏకలవ్యునికి విద్యను నిరాకరించడం, విలువిద్య నేర్చుకుంటే బొటనవేలు కోసి వేయడం, అలాగే పాండురాజు భార్యలలో ఒకరు మాద్రి సతీసహగమనం చేయడం. అంటే సుమారు జ్యోతిబా పూలే, రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి, గురజాడలు చూసిన భారత సమాజం క్రీ.శ 4వ శతాబ్దానికే తయారయ్యిందన్న మాట. అయితే బుద్ధుని కాలం నుండి అశోకుడు, మౌర్య సామ్రాజ్యం అంతం అయ్యే వరకు (క్రీ.శ 185) బౌద్ధమతం కులాధిపత్యాన్ని పురుషాధిపత్యాన్ని ఎంతమేరకు తగ్గించగలిగింది అనేది ఒక వేరే చర్చ. ఇక, 11వ శతాబ్దం నుండి

16వ శతాబ్దం వరకు వివిధ ప్రాంతాలలో వచ్చిన భక్తి ఉద్యమాలు కులపరమైన ఆధిపత్యవాదాలను తాత్కాలికంగా తగ్గించి ఉండవచ్చు. కాని ప్రధానస్రవంతిగా కులాధిపత్యం, పురుషాధిపత్యం కొనసాగాయని చెప్పక తప్పదు. ఈనాటి హిందూ మతానికి సాంస్కృతిక మూలాలు వేదాల కంటే ఉపనిషత్తులలో, భగవత్గీతలో, మను ధర్మ శాస్త్రంలోనే ఉన్నాయి. అయితే హిందూత్వ వాదులకు మనుధర్మశాస్త్రమే ప్రధానం, మిగిలిన రెండూ ముసుగులు మాత్రమే. వారు భక్తి, యోగ, జ్ఞాన మార్గాలను వేటినీ నమ్మరు. వారు నమ్మేది ఆధిపత్యం మాత్రమే. అదే వారి మార్గం. హిందువులు మనుధర్మశాస్త్రం నుండి బయట పడే క్రమాన్ని, హిందువుల ఉన్నతిని సంఘపరివార్ వారు అడ్డుకుంటున్నారు. మనుధర్మశాస్త్రం నుండి బయటపడకుండా హిందూ మతం ఔన్నత్యాన్ని పొందజాలదు.

బుద్ధిజం వంటి శ్రమణ మతాల భావజాలాలను స్వీకరించిన క్రమంలో, అనేక స్థానిక తెగల సంస్కృతులను కలుపుకునే లేదా సరిగ్గా చెప్పాలంటే 'సంస్కృతీకరణ' చేసే క్రమంలో బ్రాహ్మణ మతం ఎన్ని మార్పులను పొందిందో చూశాం. మధ్య యుగాలలో భక్తి ఉద్యమాలు మరియు సుఫీ ఉద్యమాలు అలాగే ఆధునిక యుగంలో సంస్కరణ ఉద్యమాలు హిందూ మతంలో అనేక ప్రగతిశీల మార్పులు తీసుకువచ్చాయి. ఇంకా బౌద్ధ మతాన్ని అంతం చేస్తూ కులాధిపత్య, పితృస్వామ్య వ్యవస్థలను గతంలో ఎన్నడూ లేనంతగా స్థిరీకరించిన ఒక తిరోగమన క్రమం 'ధర్మశాస్త్రాల' కాలంలో, శంకరాచార్యుని కాలంలో జరగగా ఇప్పుడు మరల రాజకీయ ప్రయోజనాల కొరకు కుల, మత, లింగ, జాతి, భాషా ఆధిపత్యవాదాల స్థాపనకు ప్రయత్నం జరుగుతున్నది. క్రమంగా లౌకింగా, ప్రజాస్వామ్యయుతంగా ఇంకా, హేతువాద దృక్పథానికి మారుతున్న భారత మెజారిటీ ప్రజానీకం మరల అంధకారం వైపు ప్రయాణిస్తున్నారు. **ప్రగతి కాముకులకు పరిణామాన్ని గుర్తించడంలో, దానిని ప్రోత్సహించడంలో శ్రద్ధ ఉంటుంది కాగా, అభివృద్ధి నిరోధకులకు పరిణామ చరిత్రను నిరాకరించడంలో దానిని నిరోధించడంలో ప్రయోజనం ఉంటుంది.** అయితే, హిందూమతం యొక్క ఈ మొత్తం పరిణామాన్ని వివరించడం ఈ వ్యాసంలో సాధ్యం కాదు. లాల్ మణి జోషి తన రచనలో ప్రధానంగా బ్రాహ్మణ మతం నయా బ్రాహ్మణ మతంగా మారడంలో బౌద్ధమతం పాత్రను వివరించాడు. అక్కడికే ఈ వ్యాసం కూడా పరిమితం.

లాల్ మణి జోషి 'బుద్ధిజం ఎలా పుట్టింది' అనే విషయమై 'మార్క్సిస్టుగా' చెప్పబడే విశ్లేషణలను వ్యతిరేకిస్తాడు. అయితే ఆ వ్యతిరేకత అంత సమర్ధవంతంగా లేదు. కనీసం, రచయిత పూర్తి శ్రద్ధతో విమర్శించలేదు. మార్క్సిస్టులెవ్వరూ బౌద్ధ భావజాలం ఎటువంటి సాంస్కృతిక మూలాలు లేకుండా ఆనాటి ఉత్పత్తి శక్తుల అవసరాలనుంచి నేరుగా పుట్టిందని చెప్పరు. ఒక కొత్త భావజాలం పుట్టడానికి చరిత్రలో కొన్ని సాంస్కృతిక అంశాలు అలాగే కొత్త ఉత్పత్తి శక్తుల పుట్టుక అనేవి జోడీగా కారణమవుతాయని మాత్రమే మార్క్సిస్టులు అంటారు. మార్క్స్, ఏంగెల్స్ రచన 'జర్మన్ ఐడియాలజీ'లో దీనిని మనం చూడవచ్చు. భావ పరిణామం, ఉత్పత్తి శక్తుల పరిణామం ఒక వైపు స్వతంత్రంగా మరొక వైపు పరస్పరాధారంగా జరగడమే చారిత్రకం. స్వతంత్రంగా ఉండడం అదే సందర్భంలో పరస్పరాధారంగా ఉండడం అనే గతితర్కమే మార్క్సిజం. భావజాలపు సర్వసత్తాక స్వాతంత్ర్యం గురించి మాట్లాడం భావవాదం కాగా, భౌతిక శక్తులే సర్వస్వాన్ని నిర్ణయిస్తాయని చెప్పడం యాంత్రిక భౌతికవాదం. భావ పరిణామ క్రమంలో వచ్చిన వివిధ ఆలోచనా రీతుల నుండి ఆనాటి ఉత్పత్తి శక్తుల, వాటిని అనుసరించి వచ్చిన రాజకీయ శక్తుల అవసరాలను తీర్చగలిగేవి ప్రాధాన్యత పొందుతాయని మాత్రమే మార్క్సిస్టులు చెప్పుతారు. అభివృద్ధిచెందిన వ్యవసాయం, వ్యాపారం బౌద్ధమతం బలం పుంజుకోవడానికి దారితీసాయని మాత్రమే చెప్తారు. అంతేగాని బౌద్ధమతం భావజాలానికి అంతకు ముందు ఎటువంటి సాంస్కృతిక ప్రాతిపదికలు లేవని చెప్పరు. అయితే బౌద్ధ మతానికి గాని లేదా మరొక భావజాలానికి గాని మూలకాలుగా అప్పటికే ఉండిన సాంస్కృతిక, భావసంబంధమైన మూలాలు కూడా అంతకు ముందరి ఉత్పత్తి శక్తుల అభివృద్ధినుంచి ప్రోద్బలం పొంది ఉంటాయనేది గమనంలో ఉండాలి. ఇక మార్క్సిస్టు విశ్లేషణపై లాల్‌మణి జోషి అభిప్రాయం ఏమైనప్పటికీ బౌద్ధమతం విషయానికి వస్తే అది పుట్టిన నాటికి ఉన్న వివిధ సాంస్కృతిక, భావజాల ఘర్షణలను అర్థం చేసుకోవడానికి లాల్‌మణి జోషి ప్రతిపాదనలను పరిశీలించడానికి ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు.

వేదాలు కూర్చబడిన తరువాత బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు వచ్చాయన్న విషయం తెలిసిందే. ఉపనిషత్‌ల కాల నిర్ణయమే ప్రధాన సమస్య. ఎందుకంటే ఉపనిషత్‌లలో మాత్రమే తత్వశాస్త్ర చర్చ ఉంది. ఉపనిషత్‌ల నుంచే బౌద్ధం తన తత్వజ్ఞానాన్ని గ్రహించిందా లేక బౌద్ధం నుంచి ఉపనిషత్‌కారులు తత్వవివేచనకు ప్రేరణ పొందారా అన్నదే ప్రధానమైన చర్చగా లాల్ మణి జోషి రచన సాగుతుంది. ఉపనిషత్‌లలో అత్యంత పురాతనమైనవి బృహదారణ్యక మరియు చందోగ్యోపనిషత్తులని, అవి కూడా బుద్ధుని కాలానికి ముందువు కావని నిరూపణలు చూపిస్తాడు రచయిత. అంతే కాదు వైదిక సాంప్రదాయంలో ఇహ పరలోకాల సౌఖ్యం గురించి మాత్రమే ప్రధానంగా ఉంటుంది. యజ్ఞ, యాగాలన్నీ ఇహలోకంలో గోసంపద, ఆరోగ్యం, విజయం, పుత్రుల కొరకు అలాగే పరలోక ప్రాప్తి కొరకు. అక్కడ కూడా సౌఖ్యమే ప్రధానం. ఉపనిషత్‌లకు ముందు వేద సాహిత్యంలో 'నిర్వాణం' అనే భావన ఎక్కడా కనిపించదు. రచయిత ఉపనిషత్‌లు వేదసాహిత్యానికి కొనసాగింపుగా కనిపించవని, జంతుబలిని కర్మకాండను వ్యతిరేకిస్తూ సన్యాసత్వాన్ని ప్రభోదించే ఉపనిషత్తులు వేదసాహిత్యానికి పూర్తిగా వ్యతిరేకంగా నిలబడతాయని అంటాడు. ఉపనిషత్తులు, కనీసం కొన్ని, వేద సాహిత్యానికి వ్యతిరేకంగా నిలబడతాయనే మాట చాలా పెద్దమాట. ఈ మాటను అంగీకరించడం అంటే బ్రాహ్మణ మతం దాని వ్యతిరేకంగా మారి నియో బ్రాహ్మణ మతమయిందని అంగీకరించడమే. కాని ఇది వాస్తవం. బ్రాహ్మణ మతం బౌద్ధ మతాన్ని ఎదుర్కోవడానికి శ్రమణ భావజాలాన్ని, సన్యాసాశ్రమాన్ని స్వీకరించడం మాత్రమే కాక తత్వ వివేచనను కూడా మార్మిక పద్ధతులలో, మారుపేర్లతో స్వీకరించిందని జోషి అంటాడు. నేను ఇక్కడ మాట మాత్రంగా చెప్పిన విషయాలను రచయిత తన రచనలో చాలా పకడ్బందీ వాదనలతో, ఋజువులతో నిరూపించడానికి ప్రయత్నిస్తాడు. ఉపనిషత్తుల అనంతరం వేదాలను ఉటంకించడం బాగా తగ్గిపోయింది. బ్రాహ్మణ మతం తనను తాను వాదనలతో సమర్థించుకోవలసిన ప్రతి సందర్భంలో అధికాధికంగా ఉపనిషత్తులనే ఉటంకించడం కనిపిస్తుంది. అయితే, ఇతర మతాల నుంచి పెద్ద పోటీ లేని కాలాలలో, ప్రధానంగా బౌద్ధమతం

తరిమివేయబడిన తరువాత, అలాగే భక్తి ఉద్యమం బలహీనపడిన తరువాత, బ్రాహ్మణ వాదం కుల, మత, లింగ ఆధిపత్యవాదాలను, మను ధర్మశాస్త్రాన్ని మరలా ముందుకు తెస్తుంది. అప్పుడు 'సర్వేజనా: సుఖినోభవంతు', మహా ఉపనిషత్తులో చెప్పబడిన 'జగదేక కుటుంబకం' వంటి ఆదర్శాలు గల్లంతవుతాయి. బలప్రయోగమే ప్రధానం అవుతుంది.

ఒకానొక సందర్భంలో బుద్ధుడు అష్టాంగ మార్గం గురించి చెపుతూ అది తాను ముందటి కాలానికి చెందిన జ్ఞానుల నుంచి, వారు నడిచిన మార్గం నుంచి పొందానని చెప్తాడు. బుద్ధుడు చెప్పిన ఆ జ్ఞానులు, బ్రాహ్మణ సంప్రదాయానికి చెందిన వారేనని పి.వి.కానే వంటి వారు భావిస్తారు. అయితే లాల్ మణి జోషి మాత్రం బుద్ధుని దృష్టిలో ఉన్న జ్ఞానులు ధిగ నికాయ, సంయుక్త నికాయలలో పేర్కొనబడిన బుద్ధునికి ముందటి కాలం నాటి 6 గురు శ్రమణులంటాడు. 65వ పుటలో వారి పేర్లను కూడా పేర్కొంటాడు. 1. విపస్సి, 2. శిఖి, 3. వెస్సభు, 4. కాకుసంధ, 5. కోనగమన, 6. కస్సప. జోషి ప్రధానంగా బౌద్ధానికి వేద సంస్కృతి బయట ఆధారాలు చూస్తాడు. బుద్ధుడు హిందూ ఋషి అని హిందూ మతాన్ని సంస్కరించాడని చెప్పుకొచ్చే డా. యస్.రాధాకృష్ణన్, డా. పాండురంగ్ వామన్ కేన్ వంటివారి విశ్లేషణలను తూర్పారపడతాడు. ప్రొఫెసర్ జి.సి. పాండేను ఉటంకిస్తూ బౌద్ధ, జైన భావజాలాలు వేద సంప్రదాయానికి బాహ్యంగా, ఇంకా వ్యతిరేకంగా ఉండిన ఒక బలమైన సమాంతర సాంప్రదాయం నుండి ఉద్భవించాయని చూపిస్తాడు. ఇక జి.సి పాండే అటువంటి సంప్రదాయం వేదకాలం ముందునుంచే ఉండిందని రాస్తాడు. ఇటువంటి విస్తృత ప్రతిపాదనలను అంగీకరించడం అంత సులభం కాదు. అయితే, వైదికేతరంగా ఒక బలమైన సంప్రదాయం ఉనికిని, దాని స్థలకాలాలను కుదించి, మనం సులభంగా అంగీకరించవచ్చు. వైదిక సంప్రదాయానికి బయట ఒక శ్రమణ సంప్రదాయం తుది వేదకాలంలో, గంగా మైదానంలో ఉండేదని అంగీకరించడం మనకు సులభంగా ఉంటుంది. అందుకు ఋజువులు చాలానే ఉన్నాయి. బుద్ధుడు ముందటివాడా లేకా తొలి ఉపనిషత్తులు ముందటివా అన్న విషయం తేలకపోయినా వైదిక సంప్రదాయం ఒక బలమైన వైదికేతర సంప్రదాయాన్ని ఎదుర్కొని ఉండకపోతే ఉపనిషత్తులు ఉనికిలోనికి రావడం సాధ్యం అయ్యుండేది కాదని మాత్రం చెప్పవచ్చు. లాల్ మణి జోషి మాటలలో చెప్పాలంటే, 'వస్తు ప్రపంచపు వాస్తవికతను ధృవీకరించే లేదా ప్రాపంచిక ప్రయోజనాల చుట్టూ అల్లుకున్న వైదిక సంప్రదాయం మరియు ప్రాపంచిక జీవితాన్ని త్యజించే, ప్రపంచాతీత్వాన్ని బోధించే సన్యాసత్వాన్ని ముందుకు తీసుకువచ్చిన శ్రమణ భావాజాలాల మధ్య ఘర్షణయే భారత ప్రాచీన చరిత్ర'. ఈ ప్రకటన, కొన్ని స్థల కాలాల పరిమితిలో, భావజాల రంగ ఘర్షణను బాగా వ్యక్తీకరిస్తుందని అనుకుంటాను. ఉపనిషత్తులు బుద్ధుడికి ముందే పుట్టినా అవి అప్పటికే బలంగా ఉన్న శ్రమణ సాంప్రదాయానికి ప్రతిస్పందనని చెప్పవచ్చు. 'జాతక కథలలో అనేక మంది బోధిసత్వులున్నా వారు చారిత్రక పురుషులు కాకపోవచ్చు కాని దీఘ నికాయ, సంయుక్త నికాయలలో ప్రస్తావించబడిన 6గురు గురువులు చారిత్రక పురుషులని' రచయిత అంటాడు, కాగా జైన మహావీరుడు 27వ తీర్థంకరుడు. 27 సంఖ్య వాస్తవం కాకపోవచ్చు అయితే, బుద్ధుడు, మహావీరుడు కంటే వారివారి భావజాలాలు చాలా ముందటివన్నదే ఇక్కడ విషయం. బ్రాహ్మణ మరియు శ్రమణ భావాజాలాల ఘర్షణ బుద్ధుని కాలం ముందునుంచీ ఉన్నదన్న విషయమే ప్రధానం. అయితే దీనర్థం బుద్ధుని, జైన మహావీరుని పాత్ర ఏమీలేదని కాదు. వారు శ్రమణ భావజాలాన్ని అత్యున్నతంగా అభివృద్ధిచేశారని తప్పక చెప్పాలి. బుద్ధుని, ఉపనిషత్తుల కాలాల నిర్ణయానికి వెళ్ళకుండా మనం ఇటు ఉపనిషత్తుల అటు బుద్ధ, జైన మతాల పుట్టుక, వాటి కాలానికి సాగుతూ ఉండిన బ్రాహ్మణ, శ్రమణ భావజాలాల సంఘర్షణ నుంచి జరిగాయని భద్రంగా చెప్పవచ్చు.

లాల్ మణి జోషి అభిప్రాయం చెప్పుకోవాలంటే: 'బుద్ధిజం తన పటిష్టమైన నైతిక విలువలకు, నీతి ఆదర్శాలకు ప్రత్యేకంగా ప్రఖ్యాతిగాంచింది. నీతి మరియు పారమార్థికమైన (స్పిరిట్యుల్) ఆదర్శాలు, అహింస, మోక్షం, కర్మ, పునర్జన్మ వంటి భావాలు ఉపనిషత్ పూర్వ వైదిక మతానికి, ఇండో ఆర్యన్ నాగరికతకు ఏమాత్రం తెలియవు (పుట 42).' వైదిక ఋషులకు జీవన్ముక్తి (మోక్షం, నిర్వాణం) అసలు తెలియని విషయాలు. వారు భౌతిక స్వర్గాన్ని సాధించడానికి యజ్ఞం వంటి బలి, కర్మకాండలు నిర్వహించేవారు (పుట 44)' అంటాడు. మరొక దగ్గర రచయిత ఉపనిషత్తులకు ముందటి వేద సాహిత్యంలో ఎక్కడ అహింస, మోక్షం, కర్మ, పునర్జన్మ, విముక్తి వంటి భావాలు కనపడవని, ఆకారణంగా ఉపనిషత్తులకు వేదాలలో ఆధారాలు వెదకడంలో ప్రయోజనం లేదని ఈ భావనలు, విలువలు అన్నీ బౌద్ధ, శ్రమణ మతాలనుంచే వచ్చాయని అంటాడు. తొలి ఉపనిషత్‌గా చెప్పబడే చందోగ్యోపనిషత్, (ఏదైతే రచయిత ఉద్దేశ్యంలో బౌద్ధమతం తరువాత కాలానిదో), హింసను పూర్తిగా నిషేధించలేదని, యజ్ఞ వాటికల బయట మాత్రమే నిషేధించిందని అంటాడు (పుట 44). చందోగ్యోపనిషత్ మూడు ఆశ్రమాలను మాత్రమే చెప్తుందని, సన్యాసాశ్రమాన్ని గురించి చెప్పదని ఋజువు చూపిస్తాడు. (పుట46). గౌతమ, మను, వశిష్ట, విష్ణు, దక్ష, ధర్మ సూత్రాలు కూడా గృహస్థాశ్రమాన్నే ఉన్నతమైనదిగా చెప్పాయని రచయిత అవసరమైన ఉటంకిపులతో చెప్పాడు (పుట 49). ఈ విషయాలతో పాటు మరిన్ని విషయాలు చెప్పి ఉపనిషత్‌లకు అంతకు ముందటి వేద సాహిత్యంలో ఎటువంటి ఆధారాలు లేవని, బుద్ధుని బోధనల నుండి భావాలను స్వీకరించాయని సూత్రీకరిస్తాడు. ఉపనిషత్‌లకు ఆధారం బౌద్ధం ఎంతమాత్రం కాదని వాదించిన ఎ.యల్ భాషం కూడా తన 'హిందూయిజం పుట్టుక, అభివృద్ధి' అనే తన గ్రంథంలో 'బౌద్ధం తొలి ఉపనిషత్‌ల తరువాతదే, అయితే, ఉపనిషత్ భావాలకు మూలాలు వేదాలలో లేవు కాని ఆనాటి సమాజంలో అసంఘిటితంగా ఉన్నాయని అంటాడు. ఉపనిషత్తులకు వేదాలలో మూలాలు లేవనే విషయంలో చాలా మంది చరిత్రకారులు అంగీకరిస్తారు. ఉపనిషత్‌లకు బౌద్ధం ఆధారమా లేక వాస్తవం అందుకు విరుద్ధమైనదా అన్నదే చర్చ. ప్రొఫెసర్ రొమిలా థాపర్ బౌద్ధం ఒకవైపు ఉపనిషత్‌లకు, రెండవ వైపు మారుతున్న ఉత్పత్తి, రాజకీయ శక్తుల అవసరాలకు ప్రతిస్పందన అన్నారు (ఎర్లీ ఇండియా పుట 169) దీనినంతా ఒక చర్చగానే మనం పరిగణించి తదుపరి అధ్యయనాల కొరకు ఎదురు చూడాలి. ఇప్పటికే కొన్ని గ్రంథాలలో ఈ చర్చ మరింత ముందుకు వెళ్ళి ఉండవచ్చు కూడా.

మరొక విషయం. బ్రాహ్మణ మతంలో కర్మకాండపై పెరిగిన వ్యతిరేకత నుంచి బౌద్ధ, జైన మతాలు పుట్టాయనేది పొరపాటు అభిప్రాయమని, తద్విరుద్ధంగా సన్యాసిత్వాన్ని ప్రభోధించే శ్రమణ భావజాలం కారణంగానే బ్రాహ్మణ మతంలో కర్మకాండపై వ్యతిరేకత పెరిగిందని ప్రొఫెసర్ జి.సి. పాండేను ఉటంకిస్తూ లాల్ మణి జోషి

రాస్తాడు. అయితే ఇక్కడ ప్రశ్నను రూపొందించడంలోనే సమస్య ఉంది. వారి చర్చను గతితార్కిక విశ్లేషణా పద్ధతిలో చూసినప్పుడు బ్రాహ్మణ మతంలో ఆంతరంగిక వైరుధ్యం నుంచి ఉపనిషత్ భావజాలం పుట్టిందా లేక బ్రాహ్మణిజం శ్రమణ భావజాలం రూపంలో ఎదుర్కొన్న బాహ్య వైరుధ్యం వలన ఉపనిషత్‌లకు జన్మనిచ్చిందా అని వారు చర్చిస్తున్నారు. నిజానికి ఈ రెండు వైరుధ్యాలలో ఏ ఒక్కటి లేకపోయినా, ఇంకా ఆ వైరుధ్యాలు ఆ కాలానికి, ఒకదశకు పరిణితి చెందకపోయినా ఉపనిషత్ భావజాలం వచ్చి ఉండేది కాదు. బ్రాహ్మణ మతం పరిణామానికి ఈ అంతర్, బహిర్ వైరుధ్యాలు రెండూ అవసరమే. అంతేకాదు, ఈ వైరుధ్యాలు దీర్ఘకాలం కొనసాగినా అవి తీవ్రతరం కావడానికి లేదా పరిణితిచెందడానికి, ఫలవంతం కావడానికి పాదార్థిక పరిస్థితులలో మార్పు అవసరం అయింది. జి.సి.పాండే గారి ప్రకారం (జోషి ఉటంకింపు) శ్రమణ వైదిక భావజాలాలు రెండూ పక్కపక్కనే కొన్ని వందల సంవత్సరాలుగా కొనసాగుతూ ఉండినాయి. ఆమాట నిజమే అయి ఉండాలి. అలా అయినప్పుడు, బౌద్ధ లేక జైన మతాల ఉత్పత్తికి అలాగే ఉపనిషత్‌ల ఉత్పత్తికి అంత కాలం ఎందుకు ఆగవలసి వచ్చింది? అవి ఏ భౌతిక పరిణామం కొరకు ఎదురుచూస్తూ ఉండినవాయి? గంగా మైదానంలో వ్యవసాయం (ఆర్థిక రంగం) దానిని అనుసరించి రాచరికాలు (రాజకీయ రంగం) ఒకానొక దశకు అభివృద్ధిచెందిన తరువాత మాత్రమే వైదిక, శ్రమణ మతాల ఘర్షణ అటు ఉపనిషత్తులను ఇటు గౌతమ బుద్ధుడు, జైన మహావీరుడు వంటి అత్యున్నత ఉపాధ్యాయులను సృష్టించగలిగింది. ఈ రచయితలు (లాల్ మణి జోషి మరియు జి.సి.పాండే) ఉత్పత్తి, రాజకీయ రంగాలకు దూరంగా సంస్కృతిలో వచ్చిన పరిణామాలను విశ్లేషించడానికి ప్రయత్నించడంతో ఇంతకు ముందు మనం చూసినట్లు అంతరంగిక బాహ్య వైరుధ్యాలను ఒకదానికి ఒకటి పోటీ పెట్టారు. మన చర్చ మేరకు చూస్తే, చరిత్రకారులు తొలి ఉపనిషత్తులు ముందు పుట్టాయని తేల్చినా, బౌద్ధ, జైన మతాలు ముందు పుట్టాయని తేల్చినా పెద్ద సమస్య లేదు. మార్క్సిస్టులు ఒకవైపు కొమ్ముకాయవలసిన అవసరం అంతకన్నా లేదు. మార్క్సిస్టు చరిత్రకారులు ఆ విధంగా ఒకవైపు నిలబడినట్లు కనపడదు. వైదిక, శ్రమణ భావజాలాల ఘర్షణ కర్మకాండను తీవ్రంగా ప్రశ్నించిన ఇటు ఉపనిషత్తుల అటు జైన, బౌద్ధ సిద్ధాంతాల పుట్టుకకు కారణం అయిందని అలాగే ఆ ఘర్షణ పరిణతి చెందడానికి వ్యవసాయం, దానితో రాజ్యం ఒక స్థాయికి అభివృద్ధి చెందవలసి ఉండిందని అర్థం చేసుకోవడం సరిపోతుంది. అయితే బౌద్ధ మతం, ఉపనిషత్తుల కాలాల నిర్ణయంపై అధ్యయనాలు కొనసాగవలసిన అవసరాన్ని మనమేమాత్రం ఇక్కడ తగ్గించడం లేదు.

ఈ రచనలో లాల్ మణి జోషి అత్యంత పురాతన ఉపనిషత్తులు కూడా బుద్ధుని తరువాతవే అని అనేక ఋజువులు ఇచ్చారు. వాటిలో కొన్నింటిని పేర్కొందాం. ప్రస్తుత కాలంలో 108 లేదా 110 ఉపనిషత్‌లను గుర్తించడం జరిగింది. వీటిలో అత్యాధునికమైన ఉపనిషత్‌లు కూడా ఉన్నాయి. 16వ శతాబ్దంలో, అక్బర్ కాలంలో అల్లా ఉపనిషత్ రాయబడింది. క్రీస్తు శకారంభానికి పన్నెండు ఉపనిషత్‌లు ఉండవచ్చు. 8వ శతాబ్దపు శంకరాచార్యుని కాలానికి కూడా 12 ఉపనిషత్తులున్నట్లు తెలుస్తుంది. అందులో కొన్నింటికి శంకరుడు టిప్పణి (కామెంట్స్) రాశాడు (క్రీ.శ 788). భగవద్గీత (క్రీ.పూ 100 నుంచి క్రీ.శ 200) కూడా ఒక ఉపనిషత్‌యే. ఇంకా, ఇది తొట్టితొలి ఎనిమిది ఉపనిషత్‌ల నుండి పాఠ్యభాగాలను కలిగి ఉంది. ఎ.బి.కీత్ తొట్టతొలివిగా చెప్పబడే పద్నాలుగు ఉపనిషత్‌లను మూడు గ్రూపులుగా వర్గీకరించాడు. మొదటి గ్రూపు అన్నింటికంటే తొలికాలానికి చెందినవి: 1) ఐతరేయ, 2) బృహదారణ్యక, 3) చందోగ్య, 4) తైత్తరీయ, 5) కౌశితకి, 6) కేన; రెండవ గ్రూపు 7) కన్వ, 8) ఈశా, 9) శ్వేతాశ్వర, 10) ముండక, 11) మహానారాయణ; మూడవ గ్రూపు 12) ప్రశ్న, 13) మైత్రయానియ, 14) మండూక్య. కొత్త పాఠకుడు ఈ పద్నాలుగు ఉపనిషత్‌ల పేర్లను స్మృతి పథంలో పెట్టుకోవడం తదుపరి అధ్యయనాలకు ఎంతైనా ప్రయోజనకరం. ఇందులో అత్యంత పురాతనమైన ఉపనిషత్తులు కూడా క్రీ.పూ 6 శతాబ్దం కంటే ముందటివి అని ఋజువుచేయడం సాధ్యం కాదని కీత్‌ను ఉటంకిస్తూ రచయిత చెప్తాడు. కీత్ చెప్పిన దానిని బట్టి బృహదారణ్యక మరియు ఛందోగ్యోపనిషత్‌లు బుద్ధుడికి ముందువు కావు అని చెప్పలేం. డి.యన్. ఝా బుద్ధుని జన్మ సంవత్సరాన్ని క్రీ.పూ 586 గా ప్రతిపాదించాడు. అంటే బుద్ధుని బోధనలు క్రీ.పూ 6వ శతాబ్దం మధ్యకాలంలో మాత్రమే ప్రారంభమై ఉండాలి. లాల్ మణి జోషి డా. ఓ. హెచ్. విజేశేఖరాను ఉటంకిస్తూ బ్రాహ్మణాల కాలానికి ముందే ధిగ నికాయ తొలి సుత్తలు రాయబడినాయని, అప్పటికింకా ఉపనిషత్తులు స్వతంత్ర పాఠాలుగా (టెక్స్‌గా) పరిగణించబడలేదని చెప్తాడు. ఇంకా అత్యంత పురాతనమైనదిగా భావించబడే బృహదారణ్యక ఉపనిషత్ శథపథ బ్రాహ్మణం యొక్క చివరి భాగం. ఈ శథపథ బ్రాహ్మణం క్రీ.పూ 3వ శతాబ్దంలో పూర్తయిందని పేర్కొంటాడు. ఈ విధంగా అత్యంత పురాతన ఉపనిషత్ కూడా మూడవ శతాబ్దానికి చెందినదని జోషి వివరిస్తాడు. బుద్ధుని బోధనలన్నీ ఉపనిషత్తుల కంటే చాలా ముందటి కాలానివని దీనర్థం. బుద్ధుని బోధనలు ముందా తొలి ఉపనిషత్తులు ముందా అన్న విషయంపై ఇర్ఫాన్ హబీబ్ (ఎస్సేస్ ఇన్ ఇండియన్ హిస్టరీ), డి.యన్.ఝా (ఏన్షియంట్ ఇండియా), అలాగే రొమిల్లా థాపర్ (ఎర్లీ ఇండియా) చర్చించినట్లు కనిపించదు. ఎ.యల్. భాషం మాత్రం తన 'ప్రాచీన హిందూమతం పుట్టుక, అభివృద్ధి' అనే రచనలో తొలి ఉపనిషత్తులు బుద్ధుని బోధనలతో సంబంధం లేకుండా సమాజంలో ఉన్న భావనల ఆధారంగా స్వతంత్రంగా అభివృద్ధిచెందినట్లు రాస్తాడు. ఈ వ్యాసం మేరకు బుద్ధుని, ఉపనిషత్తుల కాల నిర్ణయం గురించి మరింత చర్చ అవసరం లేదు. ముక్తాయింపుగా మరలా చెప్పుకోవాలంటే, ఒకవైపు ఉపనిషత్తులు మరొక వైపు బౌద్ధ, జైన మతాలు బ్రాహ్మణ, శ్రమణ భావజాలాల ఘర్షణ నుంచి పుట్టి ఆనాటి ఉత్పత్తి శక్తుల అవసరాల దృష్ట్యా ప్రాచుర్యం పొందాయని అర్థం చేసుకోవచ్చు.

డాక్టర్ ఎస్. రాధాకృష్ణ, అలాగే డా. పాండురంగన్ వి. కానే వంటి వారు బుద్ధుడిని ఒక హిందువుగా బౌద్ధుని బోధనలను హిందూ మత సంస్కరణగా పరిగణించడాన్ని డాక్టర్ లాల్ మణి జోషి తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. బుద్ధుని కాలానికి వైదిక మతం లేదా బ్రాహ్మణ మతం ఉన్నాయి కాని హిందూ మతం అనేదే లేదని, ఆపైన బుద్ధుని కాలం నుండి క్రీ.శ రెండవ శతాబ్దపు ప్రారంభం వరకు అంటే, బౌద్ధం ఈ దేశం నుండి తరిమివేయబడే వరకు అది బ్రాహ్మణ మతానికి వ్యతిరేకంగా పోరాడుతునే ఉందని అంటాడు. బౌద్ధ మతం ముందుకు తీసుకువచ్చిన ఎ) జీవహింస వ్యతిరేకతను పాక్షికంగా అమోదించడం ద్వారా – బ్రాహ్మణులు మాంసాహారాన్ని మానివేయడం ద్వారా, బి) సన్యాసత్వాన్ని, సర్వసంగ పరిత్యాగాన్ని ఒక ఆదర్శంగా స్వీకరించడం

(మిగిలినది 37వ పేజీలో...)



హుష్షియార్

ఇక్బాల్

వరుసగా ఆరు దినాలు సెలవులు కావడంతో ఆ సోమవారం కోర్టు ప్రాంగణమంతా కక్షిదారులతో కిటకిటలాడుతోంది. కంఠాభరణం ధరించినట్లు గొంతుకు బిగగట్టుకున్న తెల్లని బ్యాడ్జ్ పట్టీలూ, నల్లకోటు లోపల దాగలేనంటున్న తెల్ల చొక్కా ధరించిన న్యాయవాదుల సందడీ తక్కువేం లేదా వేళ.

ఇంకా వేసవి మొదలు కాకున్నా ఫిబ్రవరి 10 నాటికే ఎగసిపడుతున్న ఎండ చెమటలు పట్టిస్తున్నదందరికీ.

కోర్టుకెదురరుగా తూర్పుకు రోడ్డూ దానికావల ప్రభుత్వాసుపత్రీ ఆ రోడ్డెంట అటు కిందికి అంబేద్కర్ చౌక్‌దాకా కొత్తగా వెలసిన షాపింగ్ కాంప్లెక్సులూ, అపార్టుమెంట్లూ. కోర్టుకు కుడిపక్క టౌన్‌లోకి దారి తీసే రాజీవ్ మార్గ్, ఆ రోడ్డవతల ట్రెజరీ, రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయాలూ... నిండుగా జనసంచారం క్రిక్కిరిసిపోయిన ప్రాంతమైపోయింది గానీ నీడ నిచ్చే ఓ మంచి చెట్టు లేకుండయ్యింది. వందలేండ్ల నుండి ఉన్న ఎత్తైన చిక్కని చెట్లు కోతకు గుర్రై నేలవాలిపోతే అడిగే నాథుడే లేకుండా పోవడమలా ఉంటే ఇద్దరు మనుషులకు చేతులకందని మానుబుడాలతో పెరిగి ఉండిన ఆ భారీ వృక్షాలను నరికేసి దశాబ్దంనర కాలం దాటిపోతున్నా ఒక్కటంటే ఒక్క కొత్త చెట్టూ లేచి నిలువలే. ఇంగ సలువెట్ల వస్తది... నీడెట్లొస్తది... నిలవడానికి జాగెట్లొస్తది...

ఉన్న కాంపౌండ్‌లోనే వాటి బుద్ధి పుట్టినట్లు మొలిసి పెరిగిన పలుచ బారిన నీలగిరీ, సుంకీ, తౌసి సెట్లు ఏం నీడిస్తయ్. అట్లనే సర్దుకుంటరు అందరు.

నల్లకోటుపై తొడిగిన గౌనుతో లోపల కక్కుతున్న చెమటలేవోగాని ఆ వేళకే ముఖాలపై మాత్రం చెమటలు ధారలు కడుతున్నాయి వకీళ్ళకు.

నాలుగు కోర్టులూ పక్కపక్కనే ఒకే ఇరుకు ప్రాంగణంలో ఉండడంతో ఆ పరిసరమంతా "హాజిరే... హాజిరే... హాజిరే..." అంటూ ఆయా కేసుల్లోని పార్టీలను, వకీళ్ళనూ పేరు పెట్టి పిలిచే పిలుపులతో మార్మోగిపోతుంటది.

జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టూ, సీనియర్ సివిల్ జడ్జి కోర్టూ, మేజిస్ట్రేట్ కోర్టూ, జిల్లా అడిషనల్, ప్రిన్సిపల్ జడ్జ్ కోర్టులూ అన్నీ అదే సముదాయంలోని పాత గోడల భవనంతో సర్దుకుంటున్నాయి. దశాబ్దాలుగా మొదటి మూడు కోర్టులూ కింద గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటే, జిల్లా క్రిమినల్ కోర్టు మాత్రం వెనుక భాగంలోని భవనం పై అంతస్థులో ఉంది.

ఇరుకు లేని విశాలమైన మెట్ల మీంచి క్లైంట్లూ, వకీళ్ళూ, సమన్లతో నేరారోపితులైన ఉభయ పక్షాల వాళ్ళనూ వెంట తోడుకుని కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్ళూ పైకి పోతున్నారు. కేసుల విచారణలో భాగంగా తలనుండి పాదాల దాకా పరిపూర్ణ పోలీసు డ్రస్సులో అరుదైన అపురూప రూపంలో ఎస్సైలూ, సీయైలూ ఎక్కేవాళ్ళు ఎక్కుతుంటే దిగేవాళ్ళు కిందికి దిగిపోతూ మెట్లు పట్టలేనంత రద్దీగా ఉంది.

ఉరుకుపరుగుల ఆనాటి దృశ్యం.

అక్కడే ఎదురు చూస్తూ ఉండి తమ వంతొచ్చి పేరు పిల్సినప్పుడు కోర్టు హాల్లోకి చేతులు జోడించి, పంచె కిందికిడిసి, తలరుమాలు తీసి,

ఎదపై అంగీ గుండీలు నిండుగా పెట్టుకొని వినయం తొణికిసలాడేట్లు అంత లోగొంతూ... అంత గంభీర స్వరమూ కాని పద్ధతిలో సరళ్ళ స్పష్ట పలుకులతో ఏ ఏ విషయాలడిగితే ఏ ఏ విధంగా బదులియ్యాలో ఒకటికి రెండుసార్లు నోటికి పట్టిస్తూ వల్లె వేయిస్తున్నారు వకీళ్ళు.

నాకు అత్యంత సన్నిహితుడూ, సామాజిక రాజకీయ విషయాల్లో అభిప్రాయాలు పంచుకుంటూ వాదనా మెళకువల్ని నేర్చుకోవడంలో సహకరించే యువ రఫియొద్దీన్ భాయ్ ఫోనొస్తే పొద్దున్నే లిఫ్ట్ చేశా. సాధారణ సలాము పలకరింపులయ్యాక... "ఆజ్ ఆయిమే ఇక్బాల్ సాబ్. ఆజ్ దో తీన్ ఫైనల్ ఆర్గ్యుమెంట్స్ చల్నే వాలే హై... క్రైమ్ అండ్ సొసైటీకే గ్రౌండ్ రియాల్టీకి హఖీఖత్ జాన్‌నేకా ఔర్ సమజ్‌నేకా మౌఖా ఆప్ జైసే లోగోఁకో షురువాత్ మే కామ్ ఆయెగా... మిస్ మత్ కర్నా... అంటూ చివరి మాటలు నొక్కి చెప్పాడు. తను డిస్ట్రిక్ట్ క్రిమినల్ కోర్టులో పి.పి. గవర్నమెంట్ ప్లీడర్. జీవించిన కాలంలో న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చిన తండ్రీ, తాతల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న రఫీ సాబ్‌కు గంభీరమైన కంఠస్వరం మాత్రమే కాదు ఆంగ్ల భాషలో అనర్గళ వాక్పటిమా ఉంది.

తప్పక వస్తానని తనకిచ్చిన మాట ప్రకారం సకాలంలో వచ్చి తెలిసిన, తారసపడిన వాళ్ళను పలుకరిస్తూ కోర్టు మెట్లెక్కుతున్న నన్ను ఆ అడ్వకేటు డ్రస్‌లో అంతకు ముందు చూడని వాళ్ళు దగ్గరకొచ్చి పలకరిస్తున్నారు.

ఒక్కసారిగా నామీద చూపు నిలిపి నన్నలా అక్కడ అడ్వకేటుగా చూడ్డాన్ని జీర్ణించుకోలేని ఖాకీ డ్రస్సులున్న పోలీసాఫీసర్లు ఒకరిద్దరు విస్తుపోతున్నది వాళ్ళ కరకు చూపుల్లో అర్థమౌతూనే ఉంది నాకు.

ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి యువజన ఉద్యమాల్లోనే కాక, నదీజలాల పునఃపంపిణీ జరగాలనీ, ఆగమైన ఆర్డీఎస్ కాల్వకింది రైతుల బతుకులు బాగుపడాలనీ, జీవనదులున్న మా పాలమూరు, నడిగడ్డ ప్రజల వలసలూ, ఆత్మహత్యలూ ఆగాలనీ సాగిన ప్రజా ఉద్యమాల్లోనూ సమీపం నుండి నలభై ఏళ్ళుగా నన్నూ, మా అధ్యయన, సాహిత్య సంస్థల్ని గమనిస్తూ వస్తున్న మిత్రులు కాంళే, నగేష్, భీమేష్ ఎదురు పడిండ్రు. నిజాన్ని నిర్భీతిగా మాట్లాడేటోళ్లు. ఏమనుకున్నా సరే అనుకున్నారేమో... "ఇది గబ్బు యవ్వారం సార్... నువ్వేడ ఇముడ్తవ్ ఇండ్ల... మల్లోసారి ఆలోచించాలె..." మనసులున్నది పలుకరింపుతో పాటు ముఖం మీదే అనేశారు.

"మనోల్లున్నరు గదా... అల్ల దగ్గరింత నేర్చుకుని కచేరీల సుట్టు తిర్గలేక సస్తున్న జనానికింత సాయపడ్డమని..." అనబోతుంటే నా మాట పూర్తికాకుండానే... "ఇగో ఈడ మనోడు పరాయోడు అని ఎవడూ ఉండదు. బుర్రల బడ్డంక బుర్ర వాసన్నే... నీకూ అర్థమైతదిలే గాని చాయన్న దాగిపొమ్మని" ఆపుకున్నరు.

కోర్టు గంట మోగింది. సప్పిడులన్నీ సద్దుమణిగి కోర్టు మొదలైంది.

ఉత్తరానికి ముఖమై ఉన్న జడ్జిగారి సీటెనుక గోడకు గాంధీ ఫోటో వేలాడుతోంది. జడ్జి చాంబర్ ముందు పోడియం అంచున చెరోవైపు ఎదురెదురుగా కేసుల తాలూకు ఫైళ్ళలో నిమగ్నమై ఒకరూ, కంప్యూటర్లో ఆ రోజు వాదనలకు సిద్ధం చేసిన కేసుల వివరాలు సరిచూసుకుంటూ మరొకరూ ఇద్దరు క్లర్కులూ బిజీగా ఉన్నారు. జడ్జ్ ఛాంబర్ కింద యూ ఆకారంలో సర్దిన బల్లల చుట్టూ న్యాయవాదులు ఆసీనులై ఉన్నారు. నేనూ ఒక సీట్లో సర్దుకున్నాను. వకాలతు సరంజామా సరిచూసుకుంటూ వకీళ్ళ లోగొంతు పలకరింపులతో కోర్టు హాలంతా జడ్జి రాక కోసం ఎదురు చూస్తూ గంభీరంగా ఉంది. చాంబర్ వెనుక గదిలోంచి వచ్చిన కోర్టు డ్యూటీ ఎంప్లాయ్ ఇస్తున్న "హొషియార్... హొషియార్... హొషియార్" కాషన్‌తో లాయర్లమందరమూ వినమ్రంగా లేచి తీర్పు కుర్చీ దగ్గరికి చేరిన జడ్జి గారికి అభివాదం చేసుకొని కూర్చున్నాం.

కోర్టుహాలు గేటు దగ్గర తెల్లని డ్రస్సులో హుషారుగా నిలబడ్డ రత్నం డోర్ బయటికి మొఖం పెట్టి "రాజయ్య హాజిరే... అంజమ్మ హాజిరే... అంటూ మూడు సార్లు క్లయింట్‌లను పిలిచాక, "అడ్వకేటు శీలన్న సాబ్ హాజిరే... శీలన్న సాబ్ హాజిరే" అని వొరుసగా ప్రతి కేసుకు సంబంధించిన వాళ్ళనూ పిలువడం మొదలెట్టాడు.

సమాచారం అందకనో, అనారోగ్యాల మూలంగానో బెంచ్ మీదికి వచ్చిన కేసులకు సంబంధించిన బాధ్యులైన కొందరు క్లయింట్‌లూ, సాక్షులూ గైర్హాజరైనందువల్ల ఒకట్రొండు కేసులు మరో తేదీకి వాయిదా పడ్డాయి. ఆ తరువాత పిలిచిన ఒక అత్యాచార కేసుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మయ్యను జడ్జ్ తీవ్ర స్వరంతో మందలిస్తున్నారు.

"... ఏంటీ... మీ ఎస్సై సాబ్‌కు కోర్టు మాటంటే ఖాతరు లేదా...?! ఏమనుకుంటున్నాడు. గత నెలనే తప్పక రావాలన్నాం. రాలేదు. ఇప్పుడూ రాలేదంటే ఏమన్నట్లు... ఇంత నిర్లక్ష్యమా!? నెక్స్ట్ వాయిదాకు రాకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయ్... చెప్పండి..." అన్నారు.

"...ఈసారి తప్పక పోదాం సార్ జడ్జ్ గుస్సయితున్నడు..." అనబోతే పొద్దున "నక్రాల్ సాల్ జెయ్యి. నాకు దెల్వదా ఎప్పుడు రావాల్నో..." అనుకుంట తనమీదికే ఇంతెత్తు లేసిన ఎస్సై మాటలు గుర్తొచ్చినయ్ బ్రహ్మయ్య హెడ్ కానిస్టేబుల్‌కు.

జడ్జ్ చెప్పిన మాటలకు తల ఊపి వాల్చుకోవడం తప్ప ఇంకేం చేయలేని బ్రహ్మయ్య. మనసులోనే తిట్టుకున్నడు "ఎంత జెప్పినా తలకెక్కని తలపోకరు" అని.

మధ్యాహ్నం పన్నెండున్నర కావచ్చింది. ఇగ పద్మమ్మ వంతొచ్చినట్లుంది.

"పద్మమ్మ హాజిరే... పద్మమ్మ హాజిరే..." చెవులు పగిలేటట్లు దూసుకొచ్చిన ఆ పిలుపుకు ఉలిక్కిపడింది పద్మమ్మ.

"ఎప్పుడైతదో ఏమో... నన్ను పిల్వుడు. గింత నశమైన పండ్లకు తిక్కుదం... వొశంగాకుండ పెర్కుతుండయ్ గీదొడలు..." అనుకుంట బొడ్లోంచి పెర్కిన ఆకుసంచిని పెర్కినట్లే బొడ్లో సెక్కుకోని గబగబా గేటు దగ్గరికొచ్చింది.

"..యమ్మా ఆ సెప్పులిడ్వు-ముందు... దండం బెట్కుంట పో..." బేజారు గొంతుతో తాకీదులిస్తున్న ఆ తెల్లబట్టలాయన మీద చిర్రెత్తింది పద్మమ్మకు.

పొద్దున్నుంచి చాయ్ దప్ప ఏం తినకుండొచ్చిన ఆకలి కడుపు మంట ఈమెది. వారం దినాలుగా నడుము నొప్పని మంచం బట్టిన పెండ్లాన్ని ఇయ్యాలన్నా సూపిద్దమని దుడ్లు జమ జేసుకొని లీవుబెట్టాలనుకున్న రత్నం లీవు దొరకదంటే డ్యూటికి వచ్చిండు. ఇంట్ల పెండ్లానికెట్లుందోనన్న దిగులుకు ఆకలి మంట తోడై బేజారైతున్నడు. హాజిరి కూతేసే చిటపటలాడే అతనికండ్ల దిక్కు సూసిన పద్మమ్మ "... ఆఁ ఇడ్వుతంలేబ్బా సెప్పులు... గంతగనం కండ్లుదీసి వొర్లాల్నా...

లోన అంతమంది కాల్లకు ఉండంగలేంది మావే అడ్డమైతయ్ ప్యాదలవి..." అనుకుంట కోర్టు హాల్లోకి కాలు బెట్టింది పద్మమ్మ.

"ఈ తలతిక్క మాటలే సెడ్పుజేసేది. ఇన్నేండ్ల సంది దొబ్బుకుంట వచ్చి అంతో ఇంతో ఇప్పియ్యనీకి తిప్పలు వద్దుంటే నోటికాడికొచ్చింది నేలపాల్ జేస్కునే రాత ఉన్నట్లుంది... సన్నాసి ముసల్ది..." మనసులోనే గొణుగుకుంటూ పద్మమ్మకు ఇషారా జేస్తున్నడు పాండురంగయ్య వకీలు.

"ఇక్కడ గాదు... అట్లకెల్లిపోయి ఆడ నిలబడు.." చాంబర్‌కు కుడిపక్క కింద తను నిలబడాల్సిన పద్ధతీ చోటూ చూపాడు వకీలు.

ఇప్పటికి ఎన్ని సార్లొచ్చిందో ఏమో కోర్టుకు. వొచ్చిన ప్రతిసారీ అర్థంకాని ఈ కలవరపాటే. పరీక్షలాగా ఎప్పుడూ కొత్తగనే అనిపిస్తది పద్మమ్మకు.

గ్రామీణ పేదల జీవితాలు బాగా పరిచయమున్న అనుభవంలోంచి అబ్బిన సహనమేమో మరి జిల్లా జడ్జి కొండారెడ్డి పద్మమ్మ పరేషానును అర్థం చేసుకున్నట్లుంది. అప్యాయంగా పలకరిస్తూ "ఏం తొందరలేదు. కలవరపడకమ్మా. నింపాదిగా జెప్పు. నీ పేరేంది?" అడిగాడు.

"అంతోటి కేకలేసుకుంట మింగెటట్లు జూస్కుంట పిల్చెగద సారు ఆయప్ప. పద్మమ్మ నా పేరు" అన్నది.

"గట్టిగా పిల్వకపోతెట్లా మీకు వినపడాలి కదా... అది సర్లే గానీ యా పద్మమ్మ అంటరు నిన్ను..." నవ్వు మొఖంతో అడిగాడు జడ్జి.

"కొర్విపాడు పద్మమ్మ సారూ, మనువొచ్చినందుకు శాంతినగరం పద్మమ్మని గూడా అంటరు."

"నీ భర్త పేరేంది?"

"అనుమంతు, నడిమింటి అనుమంతు. బుడ్డ అనుమంతని గూడ అంటరు."

స్వరంలో దుఃఖం కలిసొచ్చింది. జీరబోయింది పద్మమ్మ గొంతు.

కాసేపు మౌనం ఆవహించింది కోర్టు హాలంతా...

గౌర్నమెంటు వకీలు పి.పి. రఫీసాబ్ నిలువు మడతల ఫైలు తెరిచి పద్మమ్మను ఏదో అడగబోయి కోర్టు కానిస్టేబుల్ సుందర్‌ను దగ్గరికి పిలుచుకొని ఏదో తేలేదనో... రాయలేదనో చివాట్లు పెట్టి...

"సూడు పద్మమ్మ ఈ కాయితాల మీద సంతకం, వేలిముద్ర నీదేనా..." అడిగాడు.

"అవును సారు" పొడి జావాబిచ్చింది.

"ఏం రాసినరో వినిపిచ్చిన్రా సదివి..." ప్రశ్నించాడు... మళ్ళీ.

"ఏమో సారూ నాదుక్కంల నేనుండింటి. వొత్తమంటే వొత్తిన బొట్టె..."

ఆనాటి విషాదంలోంచి ఇంకా తేరుకోనట్లుంది. ఒక్కోమాట కూడబలుక్కొని చెప్పసాగింది... పద్మమ్మ.

"ఇంతకు నీ భర్త హనుమంతుకు ఏమయ్యిండె. ఎట్ల చనిపోయిండు!?"

పి.పి. సూటిగా అడిగిన ప్రశ్న వినగానే దుఃఖం తన్నుకొచ్చింది ఆమెకు. కొంగు ముఖానికి పెట్టుకొని వొళ్ళంతా వణికిపోతూ విలపించింది మౌనంగా.

ఆనాడు శవమై వాకిట్లో వాలిన భర్త మృతదేహం ముందు ఎదలు బాదుకుంటూ విలపించిన శోకాన్ని తలపించిందా సన్నివేశం.

జడ్జిగారు కలగజేసుకుని... "పద్మమ్మా నీ బాధ అర్థం చేసుకోగలం... ధైర్యంగా ఉండాలి. ఏడవకు..." సముదాయిస్తున్నారు.

భర్త చనిపోయిన ఇన్నేళ్ళ దుఃఖాన్నీ, కన్నీళ్ళనూ కడుపులో దాచుకుని తనకు ఏకైక అండగా తలమీద నీడలా మిగిలిన తన కొంగుతో కళ్ళొత్తుకుని మాట పెగలని గొంతులోంచి కూడబలుక్కున్నట్లు ఒక్కో మాటా విప్పార్చి రెండు చేతుల్లో ఎత్తిపట్టుకున్న కొంగులో చూపులు పరుచుకొని బదులిచ్చింది...

"... నా మొగనికి వాయిలేస్తుండె సారూ... కర్నూల్ల దావకాన్ల సూపిస్తుంటిమి. గా దినం దూపైందని నీల్లు దాగనీకె బాయిలకు దిగిండు. దిగినోడు దిగినట్లు అట్లనే..." – మళ్ళీ మౌనం – ఎగిసొచ్చే ఏడుపును తమాయించుకోలేకపోతోందామె.

కాసేపాగి తేరుకుని "బాయిల పడి సచ్చిండు. నా మొగడు, నా దేవుడు నాకు దూరమైండు... భగవంతుడన్యాలం జేసిండు... గంతే! నా మొగడు బాయిలపడే సచ్చిండు..." మాట ముగిసింది... శోకవిలాపరాగంలో!

పి.పి. రఫీ కలగజేసుకున్నడు.

"కాదమ్మా నీవు ఇది వరకు చెప్పిన స్టేట్‌మెంట్లు, కంప్లైంట్ల నీ భర్తను సంపి బాయిల పడేసింర్రని రాసి ఉంది..." అన్నాడు.

"కాదు సారు... కాదు... కాదు... పొడి పొడి మాటల జవాబిచ్చింది.

ఫైలు తెరిచి గవర్నమెంటు వకీలు రికార్డైన కేసు వివరాలను కాగితాల్లోంచి గట్టిగా చదువుకుంటూ వివరంగా పద్మమ్మ ముందు పెడుతున్నాడు.

"... నీ భర్తకూ మద్దిపేట శేషు మనుషులకూ శతృత్వం ఉండె. వాళ్లకు పోటీగా నీ భర్త సర్పంచ్‌గా నిలబడినందుకు కక్ష ఇంగా పెంచుకొని మీ బాయి కాడి మోటర్లు, వ్యవసాయ పరికరాలూ, పంట పొలమూ తగులబెట్టి భయభ్రాంతులు చేసింర్రు. ఎంతకూ లొంగని నీ భర్త హనుమంతును అయిదేండ్ల కింద మనుషులను బెట్టి సంపిచ్చి బాయిల పడేసిండు..."

"ఇది గదా నీవు సంతకం బెట్టి ఆనాడు నీ భర్త చావుకు కారణమైన వాళ్ళను శిక్షించి న్యాయం జెయ్యమని కోర్టువారికి మొరపెట్టుకున్నవు..." అన్నాడు.

"కాదబ్బా కాదు. నా మొగుడు వాయిలేసి బాయిలపడి కాలం జేసిండు. ఎవ్వరు జంపలే..." ఈసారి గట్టిగానే చెప్పింది.

"నిన్నెవరో భయపెట్టి ఈ అబద్ధపు మాటలు చెప్పిస్తున్నట్లున్నరు. భయపడొద్దు. ధైర్యంగా నిజం జెప్పు... నిజం జెప్పు పద్మమ్మా..."

ఎంత తుడుచుకున్నా ఆమె కళ్ళ మీద కమ్ముకొస్తున్న కన్నీటి ఊట జడ్జిగారి హృదయాన్ని తాకినట్లుంది. కళ్ళ జోడు తీసి కనపడకుండా కళ్ళొత్తుకొని నిజం జెప్పమని ధైర్యం జెపుతున్నాడు.

"అదిగో అక్కడ నిల్చున్న వాళ్ళు నీ భర్తను మద్దిపేట శేషు ఆదేశం ప్రకారం చంపినారని ఆరోపించబడ్డారు..."

"బాగా చూడు వాళ్ళు నీకు తెలుసా.. ధైర్యంగా నిజం జెప్పు. నీ బతుకు ఆగం జేసి నీ భర్తను సంపినోళ్ళను శిక్షించడానికి చట్టానికి సాయపడాలె గదా...!" అన్నాడు పి.పి.

ఎవరెన్ని జెప్పినా ఆమె నుండి ఏ జవాబూ లేదు.

మళ్ళీ పి.పి.నే "చూడమ్మా చట్టం నేరస్థుల్ని శిక్షించి నీకు న్యాయం చేస్తుంది. అండగా ఉంటుంది. నిజం చెప్పు ధైర్యంగా. నీకు

అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తుంది చట్టం. ఏం పద్మమ్మా ధైర్యం జెయ్యి. నిజం జెప్పు...”

భర్తను కళ్ళెదుట కోల్పోయిన దుఃఖం మూట గట్టుకున్న కొంగును పిడికిట బిగపట్టి భారంగా తలఎత్తి జడ్జిగారి దిక్కు చేతులు జోడించింది.

“యాడికన్న బోయి బత్కుతం. నా మొగన్ని ఎవ్వరు జంపలే. ఆయిషి దీరింది. కాల్జారింది. బాయిలవడి కాలం జేసిండు. గా పరమాత్ముడే సాచ్చి. గిదే నిజం సారూ... గిదే నిజం...”

జరిగినదంతా కంప్యూటర్ల ఎక్కించడానికి కొదుతున్న టపటప శబ్దాలు తప్ప సడీ సప్పిడీ లేని అంతులేని అగాధమై స్తంభించిపోయింది హాలు హాలంతా.

అక్కడున్నోల్లు ఎంత ప్రయత్నించినా ఆమె నోట మరో మాట రాలే.

తెలివొచ్చి తిరుగులాడ వట్టిన పసితనం నుండి కండ్లారా చూసినవి నోరారా పల్కడానికి నాలుకలు మిగలని కసాయి కాలాన్ని ఇన్నేళ్ళుగా చూస్తున్న అనుభవం, మాటినకపోతే ఊర్లకు ఊర్లే వొల్లకాడ్లైపోయిన జ్ఞాపకాలింకా సజీవంగా దాచుకున్న అరవై ఏండ్లు పై బడ్డ పచ్చిగాయాల గుండె ఘోష పద్మమ్మ. అట్లాగాకపోతే ఇంగెట్లా మాట్లాడుతది.

పెట్టాల్సిన చోట సంతకాల వేలిముద్రలు పెట్టి ఇంకా బూడిదగాకుండా మిగిలిన ఆకాసింత పాత గుడిసెగూడును యాది జేసుకుంటూ ఇంటికాడ దూపగొన్న పశువుల గొంతు తడపడానికీ, గండు పిల్లుల షికారు గాకుండా గంపకింద దాయాల్సిన కోడిపిల్లల గురుతు జేసుకుంటూ పద్మమ్మ ఊరి బాట బట్టింది.

నదులుండీ, నేల వుండీ, చేసుకు బతికే ఇగురముండీ రాచరిక పాలనలో వొరిగిన రైతుల ఊచకోతల నుండి నిన్నమొన్నటి ఆసియా బేగం అంతం దాకా ఊరూ పేరూ లేక ఊపిరులిడుస్తున్న ఎంతెంత మంది హనుమంతుల పోగొట్టుకున్న పరిపుష్ట ప్రజాస్వామ్య చీకటి కొట్టాల పాలనలో ఈ ప్రాంత నోరిప్పక నేలరాలిన, తల్లుల తండ్రుల బిడ్డల విశాదవలయాల అదృశ్యాల్లో, సజీవ దహనాల్లో ఇదీ ఓ అతి చిన్న ఘటనై కాలగర్భంలో కలిసి జనం స్మృతి పథంలోంచి చెరిగిపోతుంది.

ఇట్లా తలమీది నీడ కోల్పోయి బజారు పాలైపోయిన బతుకు ఈడాల్సిన పద్మమ్మ శోకం మొదటిదీ కాదు. చివరిదీ కాదు.

పట్టపగలు నడి ఊర్లో తొడగొట్టి నెత్తురుటేరులు పొంగించిన ఎన్నెన్ని కేసులు హొస్టైలై కోర్టు రికార్డుల్లో రోధిస్తున్నాయో...

తమ తమ జ్ఞాపకాల్లోంచి కోర్టు పరిసరంలో గుమిగూడిన తెలిసిన జనం బహిరంగంగానే మాట్లాడుకున్న మాటల సారమిదే!

అప్పటికి ఒక అభాగ్య పద్మమ్మ భర్త హత్యకేసు మరో హొస్టైల్‌గా ముగియబోతుందేమోగానీ “హొషియార్... హొషియార్” కాషన్‌తో అందరూ లేచి తలొంచి నిలబడగా కోర్టుకు నమస్కరించి బెంచ్ దిగిపోతున్న జడ్జ్ కొండారెడ్డి హృదయం బరువెక్కిన నిట్టూర్పుతో కేసు వెనుక దాగిన కుట్రల్ని తలపోసుకుంటూ తీర్పించ్చిందిలా...

“...భయం... భయానకంగా పేదల బతుకులపై స్వారీ చేస్తుందిక్కడ...”

“జన చైతన్యం పెల్లుబకడమొక్కటే పరిష్కార దిక్కై మిగిలిందీళ్ళకు. కొత్త చైతన్య ప్రదాతల కోసం ఈ నేల పడుతున్న పురిటినొప్పులు గొంతిప్పలేని పద్మమ్మల తీరని దుఃఖంలో పురుడుపోసుకు తీరుతాయి... హొషియార్”.

(33వ పేజీ తర్వాత)

ద్వారా - బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ లతో పాటు సన్యాసాన్ని నాలుగవ ఆశ్రమంగా గుర్తించడం ద్వారా, సి) జనన మరణ చక్రం నుండి బయట పడడం - తపస్సు ద్వారా మోక్షం అన్న భావన, డి) ఇంకా అష్టాంగ సూత్రాలలో ఉన్న నైతిక విలువలను స్వీకరించడం ద్వారా బ్రాహ్మణ మతం తనను తాను పరిపుష్టం చేసుకుంది. బౌద్ధ భావజాల విలువలను తానే స్వతంత్రంగా అభివృద్ధి చేయడం ద్వారా గాని, లేదా బౌద్ధ మతం నుండి స్వీకరించడం ద్వారా గాని బౌద్ధ మతానికి ఎటువంటి ప్రత్యేకతలు లేకుండా చేసింది బ్రాహ్మణ మతం. ఇంకా తన వైదిక భావజాలాన్ని కూడా కొనసాగించుకుని, కొత్తగా గిరిజనుల సంస్కృతులను కూడా కలుపుకుని బ్రాహ్మణ మతం చాలా వైవిధ్యాన్ని ప్రదర్శించింది. స్థానికుల, గిరిజనుల సంప్రదాయాలను విస్తృతంగా స్వీకరించిన క్రమంలో ఈ నయా బ్రాహ్మణ మతంలో వైవిధ్యం ఎంత ఉందో వైరుధ్యం కూడా అంతే ఉంది.

యజ్ఞ యాగాలద్వారా జంతుబలి ఇచ్చే కర్మకాండ భావజాలమైన బ్రాహ్మణిజం, జీవితం నుండి విముక్తిని కోరే సన్యాసిత్వ భావజాలం అయిన శ్రమణ వాదాలు రెండూ ఒకదానికి ఒకటి పొసగనివి అయినప్పటికీ శతాబ్దాల కాలంలో అవి పరస్పరం ప్రభావితం చేసుకోవడం, సంకరం (ఫ్యూజన్) చెందడం కనిపిస్తుందంటాడు లాల్ మాణి జోషి. బౌద్ధ మతం మంచి ప్రాచుర్యంలో ఉన్న కాలంలోనే మహాభారతం కూర్పు (క్రీ.పూ 400 నుంచి క్రీ.శ 400 వరకు) జరిగిందని, అందులో అనేక బౌద్ధ భావనలు చేర్చబడ్డాయని అయితే ఎక్కడా కూడా బుద్ధుని పేరు మాత్రం రానీయలేదని అంటాడు జోషి. పరస్పర ప్రభావాలతో క్రీ.శ. మొదటి శతాబ్దాల నాటికి బుద్ధిజం నియో బుద్ధిజంగా, బ్రాహ్మనిజం నియో బ్రాహ్మనిజంగా మారాయని, క్రీ.శ మొదటి సహస్రాబ్దం రెండవ భాగం (క్రీ.శ 500 - 1000) నాటికి బౌద్ధ మతం తాంత్రికవాదంగా మారగా, బ్రాహ్మణ మతం హిందూమతంగా మారిందంటాడు. అంతకు ముందు అవి నియో బుద్ధిజంగా లేదా మహాయానంగా ఇంకా నియో బ్రాహ్మణిజంగా లేక పౌరాణిక బ్రాహ్మణిజంగా మారాయి అంటాడు (పుట 22). నిజానికి ముందు భాగాలలో మనం చూసినట్లు క్రీ.శ 1000 నాటికి హిందూమతం అనే పేరే లేదు. అయితే రచయిత ఉద్దేశాన్ని సారాంశంగా తీసుకోవాలి. హిందూయిజానికి ప్రస్తుత పేరు వెయ్యి సంవత్సరాల క్రితం లేకపోయినా వస్తుసారం అయితే ఉంది. పాఠకుడు లాల్ మణి జోషి వ్యాసం ‘బ్రాహ్మణిజం, బుద్ధిజం, హిందూయిజం’, డి.యన్.ఝా రచన ‘ఏన్సియంట్ ఇండియా’ ఇంకా ముందుగా పేర్కొన్న ‘రీ థింకింగ్ ఇండియా’ అనే సంకలనంలో ఉన్న జాఫ్రే ఎ ఒడ్డీ వ్యాసం నేరుగా చదవడం మంచిది. ఇర్ఫాన్ హబీబ్ ‘ఎస్సేస్ ఇన్ ఇండియన్ హిస్టరీ’ పొలిటికల్ ఎకానమీ పరమైన విశ్లేషణను కూడా అందించగలదు. రొమిలా థాపర్, డి.డి. కోసంబి, రచనల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వ్యాసం

హస్‌దేవ్ అడవులకు రక్షణగా

మూలవాసుల పోరాటం

కురుసం శంకర్



మనుగడ కోసం మరో పోరాటం హస్‌దేవ్ అడవులలో బద్దలైంది. మనిషి మనుగడ ప్రకృతి నుండి విడివడింది కాదు, అది ప్రకృతిలో భాగం. ప్రకృతిని కాపాడుకోకుండా మనిషిని కాపాడుకోలేం. మనిషి మనుగడ కోసం అడవులు కావాలి. అడవులంటేనే వన్యప్రాణులు, వృక్ష, జంతుజాలాలు వర్ధిల్లుతుంటాయి. పుష్కలమైన భూఉపరితల, భూగర్భ నీటి వనరులకు నిలయాలు. అన్నీ కలిపే పర్యావరణంగా చెప్పుకుంటున్నాం. వాటిని కాపాడుకోవాలి. పెంచుకోవాలి. విస్తరించుకోవాలి. కానీ, తద్భిన్నంగా వ్యాపార, వాణిజ్య పెట్టుబడులు, మార్కెట్ ఆక్టోపస్‌లా విస్తరిస్తున్నవి. ఆ విస్తరణకు రాజ్యం కాపలాదారుగా (చౌకీదార్) నిలిచింది. ఆ విస్తరణకు నియో లిబరల్ ఆర్థిక విధానాలు వకాల్తాను చేపట్టాయి. ఒకవైపు మనిషి మరోవైపు పెట్టుబడి. ఒకవైపు రాజ్యం మరోవైపు ప్రజ. ఒకవైపు న్యాయం, మరోవైపు అన్యాయం. ఒకవైపు అడవులను కాపాడుకుందాం, మరోవైపు పెట్టుబడులను పెంచుకుందాం. ఒకవైపు పెట్టుబడుల విన్యాసం, మరోవైపు మనుగడ కోసం పోరాటం. సర్వం విధ్వంసానికి సాక్షంగా నేడు హస్‌దేవ్ అడువులు విలపిస్తున్నాయి. ఆ అడవులలోని మూలవాసులు వాటి రక్షణకు కంకణం కట్టుకున్నారు.

ఛత్తీస్‌ఘడ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పర్చడంలో భారత పాలకుల కన్నంతా అక్కడి అపార అడవులపైనే, వనరులపైనే నన్నది జగమెరిగిన సత్యం. ఝార్ఖండ్ కూడ అందుకు మినహాయింపేమీ కాదు. కాకపోతే, తేడా అల్లా ఛత్తీస్‌ఘడ్ అడగకుండానే అందివచ్చిన ఫలం కాగా, ఝార్ఖండ్ మాత్రం ప్రజా పోరాటాల పాక్షిక విజయం. పాలకులు ప్రతీదీ ప్రజల మనో ఆకాంక్షలు, అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూనే చేస్తారు. వారికి అది అవసరం. వారికి అది 'రామబాణం'. రాష్ట్రాల విభజనను నియో లిబరల్ ఆర్థిక విధానాలు వేగవంతం, అనివార్యం చేశాయి.

అందుకు ప్రజా ఉద్యమాలు తోడయ్యాయి. ఇది ఒక భౌతిక వాస్తవం. దీనిని ఎవరు ఏరకంగా తమ రాజకీయాలకు వినియోగించుకున్నప్పటికీ విభజన డైనమిక్స్ వెనుక బలంగా పనిచేసింది మాత్రం ఆర్థిక విధానాలేననడం తదనంతర పరిణామాలను అర్థం చేసుకోవడానికి, వాటితో వ్యవహరించడానికి అవసరమైన, సరైన ప్రాతిపదికను, పరిష్కారాలను అందిస్తుంది.

హస్‌దేవ్ అడవులు ఉత్తర ఛత్తీస్‌ఘడ్‌లోని సర్గూజా, కోర్బా, సూరజ్‌గఢ్ జిల్లాలలోని 1 లక్షా 70 వేల హెక్టార్ల (దాదాపు 4 లక్షల ఎకరాలకు పైగా) భూభాగంలో వ్యాపించి ఉన్నవి. తరతరాలుగా ఆ అడవులు మన దేశ పర్యావరణానికి ప్రకృతి ప్రసాదించిన వరంలా నిలిచాయి. భారతదేశ సమృద్ధమైన అడవులలో హస్‌దేవ్ అడవులు కూడ చెప్పుకోదగినవే. అవి అనేక రకాల జీవవైవిధ్యానికి నిలయాలు. ఆ అడవుల పరిరక్షకులుగా నిలిచిన పిడి పిడీల మూలవాసులకు, వారి ఎనలేని త్యాగాలకు దేశం సదా ఋణపడి ఉంటుంది. ఆ అడవులలో గోండు, ఉరాంవ్, కుంవర్‌లతో పాటు ఇతర మూలవాసుల సమూహాలకు చెందిన 10 వేల కుటుంబాలుంటాయి. వారికి జీవితాన్నిచ్చేవి, జీవికను సమకూర్చేవి సర్వం ఆ అడవులేనని ఆ ప్రజలు సంతోషంగా చెప్పుకుంటారు. వారికి ఆనల్ (ఇలవేల్పు) ఆ అడవులే! వారికి పేన్ (దేవత) ఆ అడవి తల్లే! అడవి లేకుండా వాళ్లు లేరు. వారి

మనుగడ లేదు. వారి ఆచార వ్యవహారాలూ లేవు. వారి ఉనికి లేదు. వారికి ఆత్మ లేదు, ఆత్మ గౌరవం లేదు.

1 నవంబర్ 2000 నాడు ప్రత్యేక రాష్ట్రంగా పురుడు పోసుకున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి ఉత్తరాన హస్‌దేవ్ అడవులు, దక్షిణాన బస్తర్ అడవులు కావడికి రెండు వైపులా భారీ మూటలు వేలాడదీసుకున్న చందంగా ఉంటూ ఉత్తర దక్షిణ వియత్నాంలను గుర్తు తెస్తాయి. రెండు ప్రాంతాలలో కొద్దో-గొప్పో; ఆటులోనో-పోటులోనో; వెనుకంజలోనో-ముందంజలోనో విప్లవోద్యమాలు కొనసాగుతుండడం ఆ ప్రాంతాల విశేషం. కాకపోతే, ఉత్తర ఛత్తీస్‌ఘడ్‌లోని ఆదివాసులలో క్రైస్తవం ప్రాబల్యం సంతరించుకోగా, దక్షిణ ఛత్తీస్‌ఘడ్‌లో క్రైస్తవం పునాదులు బలపడుతున్నాయి. కొత్త వైరుధ్యాలు వెలుగుచూస్తున్నాయి. ప్రజల పోరాట జాగరూకతను మొద్దుబార్చడంలో మతం తన వంతు పాత్ర అది రాజ్యంతో కలసి కొనసాగిస్తున్నది.

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు ప్రాంతాల 'అభివృద్ధి' కోసం రెండు ప్రత్యేక బోర్డులను ఏర్పరిచింది. రెండు వైపులా అడవులలో రకరకాల గనులు, ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. జలవనరులకు కొదువ లేదు. జీవవైవిధ్యానికి, పర్యావరణానికి ఆయువు పట్టులాంటి ప్రాంతాలు రెండు. కాకపోతే, హస్‌దేవ్ అడవులలోని విస్తారమైన ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఉండగా బస్తర్‌లో, దానిని ఆనుకొని ఉన్న గడ్‌చిరోలీలో వాటి బదులు అపారమైన ఇనుప గనులున్నవి. హస్‌దేవ్ అడవులలో 1,879.6 చదరపు కిలోమీటర్లలో బొగ్గు నిక్షేపాలున్నవి. మోదీ అండ్ కంపెనీ అధికారంలోకి రావడానికి యూపీఏ హయాంలో చోటుచేసుకున్న కోల్ బ్లాక్ కుంబకోణాల కథలు జగద్విదితమే. ఉత్తర ఛత్తీస్‌ఘడ్‌లో చాలా మేరకు అదానీ సామ్రాజ్యం విస్తరించి ఉండగా, బస్తర్‌లో ఎన్ఎండీసీతో పాటు ఎస్సార్ పెట్టుబడులు, ఇటీవలి కాలంలో అదానీ తదితర దళారీ పెట్టుబడిదారులు రంగ ప్రవేశం చేస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి.

ఛత్తీస్‌ఘడ్‌లో భాగమైన రెండు ప్రాంతాలు భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలోకే వస్తవి. రాజ్యాంగ సవరణ 73 కు అనుబంధంగా 1996లో చేసిన సవరణతో ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలకు పెసా (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ - PESA) వర్తిస్తుంది. పెసా ను రాజ్యాంగంలో రాజ్యాంగంగా భారత రాజ్యాంగ వీరాభిమానులు చెప్పుకోవడం గమనార్హం. పెసా ప్రకారం ఆదివాసీ గ్రామాలలో గ్రామసభలు ఏర్పడుతాయి. ఆ గ్రామసభలకే అడవులపై, ప్రధానంగా లఘు అటవీ ఉత్పత్తులపై యాజమాన్య హక్కులు ఒనగూడాయి. అడవులలో ప్రభుత్వం కానీ ప్రైవేటు వ్యక్తులు కానీ ఎవరు ఏం పని చేయాలన్నా, కనీసం అడవులలోకి ప్రవేశించాలన్నా ప్రప్రథమంగా గ్రామసభల అనుమతి అనివార్యం. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్త పూర్వ చట్టాలను పెసా ప్రకారం సవరించుకోవాలి. సాధారణంగా పెసాను సవరించే అధికారం లేదెవరికి! అందుకే ఆ చట్ట రూపకల్పనలో పాలుపంచుకున్న ఆదివాసీ హితైషీలు "న లోక్ సభ, న రాజ్య సభ సబ్ సే ఊపర్ గ్రామసభ" అనే నినాదం మాటున దాని శక్తిని జనానికి చెప్పారు. దేశంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాల ఆదివాసులు "జల్, జంగల్, జమీన్ హమారా హై" అనే రణనినాదాన్ని వినిపిస్తున్నారు. 2016లో విస్థాపన్ విరోధి జన్ వికాస్ ఆందోళన్ వారు రెండు దశాబ్దాలైనా అమలు కాని పెసా పై కార్యశాల నిర్వహించి దేశవ్యాపితంగా ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో పెసా అమలుకు ఉద్యమించాలని చేసుకున్న తీర్మానంలో భాగంగా ఉత్తర ఛత్తీస్‌ఘడ్‌లో 2017 నుండి పత్థల్‌గఢీ (గ్రామసభల నిర్మాణ సంకేతంగా శిలాఫలకాన్ని పాతడం) ప్రజా ఉద్యమం ప్రారంభం కాగా 2019 చివరికి అది బస్తర్‌కు విస్తరించింది. ఇక్కడే మరో చట్టపర విషయాన్ని చెప్పుకోవాలి. ఆదివాసీ ప్రాంతాలలో పరిశ్రమలు నెలకొల్పే కార్పొరేటు వర్గాల వారు తమ సామాజిక బాధ్యతగా (సీ.ఎస్.ఆర్) ప్రభుత్వం పేర్కొన్న విధంగా నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. కాగా, బొగ్గు గనుల ప్రాంతాలలో మాత్రం చట్టపరంగానే లాభాలలో 26 శాతం స్థానిక మూలవాసీ ప్రజలకు కేటాయించాలని శాసనబద్ధం చేశారు. కాకపోతే, ఆ నిధులలో జరిగే అవినీతిపై దినపత్రికలు తిరగేస్తే అనేక గోల్‌మాల్ కథలు తెలుస్తాయి. అలాగే, పెసా ఉనికిలోకి వచ్చి పాతికేళ్లు గడచిపోయినా అది అంతంత మాత్రంగానే ఉనికిలోకి వచ్చిందంటే, ఇక మిగితా చట్టపర ప్రయోజనాలు జనాలకు దక్కుతాయనుకోవడం కుందేటి కొమ్ముల కోసం వెతుకులాటగానే ఉంటుంది. హస్‌దేవ్ అడవుల నుండి దేశంలోని ఐదవ షెడ్యూల్డ్ అడవులంతటా ఉనికిలోకి వచ్చిన ఏ తవ్వకానికి కానీ, ఏ పరిశ్రమకు గానీ, ఏ ప్రాజెక్టుకు కానీ గ్రామసభల అనుమతులు లేవనీ, అవన్నీ బూటకపు గ్రామసభల అనుమతులను నిరంకుశాధికారులతో కలసి సృష్టించుకున్నారనే నిజాన్ని మరచిపోకూడదు. కానీ, ఇపుడు ఆ ఆటలు చెల్లడం లేదు. దానితో అసలు ఆ చట్టాన్నే వుంచడమా, రద్దుచేయడమా అనేది కేంద్రం తీవ్రంగా ఆలోచిస్తున్న విషయంగా మారింది. ఇలాంటిదే బ్రెజిల్‌లో రద్దయింది కూడ!

దేశవ్యాపితంగా మూలవాసులు తమ హక్కుల కోసం పోరాడుతున్నట్టే, మోదీ అండ్ కంపెనీ ఆందోళన జీవుల గురించి, తుక్డే తుక్డే గ్యాంగుల గురించి ఎగసెక్కం చేస్తూ ఎంత దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ హస్‌దేవ్ అడవులలోని మూలవాసులు తమ పెసా హక్కుల కోసం పోరాడుతున్నారు. ఆ ప్రాంతం, దానిని ఆనుకొని ఉన్న ఝార్ఖండ్ ప్రాంతంలోని 11 వేలకు పైగా మూలవాసులపై కాలం చెల్లిన రాజద్రోహం కేసులను అప్పటి కాషాయ భక్తుల ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాల పాలకులు మోపారు. వారు క్రైస్తవ మతం, మావోయిస్టుల ప్రోత్సాహంతో పోరాడుతున్నారనీ, వారు కావాలనీ వారిని రెచ్చగొడుతున్నారనీ కాషాయ బ్రిగేడ్ చేయకూడనంత తప్పుడు ప్రచారం చేసింది. అయినప్పటికీ వారి పోరాటాలు ఆగింది లేదు. సమస్యలున్నంత వరకు సరైన సమాధానాల కోసం జనం పోరాడుతూనే ఉంటారు. హస్‌దేవ్ అడవులలోని 20 గ్రామసభలకు చెందిన మూలవాసీ ప్రజలు గాంధీ అంటే వారికి తెలియని, అర్థంకాని అమాయకత్వంతోనో, లేదా పాలక గాంధీ భక్తుల కనువిప్పు కోసమైనా కావచ్చు, 2021 గాంధీ జయంతి నుండి 13 అక్టోబర్ వరకు 300 కిలోమీటర్ల దూరం పాదయాత్ర జరిపారు. తమ హక్కుల సాధన కోసం జల్, జంగల్, జమీన్ మాదేనంటూ నినదిస్తూ రాష్ట్ర రాజధాని రాయపుర్‌కు చేరుకున్నారు. వారు హస్‌దేవ్ అరండ్, ధరంజయ్‌గఢ్‌లలో వెంటనే బొగ్గు తవ్వాకాలపై నిషేధం విధించాలనని అధికారులకు విన్నవించుకున్నారు.

గత కొద్ది సంవత్సరాలుగా దేశం బొగ్గు కొరతను ఎదుర్కొంటుందనీ, దానితో వివిధ కీలక రంగాలలో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయనీ జరుగుతున్న ప్రచారం చూస్తున్నాం. గోరు చుట్టుపై రోకటి పోటులా సామ్రాజ్యవాదులు రుద్దిన ఉక్రెయిన్ యుద్ధం ముందుకు వచ్చి మన దేశంలోని సింగరేణి బొగ్గు గనుల నుండి అనేక రంగాలు ప్రభావితమవుతూ ప్రజా జీవనం అస్తవ్యస్తం అవుతోంది. కానీ, మోదీ

ప్రభుత్వం బొగ్గు సంక్షోభం పేరుతో అనేక బొగ్గు గనుల తవ్వకాలకు పూనుకుంటున్నది. దేశంలో ప్రస్తుతం బొగ్గునందిస్తున్న 193 బొగ్గు గనులను విస్తరించడంతో పాటు నూతనంగా 55 బొగ్గు గనుల తవ్వకాలకు ప్రభుత్వం పథకాలు రూపొందించింది. దీనితో దేశంలో యేటా బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందనీ ప్రభుత్వం లెక్కలు వేస్తున్నది. కానీ, ఆ తవ్వకాలతో తమ ఉనికినే కోల్పోతున్న మూలవాసులు, వారి అడవుల గురించి మోదీ అండ్ కంపెనీ మేకిన్ ఇండియాకు అవసరం లేదు. వారిదంతా సులభ వ్యాపార నీతే (ease of business doing). అదే ఇపుడు దేశంలో రాజ్యమేలుతోంది.

హస్‌దేవ్ అడవులలో విస్తరించి వున్న 1,879.6 చదరపు కిలోమీటర్ల పరిధిలోని బొగ్గు నిక్షేపాల ప్రాంతాన్ని 30 కోల్ బ్లాకులుగా విభజించారు. ఆ అడవులలో 5 బిలియన్ టన్నుల నిక్షేపాలున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. నిజానికి గతంలో ఇక్కడ ఎలాంటి తవ్వకాలు జరుగలేదు. ఒకప్పుడు ఇవన్నీ నిషేధిత ప్రాంతాలే. కానీ, నియో లిబరల్ ఆర్థిక విధానాల వత్తిళ్లతో 2010లో (అప్పటికి ఆ ప్రాంతంలోని విప్లవోద్యమం చాలా బలహీనపడింది) భాజపా నాయకత్వంలోని ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం తారా, పరసా తూర్పు, కాంతే బసన్‌లలో 1,898.328 హెక్టార్ల అటవీ భూమిని రాజస్థాన్ విద్యుత్ బోర్డుకు అప్పగించింది. అపుడు అక్కడ భాజపా నాయకత్వంలోని ప్రభుత్వమే ఉండింది. దానిని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అలాగే, 2011 జూన్‌లో కేంద్ర పర్యావరణ, కాలుష్య నివారణ అడవుల పానెల్ పర్యావరణపరంగా హస్‌దేవ్ అడవుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని మూడు కోల్ బ్లాకులలోని తవ్వకాలకు అనుమతిని నిరాకరించింది. అయినప్పటికీ అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రి జైరాం రమేశ్ దానిని లక్ష్య పెట్టకుండా తవ్వకాలకు అనుమతిని ఇవ్వడంతో 2014లో సమస్య జాతీయ హరిత న్యాయస్థానానికి (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)కు వెళ్లి తవ్వకాలు నిలిచిపోయాయని రాజ్యాంగాన్ని మించిన రాజకీయ భక్తులు వివరిస్తుంటారు. కానీ, ఆ నిలుపుదల వెనుక దశాబ్దకాలం రగిలిన ప్రజా పోరాట జ్వాలలను వారు చూడ నిరాకరిస్తారు కాబట్టి వారు చట్టాలలోనే తలమునకలవుతారు.

మరోవైపు 2014 తర్వాతి కాలమంతా మోదీ సంస్కరణల కాలం. ఆయన చేపట్టిన తొలి ప్రభుత్వ చర్యలలో వ్యాపారానికి అడ్డునిలిచిన చట్టాలను సవరించడమే చాలా ముఖ్యమైనవి. వాటిలో భాగంగా ఏర్పడిన "సుబ్రమణియన్ కమిటీ అండ్ ద డ్రాఫ్ట్ ఎన్విరాన్మెంట్ లాస్ (అమెండ్ మెంట్ బిల్ 2015)" పర్యావరణ చట్టాలను మౌలికంగానే మార్చివేసింది. దానితో, ప్రైవేటీకరణ దూకుడు పెరిగిన మేకిన్ ఇండియా హయాం మూడు పువ్వులు ముప్పై ఆరు కాయలుగా కలలు కంటున్నది. ఆ స్వప్న ఫలితమే మోదీ ప్రభుత్వం బొగ్గు క్షేత్రాలలో 100 శాతం ఎఫ్.డీ.ఐ.ని అనుమతించడం. వాటికి తోడు ఇపుడు తిరిగి రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలనే ఉండడంతో తిరిగి హస్‌దేవ్ అడవులలో లొల్లి మొదలై వారి దుష్ట రాజకీయాలకు ప్రజలు బలవుతున్నారు. రాజస్థాన్ విద్యుత్ బోర్డు దళారీ పెట్టుబడిదారుడైన అదానికి తవ్వకాల పనులను అప్పగించడంతో అడవులు ప్రజా పోరాటాలతో రాజుకుంటున్నాయి.

హస్‌దేవ్ అడవులలో అదానీ, వేదాంత, ఆదిత్య బిర్లాలు ఆ అడవులను కైవసం చేసుకోవడానికి వేలంలో పోటీలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే హస్‌దేవ్ అడవులలో బొగ్గు నిక్షేపాల తవ్వకానికి పాలకవర్గాలు వేగిరపడుతుండగా, ప్రజలు తమ మనుగడ కోసం ర్యాలీలు, ధర్నాలు, పోరాటాలు, పాదయాత్రలు చేపడుతున్నారు. వాటన్నిటికి పరాకాష్టగా హస్‌దేవ్ అడవులలోని ఆదివాసులు ముఖ్యంగా మహిళలు, పిల్లలు తాము ప్రాణం కన్నా మిన్నగా చూసుకునే అడవులలోని చెట్లను నరకనీయమంటూ వాటిని అల్లుకుపోతూ 1970లలో ఉత్తరాఖండ్‌లో ముందుకు వచ్చిన 'చిప్కో' (అతుక్కుపోవడం) ఆందోళనను గుర్తు చేస్తున్నారు. ఒకవైపు అదానీ, వేదాంత, ఆదిత్య బిర్లా, మరోవైపూ ప్రజ. హస్‌దేవ్ అడవులలో ఇపుడు దృగ్గోచర అంశం ఇది. ఒకవైపు అభివృద్ధి మంత్రం, మరోవైపూ మనుగడ కోసం పోరాటం. ఒకవైపు గోదీ మీడియా, మరోవైపు ప్రత్యామ్నాయ మీడియా! ప్రజాపోరాటాల ఆలంబనగా వికసిస్తున్న ప్రత్యామ్నాయ మీడియా. ఫిబ్రవరి 8, 2022 నాడు కేంద్రం విడుదల చేసిన "కేంద్ర మీడియా గైడ్ లైన్స్"తో తన ఆశలను, ఆశయాలను కోల్పోనున్నది. అందులో "దేశ రక్షణ, సార్వభౌమత్వం, అఖండత"తో పాటు "పబ్లిక్ ఆర్డర్, గోప్యతనం, నైతికత"లకు భంగం కలిగించే పాత్రికేయులు తమ గుర్తింపును కోల్పోతారని హుకూం జారిచేశారు. ఇది తమ పోరాటాలకు అండగా నిలిచిన ప్రజాహిత మీడియాను కాపాడుకోవడానికి కొత్త పోరాటాలకు నడుం బిగించాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తుంది.

హస్‌దేవ్ అడవులలో గనుల తవ్వకానికి చట్టపరంగా మూలవాసీ ప్రజల గ్రామసభల అనుమతి అనివార్యం. ఆ అనుమతి లేదు కాబట్టి తవ్వకాలు చెల్లనేరవు. ఈ విషయాన్ని 2019-2021 మధ్య ఆ ప్రాంతాన్ని దాని ప్రాముఖ్యతను అధ్యయనం చేసిన ఎన్.జీ.టీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) నివేదిక కూడ పేర్కొంటున్నది. హస్‌దేవ్ అడవుల పచ్చదనం దెబ్బతింటుందనీ, అక్కడికి వలస వచ్చే జంతువుల నడవా కూడ లేకుండా పోతుందనీ, ఆ అడవులు ఏనుగుల నివాస కేంద్రాలని వాటి మనుగడ కూడ తవ్వకాలతో ప్రశ్నార్థకంగా మారుతుందనీ, అడవులు ధ్వంసమైన పిదప అవి మానవుల ఉనికికి మరింత ప్రమాదకరమైన అనివార్య ఘర్షణలోకి దిగుతాయనీ ఇంకా అనేక రకాల దుష్ప్రభావాలతో ఆ అడవి అనేక సంవత్సరాలపాటు తిరిగి కోలుకోని విధంగా నాశనం అవుతుందనీ అధ్యయనంలో తెలిపారు. అందుకే దానిని కావాలనే వెలుగు చూడనివ్వడం లేదు ప్రభుత్వాలు.

ప్రభుత్వ నివేదికలో వెల్లడైన అంశాలనే ప్రజలు తమ అనుభవం నుండి వివరిస్తున్నారు. హస్‌దేవ్ అడవులలో ఇప్పటికే తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో అడవంతా నాశనమైపోయిందనీ, అక్కడి నదులన్నీ వట్టిపోతున్నాయనీ, నీళ్లన్నీ కలుషితమవుతున్నాయనీ, పంటలు దెబ్బతింటూ పాడవుతున్నాయనీ, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయనీ జనాలు అనుభవపూర్వకంగా చెపుతున్నారు. కాబట్టి వారు కొత్తగా గనుల తవ్వకాలకు ససేమిరా అంటున్నారు. వారు అరెస్టులకు జడుసుకోవడం లేదు. లాఠీలకు తూటాలకు వెరవడం లేదు. హత్యలకు అత్యాచారాలకు అలవాటు పడుతున్నారు. వారు హస్‌దేవ్ అరణ్య బచావ్ సంఘర్ష సమితి (హస్‌దేవ్ అడవుల సంరక్షణ పోరాట సమితి)ని ఏర్పర్చుకున్నారు. ఆ పోరాట సంస్థ నాయకులు చాలా స్పష్టంగానే ప్రభుత్వం తవ్వకాల కంపెనీలతో చేతులు కలిపి మా వినాశనాన్ని కోరుకుంటున్నదనీ బాహాటంగానే తెలుపుతున్నారు. మన దేశంలోని పోరాట ప్రజలు మొదట "జాన్ దేయింగే లేకిన్ జమీన్ నహీం దేయింగే" అని నినదిస్తూ భూములతో ముడిపడిన తమ జీవితాలను ఆ భూముల కోసం అవసరమైతే ఫణంగా పెడుతామన్నారు. ఆ తరువాత చైతన్యవంతులవుతున్న శక్తులు మానవ హక్కులు, అందులో జీవించే హక్కు ప్రాధాన్యతను గుర్తించిన వారు తమ రాంచీ డిక్లరేషన్ కవర్

పేజీపైనే " న జాన్ దేయింగే, న జమీన్ దేయింగే" అంటూ తమకు భూములు, జీవితాలు రెండూ ప్రాణప్రదమేనని నినదించారు. కాగా, నేటి తరం కొత్త పోరాట ఉత్సాహాన్ని, జీవితమే యుద్ధంగా, గెలుపే లక్ష్యంగా, "హం లడేంగే, హం జీతేంగే" అంటున్నారు. మా అడవులను, మా సంస్కృతిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు వాటిని అప్పగించడం మా విధి అంటున్నారు. అంతే కాదు, భారత రాజ్యాంగంపై నమ్మకం, విశ్వాసం వున్న వారు, సంవేదనాభరితమైన భారతీయులు తమ పోరాటానికి సంఘీభావాన్ని అందించాలని వారు కోరుతున్నారు.

హస్‌దేవ్ అడవులలోని ఆదివాసులు రాష్ట్రానికి దక్షిణాన పోరాడుతున్న మూలవాసులతో మమేకం అవుతున్నారు. "బస్తర్ మే నరసంహార్ బంద్ కరో", "పోలీసు క్యాంపులను ఎత్తివేయాలి" అని మార్చ్ 24 నాడు హస్‌దేవ్ అడవులలోని మూలవాసులు సహ రాష్ట్రంలోని వేలాది మూలవాసులు రాజధాని రాయపుర్‌కు తరలి వెళ్లారు. వారిని రహదారులలోనే బారికేడ్లు నిర్మించి పోలీసులు నిలిపివేశారు. ఆ తరువాత తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఓ కొత్త సుగ్రీవాజ్ఞను రూపొందించి ప్రభుత్వ అనుమతిలేని ధర్నాలను, ర్యాలీలను నిషేధించింది. ఆ నిషేధాన్ని ఇటీవలే మే 15-17 మధ్య సిలింగేర్ ప్రజా ధర్నా వార్షిక దీక్షా వేడుకలు తీవ్రంగా ఖండించాయి. ఆ క్రమంలోనే ఢిల్లీ జెఎన్యూలో మార్చ్ 31 నాడు డీ.ఎస్.యూ., ఏ.ఐ.ఎస్.ఏ., బీ.ఏ.ఎస్.ఓ., సీ.ఎఫ్.ఐ., కలెక్టివ్, సీ.టీ.ఎఫ్., ఐ.ఎం.కే., యం.ఏ.ఎస్., ఎన్.సీ.హెచ్.ఆర్.ఓ., వీ.సీ.ఎఫ్., బీఎస్-సీఈఎం లు కలసి సంయుక్తంగా ఏర్పర్చుకున్న "కార్పొరేటీకరణ, సైనికీకరణ వ్యతిరేక వేదిక" జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కీ లడాయి జిందాబాద్ నినాద కేంద్రంగా నిర్వహించిన "దేశ్ కీ ఆదివాసీ హూంకార్" ర్యాలీలో ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, పశ్చిం బంగా తదితర మూలవాసీ ఉద్యమ ప్రాంతాల నాయకత్వం పాల్గొని తమ సమైక్యతను చాటారు. మన దేశంలో ఢిల్లీ విద్యార్థులు ఈ రకమైన సభ, ప్రెస్‌మీట్‌ను జరపడం బహుశా ఇదే తొలి అనుభవం కావచ్చు. దానికి అనేక మంది ప్రజాహిత స్వతంత్ర పాత్రికేయులు, ఆదివాసీ హితైషి హిమాంశుకుమార్ సహా పలువురు సామాజిక కార్యకర్తలు హాజరవ్వడం విశేషం. ఆ తరువాత ఏప్రిల్ 3 నాడు పాత్రికేయులు రూపేశ్ కుమార్ సింగ్ కన్వీనర్‌గా ఝార్ఖండ్ జన్ సంఘర్ష మోర్చా ఆదివాసీలపై, సామాజిక కార్యకర్తలపై, పాత్రికేయులపై పెరుగుతున్న రాజ్యహింస మరియు పోలీసుల బర్బరత్వంకు వ్యతిరేకంగా బహిరంగ చర్చను నిర్వహించారు.

మూలవాసీ ప్రజల నిరంతర సాహసిక సమరశీల పోరాటాలతో బెంబేలు పడుతున్న పాలకులు ప్రయోగాత్మకంగా నిరుడు, తిరిగి ఈ యేడు సుక్మా-బీజాపుర్ జిల్లాల సరిహద్దులలోని మూలవాసీ జనావాసాలపై డ్రోన్ దాడులకు పాల్పడ్డారు. ఏకకాలంలో 50కి పైగా డ్రోన్‌లు, 70-80 శక్తిమంతమైన బాంబులను అడవులలో, జనావాసాలలో వేశారు. ఈ హంతకదాడిని చినబోడికల్ గ్రామ సమీపాన 18 వేలకు పైగా మూలవాసీ ప్రజా గొంతుకలు ముక్త కంఠంతో ఖండించాయి. మాపై వాయుసేన దాడులు వద్దంటూ, వాటిని ఆపండంటూ పోలీసులను, అధికారులను కోరాయి. ఇప్పటివరకు సాధారణ పోలీసు కమాండోలను ప్రతిఘటించిన మూలవాసీ ప్రజలు ఇక ఇపుడు కొత్త ప్రతిఘటనా పోరాటాలకు సిద్ధమయ్యేలాగా పాలకులు అనివార్యం చేస్తున్నారు. జీవితమే యుద్ధమైన చోట దాడి కింది నుండి జరిగినా రేపటి వాయు దాడులకు సైతం సిద్ధం కావలసిందేనని వారికి జీవితమే నేర్పుతోంది. తెలంగాణలో పోడుభూముల పోరాటాలు జరుపుతున్న ఆదివాసీ రైతాంగం ఈ అన్ని పోరాటాలకు తన సంఘీభావాన్ని తెలుపడం వారి పోరాట సమైక్యతను చాటుతోంది.

దేశవ్యాపితంగా వివిధ సమస్యలపై పోరాట బావుటాను ఎగురవేస్తున్న మూలవాసీ సంస్థలు, శక్తులు, వారితో పాటు అనేక ప్రజాపోరాట సంస్థలు, రైతు సంఘాలు, హక్కుల సంఘాలు, కార్యకర్తలు, సామాజిక రాజకీయ కార్యకర్తలు మే 15-17 సిలింగేర్ ప్రజాధర్నా యేడాది దీక్షాదినంలో పాల్గొన్నారు. వారు నూతన పోరాటాలకు వ్యూహాలు రూపొందించుకున్నారు. హస్‌దేవ్ అడవులలో అస్తిత్వం కోసం పోరాడుతున్న పీడిత ప్రజల పోరాటానికి అండగా 15 రాష్ట్రాల నుండి ఛత్తీస్‌ఘడ్‌లోని కాంకేర్ జిల్లా చేరుకున్న ప్రతినిధులు సమావేశమై వివిధ సంఘీభావ కార్యక్రమాలను రూపొందించుకున్నారు. అడవులను, మూలవాసులను బలిగొంటున్న కార్పొరేటీకరణ, సైనికీకరణకు వ్యతిరేకంగా దేశం నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు. వారితో మనం నడుద్దాం. దేశాన్ని కాపాడుకుందాం.

(22వ పేజీ తర్వాత)

నవాల్ చేసినా అపీల్ చేయడమే ఉత్తమమని నిర్ణయించుకున్నాను."

క్రైమ్. నెం.5/2006 ఏటిఎస్. పోలీస్ స్టేషన్, ముంబైలో మోకా (ఎంసిఓసిఏ) యుఏపిఎ, ఐపిసి, ఎక్స్‌ప్లోజివ్ చట్టం కింద ఇఎస్ఏ కింద, రైల్వే యాక్ట్ సెక్షన్స్, పాస్ పోర్ట్ చట్టం కింద పెట్టారు. క్రిం. నెం. 5/2006ను ప్రత్యేకించి స్పెషల్ కేసు నెం. 21/2006 కింద, సాధారణంగా ముంబై రైల్వే సీరియల్ బాంబ్ బ్లాస్ట్ కేసు 7/2011 (సెషన్స్‌కు కమిట్ అయిన తేదీ) పిలిచారు.

ఇందులో స్పెషల్ కోర్టు విచారణ తర్వాత ఐదుగురికి ఉరిశిక్షలు, ఏడుగురికి జీవిత ఖైదు విధించింది. ఒక్క వాహిద్ షేక్ మాత్రమే 9 సంవత్సరాల తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. వీరిలో మహమ్మద్ ఫైజల్ లతీపుర్ రహ్మాన్ షేక్, ఆసిఫ్ ఖాన్ బషీర్ ఖాన్ అనే ఇద్దరు ఎరవాడ సెంట్రల్ ప్రిజన్, పూనేలో ఉన్నారు. మిగతా ముగ్గురు ఎతెషామ్ ఖుల్ బుద్దీన్, సిద్దికీ, కమాల్ అహ్మద్ షేక్, నవేద్ అహ్మద్ నాగపూర్ జైల్లో ఉన్నారు. మిగతా జీవిత ఖైదు పడిన ఏడుగురిలో తన్వీర్ అహ్మద్ మహమ్మద్, ఇబ్రాహీం, షేక్ మహమ్మద్ అలీషేక్, సుహేల్ మహమ్మద్ షేక్, జమీర్ అహ్మద్ లతీపుర్ రహ్మాన్ షేక్ అమరావతి (మహారాష్ట్ర) జైల్లో షేక్ మహమ్మద్ ముజమ్మల్ అహ్మద్ షేక్ నాసిక్ జైల్లో మరొకరు షేక్ మహమ్మద్ అలీ ఆలంషేక్ థానే జైల్లో ఉన్నారు. ఈ పన్నెండు మంది 2006 జూన్-అక్టోబర్ మధ్యలో అరెస్టయి ఆసిఫ్ ఖాన్ వంటి వాళ్లను మాలేగాంవ్ పేలుళ్ల కేసులో కూడ చూపి అందులో బెయిల్ వచ్చి, ఆ తర్వాత నిర్దోషిగా ప్రకటించినా గత 13 సంవత్సరాలుగా కఠిన నిర్బంధంలోనే ఉన్నారు. వీరిలో ఆసిఫ్ ఖాన్ సహా 10 మందిని సిమి సభ్యులుగా కూడ చూపుతూ ఆ సంస్థ పై నిషేధం ప్రతి సంవత్సరం పొడిగిస్తున్నారు. కనుక అందులో కూడ దోషులుగా చూపుతున్నారు. మాలేగాంవ్ పేలుళ్ల సందర్భంగా హిందుత్వ టెర్రరిస్టులు కూడ అరెస్టయ్యాక ఈ పన్నెండు మందికి బొంబాయి బ్లాస్ట్‌తో సంబంధం లేని ఐబి, సిబిఐ భావించి ఆమేరకు అఫిడవిట్ వేసినా అదిగణనలోకి తీసుకోలేదు.

(ఫ్రంట్‌లైన్ సౌజన్యంతో)

వ్యాసం

యెమన్ ఒంటరిగా లేదని నినదిద్దాం

జహంగీర్

24 ఫిబ్రవరి నాడు రష్యా వుక్రెయిన్ పై దాడి ప్రారంభించింది. వుక్రెయిన్ ప్రతిఘటిస్తోంది. యుద్ధం యేదైనా వినాశకరమైనదే కాబట్టి అన్ని రకాల విధ్వంసం జరిగిపోతున్నది. నగరాలు, మహా నగరాలు నేలమట్టమువుతున్నాయి. అపార జననష్టం జరిగిపోతున్నది. వెల కట్టలేని సంపదలు సర్వనాశనమవుతున్నాయి. ఆకలి దప్పులకు అలమటిస్తూ లక్షల సంఖ్యలో ప్రజలు శరణార్ధులవుతున్నారు. ప్రచార, ప్రసార సాధనాలలో భయంకర దృశ్యాలు గోచరిస్తున్నాయి. ఈ మహాదాపత్కాలంలో వుక్రెయిన్‌కు ఎంతో సానుభూతి, అనేక రకాల అండదండలు, సహాయ సహకారాలు అందుతున్నాయి. దాతలు అందచేస్తున్నదెంతో కానీ మొత్తంగా వుక్రెయిన్‌ను యుద్ధానికి అన్ని రకాలుగా సిద్ధం చేసిన అమెరికా, నాటో కూటమి నుండే అధికాధికంగా సహాయం అందుతుంది అనడం యెంత మాత్రం తప్పు కాదు. వారి సహాయం చావులకు చరమగీతం పాడడానికి కాకుండా, యుద్ధాన్ని ఎగదోస్తూ యిబ్బడిముబ్బడిగా మారణాయుధాలను సమకూరుస్తూ యింకా అనేకానేక చావులకు స్వాగతం పలికే సహాయమన్నది మరచిపోకూడదు. వుక్రెయిన్ పట్ల వ్యక్తమవుతున్న సానుభూతిలో శక్తివంతమైన సామ్రాజ్యవాద మీడియా పాత్రదే సింహభాగం అనేది కూడా కాదనలేని వాస్తవం. నేడు వుక్రెయిన్‌కు వెన్నుదన్నుగా నిలిచిన అమెరికా, పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు రష్యా ప్రజలను ఆంక్షలతో హతమారుస్తున్నాయి. స్వయంకృత అపరాధ యుద్ధంలో నిండా మునిగిన వుక్రెయిన్ సహజంగానే తన ఎగుమతులన్నీ నిలిపివేయక తప్పలేదు. ఈ వినాశకర యుద్ధం ఎన్ని రోజులు సాగుతుందో తెలియని అయోమయ పరిస్థితులలో తన సైన్యాలకు కావలసిన సరుకులను నిల్వ చేసుకుంటున్నది.

మరోవైపు దేశరక్షణ పేరుతో యుద్ధానికి దిగిన సామ్రాజ్యవాద రష్యా అమెరికాతోపాటు నాటో కూటమికి లొంగేది లేదని వుక్రెయిన్ అంతు చూడడానికి నిశ్చయించుకున్నందున తన ఎగుమతులను అదీ దాచిపెట్టుకొంటోంది. పైగా దానిపై అత్యంత కఠినతరమైన ఆంక్షలు అమలువుతున్నందున దాని అన్ని రకాల యితర అవసరాలను తీర్చుకోవడానికి భారత్ లాంటి వివిధ దేశాలతో తనకు గల అనేక పీటముడి ఒప్పందాల ద్వార మాత్రం సిద్ధపడుతోంది. ఆంక్షల మధ్య తన యుద్ధ అవసరాలను పరిపూర్తి చేసుకోవడానికి ఆ సరుకులను అది గోప్యంగా, భాజాపా అందిస్తోంది. మన భారతదేశానికి మార్చి నెలలో గతం కన్నా అధికంగా దిగుమతులయ్యాయని అధికారికంగానే తెలుపుతున్నారు. భారత్‌ను అనడానికి అమెరికా కూడ దూకుడు చూపడం లేదు. అది దాని మజ్బూరీ. రష్యా అణ్వాయుధాలు గల దేశం. దానికి వీటో అధికారాలున్నవి. కాబట్టి దానిపై ఆంక్షలు ఎంత అమలు చేయగలుగుతారనేది బహిరంగ రహస్యమే. ఏది ఏమైనా ఆవులావులు కుమ్ములాడుకుంటూ లేగల కాళ్లు విరగగొట్టినట్టుంది వర్తమాన స్థితి. ఇదే సామ్రాజ్యవాద నైజం. నేడు వుక్రెయిన్‌ను ముందు పెట్టి సామ్రాజ్యవాదులు యుద్ధ క్రీడలు కొనసాగిస్తున్నారు. ఆ క్రీడలకు మరోవైపున యేం జరుగుతుందో చెప్పడానికే యెమన్ గురించి మనం ఇపుడు తెలుసుకోవలసిన అవసరం వుంది.

యెమన్ వుక్రెయిన్ లాంటి దేశమసలే కాదు. అదొక పీడిత దేశం. అది పేద దేశం. అక్కడి పాలక వర్గాల మధ్య కుమ్ములాటలతో సామ్రాజ్యవాద యుద్ధ రాజకీయాలకు గత 8 యేండ్లుగా బలవుతున్న దేశం అది. ఒక పీడిత దేశానికి, మరో సంపన్న దేశానికి మధ్య ఏ విషయంలోనైనా ఎలాంటి తేడా వుంటుందో సామ్రాజ్యవాద అండదండలందుతున్న వుక్రయిన్‌తో పోల్చకుంటే సరిపోతుంది. సౌదీ అరేబియా, యూనైటెడ్ అరబ్ యెమిరేట్స్ సంయుక్తంగా ఎనిమిదేళ్లుగా యెమన్‌పై యుద్ధం కొనసాగిస్తున్నాయి. వాటికి కావలసినన్ని ఆయుధాలను, యుద్ధ విమానాలను ప్రపంచ ప్రజల నంబర్ వన్

శత్రువు సామ్రాజ్యవాది అమెరికా సమకూరుస్తున్నది. యెమెన్ ప్రజల ప్రాణాలను బలిగొంటూ యూఎస్ మిలిటరీ కాంప్లెక్స్ బిలియన్‌ల కొద్ది డాలర్లు కొల్లగొడుతున్నది. ప్రజలు ఆకలి చావులతో అలమటిస్తున్నారు. వారికి తన జేబు సంస్థ ఐక్యరాజ్యసమితి ద్వారా సహాయాన్ని (నిజానికి అది బిచ్చమే) అందిస్తూ అన్నదాత ఫోజు కొడుతున్నది. యిపుడు వుక్రెయిన్ ప్రజలకు ఎంత మద్దతు అవసరం వుందో యెమన్ ప్రజలకూ అంతే. తన మాట వినని రష్యన్ ప్రజలపై అది, దాని సహ సామ్రాజ్యవాదులు కఠినతరమైన ఆంక్షలు విధించి వారి జీవితాలను కడతేరుస్తున్నారు. మరోవైపు సామ్రాజ్యవాది రష్యాపై అది ఆంక్షలు విధించడంతో కౌంటర్‌గా రష్యా చమురు, గోధుమలు తదితరాల ఎగుమతులను నిలిపివేయడంతో గ్లోబల్ క్రైసెస్ తీవ్రతరమవుతోంది. ఇవీ సామ్రాజ్యవాదుల యుద్ధ క్రీడలతో విశ్వవ్యాపిత ప్రజలు ఎదుర్కొంటున్న తీరని సమస్యలు.

యెమన్‌లో 2021 చివరి వరకు 3 లక్షల 77 వేల మంది చనిపోయారు. ఆ దేశానికి యూ.ఎన్.ఓ. అందివ్వాల్సిన 4.2 బిలియన్ డాలర్ల సహాయంలో 1.4 బిలియన్ల డాలర్ల సహాయం అంటే కనీసం నాల్గవ వంతైన సామ్రాజ్యవాద గజదొంగలు అందివ్వలేదు. దీనిపై నార్వే శరణార్థుల కౌన్సిల్ జనరల్ సెక్రటరి జాన్ యేజ్ లాండ్ మొసలి కన్నీరు కారుస్తూ 'నేను చాలా నిరాశచెందాను' అన్నాడు. వుక్రెయిన్‌కు ఎంత సహాయం అవసరం వుందో వీరికీ అంతే అవసరం వుంది అన్నాడు. కానీ వర్తమాన యుద్ధంతో యూరప్ సంక్షోభంలో పడడంతో అప్పటికే సంక్షోభం ఎదుర్కొంటున్న యెమన్ ఆహార ధాన్యాలు, ఇంధనం కొరతలు పెరగడంతో వారి పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడిన చందంగా అయింది అని కూడ అంటున్నాడు. ఎనిమిదేళ్లుగా ఆంక్షలున్న చోట పరిస్థితులు ఎంత భయంకరంగా వుంటాయో ఊహించుకోవచ్చు. వాళ్లు రిలీఫ్ గ్రూపులు అందించే దానధర్మాలపై బతుకాల్సిన దుస్థితిలో జీవచ్ఛవాల్లా జీవించక తప్పడం లేదు. 20 యేళ్లు అమెరికా యుద్ధభారాన్ని అనుభవించిన అఫ్ఘనిస్తాన్‌లో అక్కడక్కడ ప్రజలు మూత్రపిండాలను అమ్ముకొని పొట్ట పోసుకుంటున్న కథనాలు గత కొన్నేళ్లుగా వెలుగు చూస్తున్నాయి. యిదీ అమెరికా పుణ్యమే.

యెమన్‌కు వుక్రెయిన్, రష్యాల నుండి 35 శాతం గోధుమలు దిగుమతవుతున్నాయి. యిక ప్రపంచమంతా యిపుడు ఆ యుద్ధంతో అధిక ధరల సంక్షోభంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నది. దానితో యిపుడు వాటి రేట్లు అనేక రెట్లు పెరుగుతున్నాయి. ఈ భారం యెమన్ ప్రజలకూ తప్పదు. యెమన్‌లోని యింటర్నేషనల్ రెడ్ క్రాస్ అధికార ప్రతినిధి బషీర్ అల్ సెల్వి వుక్రెయిన్ యుద్ధం మొదలైన తరువాత ఆహార ధాన్యాల ధరలు 150 శాతం పెరిగాయన్నాడు. మరో పూటకు తిండి దొరకడం ఎలాగో తెలువని అయోమయ పరిస్థితులలో అక్కడి ప్రజలున్నారంటున్నాడు. దీనికి పూర్తిగా అమెరికాదే బాధ్యత. అమెరికా తన ఆయుధ వ్యాపారంతో సౌదీ అరేబియాకు, యునైటెడ్ ఎమిరేట్స్‌కు విమానాలు అందివ్వకపోతే అక్కడ ప్రజల మీద ఆకాశదాడులు జరిగే అవకాశమే లేదు. నిజమైన యుద్ధ నేరగాడు, హంతకుడు అక్కడ అమెరికా వాడే. అక్కడ యుద్ధం చేస్తున్న అరబ్ యెమిరేట్స్‌ను ఖండించకుండా దానితో ఆలింగనాలు చేసుకుంటున్నది. యెమన్ పట్ల అమెరికా విధానం యిది. యిక్కడ దానికి యుద్ధం కావాలి.

యిపుడు రష్యాపై అది అమలు చేస్తున్న కఠినతరమైన ఆంక్షల అమలుతో అమెరికా సహ అనేక దేశాలలో నిజానికి విశ్వవ్యాప్తంగానే అనుకోవచ్చు ఇంధన సంక్షోభం వుత్పన్నమైంది. దీనితో అమెరికా తన దేశం కోసం ప్రత్యామ్నాయాలు వెతుకుతూ తన తోటి యుద్ధ నేరగాళ్లయిన సౌదీ అరేబియా, అరబ్ యెమిరేట్స్ నుండి యింధన దిగుమతులకు దిగుతోంది. లేకుంటే మీ దాడులకు నా సహాయముండదని చేయి మెలిపెట్టే ఎత్తుగడలకు దిగడం దాని క్రూర నైజమే. ప్రపంచవ్యాపితంగా అనేక దేశాలు ఎదుర్కొన్న అనుభవమే యిది.

యిక యెమన్‌లో దాడులంటే గత ఎనిమిదేళ్లుగా నిర్విచక్షణగానే జరుగుతున్నాయి. పౌర నివాస కేంద్రాలను సైతం ఎంతమాత్రం మినహాయించడమే లేదు. రోడ్లపైన, కూడళ్లలో, పెళ్లిళ్లు, చావులనేవి కూడ చూడడం లేదు. చిన్నారి పిల్లల బడి బస్సులపైన కూడ బాంబులు కురుస్తున్నాయి. 18 మార్చ్ నాడు సౌదీ అరేబియా 81 మందిని సామూహికంగా వురి తీసింది. వారిలో ఏడుగురు మాత్రం యెమన్ వాళ్లు, యిద్దరు యుద్ధ ఖైదీలు. మరో అయిదుగురు యెమన్‌పై సౌదీ యుద్ధాన్ని విమర్శించిన పాపానికి వురి కంభమెక్కక తప్పలేదు. యెమన్‌పై అనేక రూపాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తున్న భాగస్వాములలో కొందరు ఈ సామూహిక వురిశిక్షల వెంటనే రెండు రోజులకు రియాద్‌లో సౌదీ శాంతి చర్చలకు ఆతిథ్యం యివ్వనున్నదని అందుకు యెమన్‌లోని హౌతీలు రావాలని తెలిపాయి. అయితే ఎంతసేపూ హౌతీలు ఆయుధాలు వదలాలనేదే చర్చ జరుగుతుంది తప్ప సౌదీ అరబ్, అరబ్ యెమిరేట్స్ ఆయుధాలు సమకూరుస్తూ యుద్ధానికి వుసిగొలుపుతున్న యితర అనేక గ్రూపుల గురించి పల్లెత్తు మాట అనడం లేదెవరు. హౌతీలు మాత్రం చర్చలకు సిద్ధమే కానీ సౌదీ మీద మాకు నమ్మకం లేదని, చర్చల ప్రస్తావన చేస్తున్న వారి మీదా విశ్వాసం లేదని న్యాయంగానే అంటున్నారు.

నిజానికి అమెరికా ప్రజలు అక్కడి ప్రభుత్వాన్ని తక్షణం అన్ని యుద్ధాలను నిలిపివేయాలనీ, మానవ హక్కులను గౌరవించాలనీ బాధ్యతాయుతంగా కోరాలి. ఎందుకంటే సామ్రాజ్యవాదుల దోపిడీలో వారూ ఏదో ఒక రూపంలో దానికి ఎంతో కొంత తోడ్పడుతూ భాగస్థులుగానే ప్రపంచం ముందు మిగులుతున్నారు. వారి పిల్లలు లక్షల సంఖ్యలో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేరుస్తున్న సైనికులుగా వివిధ దేశాల భూభాగాలలో అక్కడి ప్రజలకు శత్రువులుగా యుద్ధరంగంలో నిలబడి వున్నారు. వారికి అనుబంధంగా వివిధ సేవలందిస్తూ అంతకు రెట్టింపు సంఖ్యలో మరెంతో మంది వున్నారు. యుద్ధానికి చేరుతున్న భారీ ఆయుధాలు, మరఫిరంగులు, విమానాలు, ఆధునిక డ్రోన్లు యింకా, యింకా అమెరికా యుద్ధఆర్థికవ్యవస్థలో భాగమవుతున్న కోట్లాది శ్రమజీవులు, కార్మికవర్గం గంభీరంగా ఆలోచించాల్సిన తరుణమిది. అమెరికా సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్య వ్యూహాన్ని ఓడించడంలో అక్కడి కార్మిక వర్గం అగ్రభాగాన వుండాలి. యిదే సోదరదేశాల కార్మికుల పట్ల అమెరికా కార్మికవర్గ కర్తవ్యం. అమెరికానే కాదు అన్ని దేశాలలోని కార్మికవర్గం, ప్రధానంగా తక్షణం సామ్రాజ్యవాద దేశాల కార్మికవర్గం మాత్రం ప్రపంచాన్ని వినాశనం వైపు నెడుతున్న అన్ని రకాల యుద్ధాలను నిలవరించడానికి నిజమైన శాంతిని నెలకొల్పడానికి వారి యుద్ధ చర్యలన్నీ నిర్ద్వంద్వంగా ఖండిస్తూ వారిని ఆయుధాల వ్యాపారాన్ని అన్ని రకాలుగా అడ్డుకుంటూ వారి ఓటమిని అనివార్యం చేసే పోరాటాలకు సిద్ధం కావలసిన తరుణమిదే.

పాలకులెవరైనా అదే ద్రోహం

తథాగత

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్రంలో ఉన్న నిరంకుశ బీజేపీ ప్రభుత్వానికి బలమైన ప్రతిపక్ష నాయకురాలిగా ఇటీవలి కాలంలో గుర్తింపు పొందారు. కానీ ప్రజల్ని అణిచివేసే విషయంలో తాను ఏ మాత్రం తక్కువ తినలేదని అక్కడ నమోదవుతున్న దేశద్రోహం, యుఎపిఎ కేసులు చెబుతున్నాయి. ప్రజాచైతన్యం తప్ప ఏ ప్రతిపక్షమూ దేశాన్ని కాపాడలేదనడానికి అక్కడి పరిణామాలు తాజా ఉదాహరణ. బెంగాల్ నుండి తథాగత రాసిన వ్యాసం అనువాదం అరుణతార పాఠకుల కోసం.

చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాటలతో గానీ, రాతలతో గానీ, సైగలతో కానీ, దృశ్య మాధ్యమం ద్వారా గానీ ప్రజల్లో అసంతృప్తిని, విద్వేషాన్ని, ధిక్కారాన్ని ప్రేరేపించేవారు 'రాజద్రోహి'గా పరిగణించబడతారు. బ్రిటీషర్లు 1860లో ఈ చట్టాన్ని రూపొందించారు. అయితే 1947లో అధికార బదిలీ జరిగి, 75 సంవత్సరాలు గడచిన తర్వాత కూడా ఆ చట్టం అలాగే ఉంది. ఈ దేశ ప్రజల ప్రజాస్వామిక హక్కులను, ప్రత్యేకించి వారి భావప్రకటనా స్వేచ్ఛను హరించడమే బ్రిటీషర్ల ఉద్దేశం. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో గడచిన ఏడాది కాలంలో అరెస్టయిన వారిని పరిశీలిస్తే, నేడు అధికారంలో ఉన్నవారిలో కూడా అదే ఉద్దేశ్యం ఉందని స్పష్టంగా అర్థమవుతుంది.

2021 అక్టోబరు 12న, టిప్పు సుల్తాన్‌ను ఇంటి నుండి అరెస్టు చేశారు. రెండు రోజుల అక్రమ నిర్బంధం తర్వాత, పోలీసులు అతని పేరును బెల్పహరి పోలీస్ స్టేషన్ పరిధిలో 2016 నాటి యుఎపిఎ (ఊపా) కేసుకు జోడించారు. అతను ఆర్ఎస్ఎఫ్ (ప్రస్తుత యుడిఎస్ఎఫ్) పూర్వ సభ్యుడు, క్రిషక్ ఎకోటా మంచ్ సభ్యుడు.

2022 మార్చి 23న, ముర్షిదాబాద్‌లోని నౌడా పోలీసులు శ్రమిక్ -క్రిషక్ ఎకోటా మంచ్‌కు చెందిన ఇద్దరు కార్యకర్తలు, ప్రతీక్ భౌమిక్ (ఆర్ఎస్ఎఫ్ పూర్వ సభ్యుడు), హసిబుర్ షేక్‌లను ఆయుధాల చట్టం కింద తప్పుడు కేసులో అరెస్టు చేశారు. మార్చి 29న, కోల్‌కతా పోలీసుల స్పెషల్ టాస్క్ ఫోర్స్ జోయితా దాస్ (ఆర్ఎస్ఎఫ్, మాతంగిని మహిళా సమితి పూర్వ సభ్యురాలు)ని జగులియా నుండి అరెస్టు చేసింది. నందిగ్రామ్‌లో సెజ్ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలను సమీకరించడంలోనూ, మొత్తం మీద సిపిఐ(ఎం) తీవ్ర సామాజిక-ఫాసిస్ట్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమాలలో జోయిత గణనీయమైన పాత్ర పోషించారు. 2011లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, నోనడంగాలో మురికివాడల నిర్వాసితుల తొలగింపు వ్యతిరేక ఉద్యమం, కమ్దునిలో సామూహిక అత్యాచారానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్వహించడంలో జోయితా కీలక పాత్ర పోషించారు.

ఏప్రిల్ 24న టిప్పు సుల్తాన్‌ను మళ్లీ బోల్పూర్‌లో ఇంటి నుంచి అరెస్టు చేసి, బంకురాలోని బారికుల్‌కు లాక్కెళ్ళారు. ఇదే కేసులో టిప్పుతో పాటు బుర్ద్వాన్ మెడికల్ కాలేజీలో ఇంటర్న్ డాక్టర్ అర్కదీప్ గోస్వామిని కూడా అరెస్ట్ చేశారు. మే 9 మధ్యాహ్నం, బోన్‌హూగ్లీలోని ఒక ఫ్యాక్టరీలో తన తండ్రికి ఆహారాన్నివ్వడానికి వెళ్ళిన, దీర్ఘకాల సామాజిక కార్యకర్త, సిఆర్‌పిపి (పిబిడబ్ల్యూ) సభ్యుడు సంజీవ్ మజుందార్‌ను చట్టవిరుద్ధంగా కిడ్నాప్ చేసి, టిప్పు, అర్కాలు వున్న కేసులో అరెస్టు చూపించారు.

అరెస్టుల జాబితా రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒక నివేదికలో పేర్కొన్నట్లుగా 2010 నుండి 11,000 మందికి పైగా భారతీయులు దేశద్రోహ ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీటిలో 65 శాతం కేసులు భారతీయ జనతా పార్టీ 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి నమోదయ్యాయి. ప్రతిపక్ష రాజకీయ నాయకులు, విద్యార్థులు, పాత్రికేయులు, రచయితలు, విద్యావేత్తలను తరచూ దేశద్రోహ కేసుల్లో పెడుతున్నారు. దీర్ఘకాలంగా ఉన్న దేశద్రోహం కేసులతో పాటు, యుఎపిఎ లాంటి క్రూరమైన చట్టాల కింద కూడా వారిపై అభియోగాలు మోపుతున్నారు.

2014-2019 సంవత్సరాల మధ్య, భారతదేశంలో 326 దేశద్రోహ కేసులు నమోదయ్యాయి, అయితే వాటిలో 141 కేసులలో మాత్రమే ఛార్జిషీట్లు దాఖలు అయితే, కేవలం ఆరుగురిని మాత్రమే దోషులుగా నిర్ధారించారు. ఎన్ఆర్‌సి-ఎన్‌పిఆర్-సిఎఎ వ్యతిరేక ఉద్యమ సమయంలో, ప్రభుత్వం 3754 మందిపై 25 దేశద్రోహ కేసులను నమోదు చేసింది. వీరిలో 96 మందిని మాత్రమే గుర్తించారు, మిగిలిన వారు 'గుర్తు తెలియనివారు'. ఆ 25 కేసుల్లో 22 బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. 2018లో, జార్ఖండ్‌లో పథల్‌గడి ఉద్యమ సందర్భంగా వందలాది మంది ఆదివాసీ కార్యకర్తలను దేశద్రోహానికి పాల్పడ్డారని ఆరోపించారు.

పశ్చిమ బెంగాల్‌లో జోయితా, ప్రతీక్, హసిబుర్, సంజీవ్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పౌరసమాజం ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తోంది. రాజకీయ కార్యకర్తలను అరెస్టు చేస్తే ఖైదీల విడుదల కోసం ఉద్యమించడం సర్వసాధారణం. కానీ ఇప్పటికీ ఉన్న ప్రశ్న ఏమిటంటే - బెంగాల్‌లోని తృణమూల్ ప్రభుత్వం కొన్ని సంస్థల సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఎందుకు దాడులు చేస్తోంది? మమతా బెనర్జీ ప్రభుత్వంలో పోలీసుల బలగాలు ఉన్నాయి, కిరాయి జులాయి సిబ్బంది ఉన్నారు, మీడియా ఆమెను నిరంతరం ప్రశంసలతో ముంచెత్తుతుంది. మరి, ప్రతీక్, జోయిత, తదితరులను ఎందుకని జైల్లో ఉంచారు?

ఎందుకంటే వారి గొంతులను అణచివేయడానికి, వారి ప్రతిఘటనను చల్లార్చడానికి వేరే మార్గం లేదు కాబట్టి. బెంగాల్‌లోని ఈ అద్భుత పిల్లలను జైలులో ఉంచడం ద్వారా లేదా బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేయడం ద్వారా మాత్రమే వారిని ప్రజల నుండి వేరుచేయవచ్చు. ఎప్పుడైతే ప్రజల మధ్య ఉంటూ వారితో కలిసిపోయారో

(మిగితాది 50వ పేజీలో...)

గత సంచిక తరువాయి..
8వ భాగం

మారుతున్న దోపిడి పీడనలను చిత్రించడం పూర్తి కాలేదు

అల్లం రాజయ్య ఇంటర్వ్యూ

12. నవల విస్తృతిరీత్యా విప్లవోద్యమ రాజకీయ కార్యక్రమాన్ని చిత్రించడానికి అవకాశం ఉంటుందా? మారుతున్న పరిస్థితులన్నిటినీ దృష్టిలో పెట్టుకొని దాన్ని ఎలా రాయవచ్చు?

ఉంటుంది. విప్లవోద్యమ రాజకీయ కార్యక్రమం అంటే వర్గ సమాజంలోని అన్ని స్థలకాలాలల్లో విప్లవోద్యమానికి ఉన్న వ్యూహంలో భాగమైన ఎత్తుగడలు. అనగా వర్గసమాజంలోని అసమానతలను, దోపిడి, హింసలను రూపుమాపడానికి వర్గపోరాటంలో ప్రజలను మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో ప్రణాళికాబద్ధంగా సమీకరించడం, గతితార్కిక చారిత్రిక పద్ధతిలో ఎప్పటికప్పుడు మారే సమాజాన్ని అధ్యయనం చేయడం, విశ్లేషించడం. ఒక్కమాటలో చెప్పాలంటే ఉత్పత్తి శక్తుల-ఉత్పత్తి సంబంధాల వైరుధ్యాన్ని ప్రధాన వైరుధ్యంగా పరిష్కరించడం. ఈ క్రమం 1848 నుండి నేటిదాకా - యూరప్‌లోని బూర్జువా విప్లవం, 1871 ఫ్రెంచి విప్లవం, 1917 రష్యా విప్లవం, 1949 చైనా విప్లవం లాంటి విప్లవ పోరాటాల అనుభవం - ఇప్పటిదాకా ప్రపంచ ప్రజల పోరాట నుండి అభివృద్ధి చెందింది.

భారతదేశంలోని విప్లవోద్యమం గురించి, ప్రజాపోరాటాల గురించి విస్తృతంగా, వివరంగా ఇంతకు ముందు ప్రశ్నలకు చెప్పిన జవాబుల్లో చర్చించాము.

భారతదేశంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం - 1857 నుండి అనేక దశల గుండా కొనసాగుతూ దీర్ఘకాలిక సాయుధ పోరాట రూపం తీసుకున్నది. ఇలాంటి విప్లవ పోరాటాలల్లో నుండి భారతీయ భాషల్లో వచ్చిన అనేక నవలలను చర్చించాము. దాదాపుగా దశలను బట్టి, వ్యూహం-ఎత్తుగడలును బట్టి ఎక్కువ భాగం నవలలు కళాత్మకంగా రాజకీయ కార్యక్రమాలను చిత్రించినవే. అవి ఎట్లా ప్రతిఫలించాయో ఇంతకు ముందు వివరంగా మాట్లాడుకున్నాం. ప్రేమ్‌చంద్ 'రంగభూమి', శివశంకర్ తక్కల్ పిళ్లై 'కూలిగింజలు' శివరామకారంత్ 'మరల సేద్యానికి', నిరంజన 'మృత్యుంజయులు', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగుపూలు', ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి', భూషణం 'కొండగాలి', రావిశాస్త్రి 'ఇల్లు', నల్లూరి రుక్మిణి 'నిశిధ', నర్రెంక చెట్టుకింద', 'మేరువు', గూడ అంజయ్య 'పొలిమేర', చెరబండరాజు 'దారిపొడుగునా', 'మాపల్లె', 'ప్రస్థానం', పద్మకుమారి 'పాల్గుణ', నేను రాసిన 'కొలిమంటుకున్నది', సాహుతో కలిసి రాసిన 'కొమురం భీం', 'అగ్నికణం', 'వసంతగీతం', 'సైరన్', తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'నల్లవజ్రం', పి.చంద్ 'శేషగిరి', 'నెత్తుటిధార', 'నల్లమల', 'శృతి', కనుంపల్లి రాజారాం 'ఎదురగ్గి', పాణి 'నిప్పులవాగు', కౌముది 'తరాలపల్లె', బియస్ రాములు 'బతుకుపోరు', కళ్యాణరావు 'అంటరాని వసంతం' వనజ 'భూమిపుత్రిక', సాధన 'సరిహద్దు', 'రాగో' లాంటి నవలలు అనేకం.

వస్తువు ఏమేరకు విప్లవోద్యమాన్ని దాని బహిర్ రూపాలను, సారాంశాన్ని అర్థం చేసుకున్నాయనేది గతితార్కికంగా విప్లవోద్యమ క్రమాన్ని, నవలలను అధ్యయనం చేస్తే తెలుస్తుంది. దాన్ని కూడా విప్లవోద్యమ నవలా క్రమంలో వివరంగా చర్చించాం.

అయితే తగిన శిల్పం, భాష, వాతావరణం, పాత్ర చిత్రణ, తగిన భావోద్వేగాలు లేకుంటే మనం తీసుకున్న విప్లవ రాజకీయ వస్తువుకు న్యాయం చేయలేం. ముఖ్యంగా విప్లవ రాజకీయ వస్తువుతో నవల రాయడమంటే విప్లవం యొక్క పరిమాణాత్మక, గుణాత్మక చలన సూత్రాలను, పైకి కన్పించే సత్యాన్ని మాత్రమే అర్థం చేసుకుంటే సరిపోదు. సారాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. అంటే విప్లవోద్యమంతో మమేకం కాకుండా ఇది సాధ్యం కాదు. అంటే పోరాడుతున్న ప్రజలతో రచయిత ఉండాలి- మన చుట్టూ జరుగుతున్న సంఘటనలలోని ఆంతరంగిక సంబంధాలన్నీ కనుక్కోగలగాలి. రాయాలనే తపన, ఒత్తిడి ఉండాలి.

పరిస్థితులు తెలుసుకోవడం అంటే ప్రపంచాన్ని తెలుసుకోవడం... మాక్సిమ్ గోర్కీ 'అమ్మ', లూషన్, మిస్టర్ ఎహెచ్‌క్యూ చైనా నవలలు 'ఎర్రమందారాలు', 'ఉప్పెన', షోలకోవ్ 'బీళ్లు దున్నేరు' - ఈ నవలలు చదివితే విప్లవోద్యమంలో రాజకీయాలను ఎట్లా సృజనాత్మకంగా చిత్రించవచ్చో అర్థమౌతుంది.

అయితే సాధారణంగా విప్లవోద్యమ రాజకీయ ఘటనల క్రమాన్ని చిత్రించడం -వైయక్తిక దృష్టికోణంలో విప్లవోద్యమ రాజకీయ కార్యక్రమాన్ని అర్థం చేసుకోవడం, సిద్ధాంతాల ఆధారంగా విప్లవోద్యమాన్ని చిత్రించడం వలన విప్లవోద్యమ నవల ఒక రిపోర్టుగా మాత్రమే తయారవుతుంది. విప్లవ నవలా రచన వర్గపోరాటం లాంటిది. క్షేత్రస్థాయిలో పోరాడే సమస్త శక్తులను -అనగా ఉత్పత్తి శక్తులను, ఉత్పత్తి సంబంధాలను -అవి వర్గ పోరాటంలో కదలబారుతున్న స్థితులను తగిన భావోద్వేగాలతో సహా -వాతావరణం, కాలంతో సహా చిత్రించగల్గినపుడు, అందులోని శక్తులందరికీ చెందిన సాహిత్యం రూపొందుతుంది. సమాచారం సాహిత్యం కాదు. సమాచారం రూపొందిన వెనుక జరిగే వర్గపోరాటం సాహిత్యం. నవల కళాత్మక చిత్రకళ లాంటిది. వర్గపోరాటం సృజనాత్మకమైనది.

సాధారణంగా పరిమాణాత్మత పోరాటాలు దీర్ఘకాలం కొనసాగుతాయి. అనేక ప్రాంతాలల్లో, స్థలాలల్లో ఏకకాలంలో కొనసాగుతాయి. మన జ్ఞానేంద్రియాల ద్వారా ఇలాంటి దైనందిన పోరాటాలను గ్రహించగలం. ఇది రచయిత అనుభవంలో చేరుతుంది. పరిమాణాత్మక పోరాటాలు ఒక దశకు చేరుకున్న తరువాత గుణాత్మకంగా మారుతాయి. ఇది సాధారణంగా గతితార్కిక జ్ఞానం, చారిత్రిక జ్ఞానం ఉన్నవారికే అర్థమౌతుంది. అంటే క్షేత్రస్థాయిలో ఈ మార్పుల క్రమాన్ని, లోతును, దశ, దిశలను ఎప్పటికప్పుడు రాజకీయ నాయకత్వంలాగే అర్థం చేసుకోగలిగితేనే మారుతున్న పరిస్థితులను రచయితలు

చిత్రించగలరు. లేకపోతే రచయితలు వెనుకబడిపోతారు. విప్లవోద్యమాల్లో వచ్చిన అనేక పరిణామాలు, సిద్ధాంత పోరాటాలు అధ్యయనం చేస్తే మనకు ఇది అర్థమౌతుంది. ఉదాహరణగా చెప్పాలంటే ఇప్పటికే గ్రామాలల్లో రైతుకూలీ సంఘాలు పెట్టడం, కూలిరేట్ల పోరాటాలు చేయడం, దైనందిన సమస్యల మీద సమ్మెలు చేయడం వరకే చాలా మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు పరిమితమై పదేపదే అవే పోరాటాలే చేపడుతూ యాభై యేండ్లలో అనేక చీలికలకు లోనయ్యాయి. 1985లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ పెల్లుబికిన పరిమాణాత్మక పోరాటాల నుండి స్థావర ప్రాంతాల నిర్మాణం అనే గుణాత్మక మార్పును గమనించి ముందుకు సాగింది. కనుకనే లోగడ పేర్కొన్న తొమ్మిది దశల్లో పురోగమించింది. ఒక్కొక్కసారి గుణాత్మక దశలను అర్థం చేసుకొని సమస్త శక్తులను, ప్రజారాశులను అందుకనుగుణంగా సమీకరించపోతే మళ్లీ పరిమాణాత్మక దశలోనే దీర్ఘకాలం కొనసాగాల్సి వస్తుంది. రాజకీయ సంక్షోభం చీలికలకు దారితీస్తుంది. పునాది కుల, వర్గ, మత, లింగ, ప్రాంతీయ అసమానతలు గల భారతదేశంలో విప్లవోద్యమం ఈ దశల గుండా చేసిన ప్రయాణాన్ని ఎప్పటికప్పుడు సుదీర్ఘంగా, కళాత్మకంగా, సమగ్రంగా చిత్రించే అవకాశం విప్లవ నవలకు వచ్చింది. అయితే అది విప్లవోద్యమం తన అన్ని శక్తులను నిరంతరం విప్లవీకరించినట్లే సాహిత్యాన్ని ఒక ఆయుధంగా వరిగణిస్తేనే సాధ్యమౌతుంది. పోరాటశ్రేణుల నుండి రచయితలు వస్తారు. విప్లవ కార్యకలాపాలన్నింటిలాగే సృజనాత్మక కళ కూడా ప్రజాపోరాటాల సమిష్టి అనుభవం నుండి అధ్యయనం, శిక్షణ ద్వారా పురోగమిస్తుంది.

విప్లవోద్యమ రాజకీయ క్రమాలంటే -వర్గపోరాటంలో తలపడుతున్న ప్రజలు, ప్రజలను దోపిడి చేసే వర్గాల రాజకీయాల మధ్య సంఘర్షణలు. మారుతున్న పరిస్థితులంటే -వర్గపోరాట ఆటుపోటుల మధ్య పురోభివృద్ధి, వర్గపోరాట క్రమంలో అనివార్యంగా ముందుకు వచ్చే వైరుధ్యాలు. ఎప్పటికప్పుడు ఆ వైరుధ్యాలను ఘర్షణ-ఐక్యతతో పరిష్కరిస్తూ ఎత్తుగడలతో వ్యూహంలో భాగంగా పురోగమించడం. ఈ దశలన్నింటిలో తీవ్రమైన భావోద్వేగాలు చెలరేగుతాయి. వ్యక్తులు, సమూహాలు పాత కాలం చెల్లిన భావాలతో తలపడుతాయి. కొత్త అభివృద్ధికరమైన భావాలను స్వీకరించడంలో ప్రజలు ఘర్షణ పడుతారు. నిర్దాక్షిణ్యంగా అధిక సంఖ్యాకులైన పీడిత ప్రజానీకం భావజాలం దోపిడి వర్గాలను కలవరపెడుతుంది. కుళ్లిపోయిన పాత నీతిసూత్రాలు కూలిపోతాయి. వర్గపోరాటం అభివృద్ధి చెందినకొద్దీ దోపిడి రాజకీయాలు కొత్త ఎత్తుగడలతో తప్పనిసరిగా పీడిత ప్రజానీకం భాష, వ్యక్తీకరణతో ముందుకు వస్తాయి. తమ దోపిడి పీడనలను కొత్త రాజకీయ, ఆర్థిక అభివృద్ధి ముసుగులో అమలు చేస్తాయి.

క్షేత్రస్థాయిలో ఇరుపక్షాలను, ముఖ్యంగా శత్రువును శ్రద్ధగా గతితార్కికంగా అధ్యయనం చేయాలి. ఎన్ని రూపాల్లో, తళుకుబెళుకుల భాషలో ఉన్నా కూడా ప్రధానంగా ఉత్పత్తి శక్తుల వృద్ధి కోసం ప్రజలు చేసే పోరాటాలను అడ్డుకొని అణచివేసి మరింత దోపిడి పెంచుతాయి. అన్ని రకాల నిర్బంధాన్ని ప్రయోగిస్తాయి. శాస్త్రీయ ప్రయోగాన్ని రకరకాల భావవాదంతో ప్రజలను దోపిడి చేసిన సొమ్ముతో ఎదుర్కుంటాయి. ఈ సమయం సందర్భం తీవ్రమైన భావోద్వేగాల సమాహారంగా ఉంటుంది. గత యాభై ఏండ్లుగా జరుగుతున్న విప్లవోద్యమం, సామ్రాజ్యవాద పెట్టుబడులతో ప్రజా పోరాటాలను ఎదుర్కోవడానికి బూర్జువా పార్టీలు ఎన్ని జెండాలు మార్చాయో? ఎన్ని ప్రసార మాధ్యమాలను తెచ్చాయో? అధ్యయనం చేయాల్సిన విషయమేంటే.. ఈ మొత్తం కాలంలో విప్లవోద్యమాల్లో పాల్గొంటున్న ప్రజలు ఎప్పటికప్పుడు ఎలా అర్థం చేసుకున్నారు, పురోగమించారు అనేదే. మారుతున్న పరిస్థితుల్లో నవల రాయడం ద్వారా ప్రజానీకంలోకి బలంగా కళాత్మకంగా తీసుకెళ్లగలం. ఎప్పటికప్పుడు విప్లవోద్యమం పురోగమనాన్ని సృజనాత్మకంగా - అంతర్ బహిర్ చలనాలతో సహా అందించగలం. పురోగమనానికి వర్గపోరాట భూమికలో సాహిత్యం కూడా ఆ విధంగా తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించగలదు. అన్ని విప్లవాలల్లో నవల ఇలాంటి మహత్తర కర్తవ్యాన్ని నిర్వహించింది కూడా. మన దగ్గర కూడా ఈ పాత్ర పోషిస్తున్నది. ఇంకా విస్తృతంగా రాజకీయాలను సృజనాత్మకంగా చిత్రించాలంటే విప్లవోద్యమం, రచయితలు నిరంతరం కృషి చేయాల్సిందే. దాని వల్లనే సాధ్యమవుతుంది.

13. మన దేశ అర్ధవలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థను విప్లవ నవల ఏమేరకు చిత్రించిందని అనుకోవచ్చు?

23 జూన్ 1757 బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌలా బెంగాల్ సుబాలోని సలాసి దగ్గర తన ఫ్రాన్స్ మిత్రులతో కలిసి ఈస్టు ఇండియా కంపెనీతో పోరాడి ఓడిపోయాడు. ప్లాసీ యుద్ధంగా పిలవబడే ఆ యుద్ధం ఓటమి నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదం భారతదేశాన్ని అంచెలంచెలుగా ఆక్రమించుకోవడం ఆరంభించింది. 1757కు పూర్వం భారతదేశం ఫ్యూడల్ సమాజం. అప్పటి నుండి 15.08.1947 దాకా మనది వలస సమాజం - 1947 నుండి నేటి దాకా అర్ధ ఫ్యూడల్ - అర్ధ వలస సమాజం.

ముందే వివరించినట్లుగా యూరప్‌లో 1848 తరువాత జరిగిన పారిశ్రామిక విప్లవం ద్వారా యూరప్‌లోని చేతి వృత్తుల వారు జాతీయ బూర్జువా వర్గంగా అభివృద్ధి చెందారు. భూస్వామ్య సమాజపు చివరి రోజుల్లో గుదిబండగా మారిన భూస్వామిక ఉత్పత్తి సంబంధాలను మార్చేందుకు ఉత్పత్తి శక్తులైన రైతాంగం పెద్దఎత్తున తిరుగుబాటు చేసింది. ఫలితంగా భూస్వామ్య పునాదులు కదిలిపోయాయి. ఈ పరిస్థితులలో రైతాంగానికి నాయకత్వం వహించి, యూరప్ జాతీయ బూర్జువా వర్గం కచ్చితమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేపట్టింది. ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించింది. ఫలితంగా భూస్వామ్యం పూర్తిగా తొలగిపోయి యూరప్ అంతటా పెట్టుబడిదారి సమాజం రూపు దిద్దుకున్నది. అనతికాలంలోనే పెట్టుబడిదారి సమాజం తమ ఆస్తులు పెంచుకోవడానికి కార్మిక వర్గాన్ని తీవ్రమైన దోపిడిపీడనలకు గురిచేసింది. ఫలితంగా పోగుపడిన అదనపు విలువతో కొత్త ఆవిష్కరణలకు పూనుకున్నది. ఈ అన్వేషణలో భాగంగా ఇంకా భూస్వామిక సమాజాలుగా ఉన్న దేశాల మీదికి దండెత్తి, అక్కడి సంపదలు దోచుకొని అనేక దేశాలను వలసలుగా మార్చుకోవడం ఆరభమయ్యింది. ఫ్రెంచ్ కార్మిక వర్గం ఈ దోపిడి పీడనను సహించక తిరుగుబాటు చేసింది. 1871లో పారిస్‌లో 71 రోజులు కార్మికుల పాలనలో ఫ్రాన్స్ ఉన్నది. ఇది కార్మిక వర్గపు మొట్టమొదటి పరిపాలన. కొత్తగా రూపొందిన కార్మిక వర్గం రష్యాలో 1905 మేలో జారు చక్రవర్తిని దించి ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 1905 డిసెంబర్‌లో అణచివేత మొదలయ్యింది. 1917 అక్టోబర్‌లో బొల్షివిక్ పార్టీ లెనిన్ నాయకత్వంలో పూర్తిస్థాయి కార్మిక వర్గ నియంతృత్వ పరిపాలన చేపట్టి సోషలిజంలోకి మార్పు ప్రక్రియను చేపట్టింది. రష్యాలో సమస్త స్వంత ఆస్తిని రద్దుచేసిన తొలి శ్రామిక వర్గ రాజ్యం ఏర్పడింది.

భారతదేశం, చైనా వంటి దేశాలు భూస్వామ్య సమాజం చివరలో ముందుగా పెట్టుబడిదారీ విధానాన్ని చేపట్టిన యూరప్ దేశాలకు

వలసలు – అర్ధ వలసలుగా మారాయి. ఈ వలస పాలన మన దేశంలో వృత్తి పనివారు జాతీయ పెట్టుబడిదారులుగా మారడానికి అడ్డంకిగా మారింది. ఫ్రాన్స్, రష్యాలో జరిగిన విప్లవాల అనుభవంతో పెట్టుబడిదారుల తమ వలస దేశాలల్లో కార్మిక వర్గాన్ని ఎదుగనివ్వలేదు. వలస పాలన ఆయా దేశాలలోని అగ్రకుల భూస్వాములను బడా పెట్టుబడిదారులుగా మార్చింది. మరొక పక్క కుల వైరుధ్యాలను, భూస్వామ్య సంబంధాలను పరిరక్షించింది.

భారతదేశంలో జరిగిన నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటాల పరంపర 1857 నుండి ఇప్పటి దాకా ఎన్ని పరిమాణాత్మక, గుణాత్మక పోరాటాలుగా సాగిందో, ప్రజా పోరాటాలకు అగ్రకుల బడా బూర్జువా వర్గం నాయకత్వం వహించి ఎట్లా విద్రోహానికి పూనుకున్నదో వివరంగా చర్చించాం. అట్లాగే 1925 తర్వాత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలోని వర్గ, కుల, ప్రాంతీయ-జాతీయ, అంతర్జాతీయ వైరుధ్యాలను అర్థం చేసుకోలేక – ప్రధానంగా అగ్రకుల నాయకత్వంలో – వీరోచిత ప్రజా పోరాటాలకు ఎట్లా నాయకత్వం వహించలేకపోయిందో చర్చించాం. 1967 తరువాత మార్క్సిజం – లెనినిజం – మావోయిజం వెలుగులో పనిచేస్తున్న పార్టీలు భారతదేశాన్ని అర్ధవలస – అర్ధభూస్వామ్య సమాజంగా అర్థం చేసుకొని ప్రధాన వైరుధ్యం అశేష పీడిత ప్రజానికానికి భారతదేశంలోని భూస్వామ్యానికిగా గుర్తించి – గ్రామసీమల్లో రైతాంగ పోరాటాలు ఆరంభించారు. గత యాభై సంవత్సరాలుగా మూడు తరాలుగా జనతన సర్కారుదాకా సాగిన ప్రయాణం గురించి చర్చించాం.

ఇప్పటికి కమ్యూనిస్టు పార్టీలు, కొన్ని మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు భారతదేశంలో పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెందింది కనుక ఎన్నికల ద్వారా, సార్వత్రిక తిరుగుబాటు ద్వారా రాజ్యాధికారం సాధించాలనేవారున్నారు. సామ్రాజ్యవాద దోపిడి పీడన – అది భూస్వామ్యంతో, బడా భూర్జువా వర్గంతో కలిసి భారతదేశంలో ఎట్లా మనగల్గుతుందో చూస్తున్నాం. వ్యవసాయరంగంలో, పారిశ్రామిక రంగంలో, సర్వీసు రంగంపేర ప్రజల సమస్తం దోపిడి చేయడం భారత ప్రజలు అనుభవిస్తున్నదే! భూస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం అర్ధవలస – అర్ధభూస్వామిక ఉత్పత్తి విధానంగా ఒక విధ్వంసకర సంకర నమూనాగా ఎట్లా రూపొందిందో గతయాభై సంవత్సరాలుగా అనేక విధాలుగా చర్చించడం జరిగింది. ఈ సంకర సంక్లిష్ట ఉత్పత్తి విధానం భారతీయ ప్రజల జీవితంలో కుల వర్గ, లింగ, మత, ప్రాంతీయ, జాతుల మధ్య వైరుధ్యాలకు ఘర్షణలకు మూలమయ్యింది. వలస పాలనలో వచ్చిన నవలలు ఉత్పత్తి శక్తుల – ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యాన్ని, వర్గ పోరాటాన్ని పాక్షికంగానో – తెలిసి అయినా – తెలియక అయినా చిత్రించినవే – విశ్వనాథ సత్యనారాయణ లాంటి వారు వలస పెట్టుబడి ఉనికిని తిరస్కరించి – పూర్తిగా భూస్వామ్య సమాజాన్ని ఆకాంక్షించారు. వికృతమైన, నికృష్టమైన – ఉత్పత్తి శక్తుల బంధిఖానా అయిన ప్యూడల్ సమాజాన్ని, కుల వ్యవస్థను ఎత్తిపడుతూ చాలా నవలలు రాశారు. ఇది భావవాద తిరోగమన సాహిత్యం. భూస్వామిక పితృస్వామిక సమాజం మహిళలను ఎంత కౄరంగా అణచివేసిందో, అలాంటి దుర్మార్గమైన అణచివేత నుండి మహిళలు తమ విముక్తికోసం తపిస్తారో, దారులు వెతుకుతారో చలం రాశారు. అర్ధవలస – అర్ధభూస్వామ్య సమాజంలో బూర్జువా ప్రజాతంత్ర తాత్విక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ గురించి చలం తీవ్రమైన భావోద్వేగాలతో అనేక నవలలు రాశారు. వలస పెట్టుబడి భారతదేశంలోని సహజ పరిణామక్రమాన్ని నిరోధించింది. జాతీయ పెట్టుబడిదారులగా ఎదుగవల్సిన వృత్తి పనివారి ఆరాట పోరాటాలను కౄరంగా అణచివేసింది. అగ్రకుల పెట్టుబడిదారులను తయారుచేసింది. అగ్రకుల బడా పెట్టుబడిదారుల అణచివేత కింద జాతీయ పెట్టుబడిదారులుగా ఎదుగవల్సిన వృత్తికులాల వారు ఎట్లా నలిగిపోయారో ప్రేమ్‌చంద్ రంగభూమిలో రాశారు. ఈ విధంగా అర్ధవలస – అర్ధ భూస్వామిక తాత్విక, ఆర్థిక, రాజకీయ లక్షణాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడం ద్వారా మరింత శాస్త్రీయంగా అర్థం చేసుకోగలం. గ్రామాలల్లో, పట్టణాలలో ఈ స్థితులు ఎట్లా వ్యక్తమౌతున్నాయో అర్థంచేసుకోగలం. ఇలాంటి సంక్లిష్ట స్థితిలో వర్గ పోరాటం ప్రధాన వైరుధ్యాన్ని గుర్తెరిగి – వర్గ పోరాటం ఆరంభించి కొనసాగుతున్న క్రమంలో ఎదురయ్యే అన్నిరకాల భూస్వామిక, పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద వైరుధ్యాల చలనాలను ఘర్షణ – ఐక్యత ద్వారా ఎత్తుగడలు రూపొందించుకుంటూ శ్రామిక వర్గం పోరాడుతున్నది.

అలాంటి పోరాటాలు 1967 నుండి నేటిదాకా సాగిన క్రమం, తొమ్మిది దశలల్లో తెలుగులో వచ్చిన విప్లవ నవలల గురించి లోగడ చర్చించాం. దాదాపుగా అవన్నీ కూడా అర్ధవలస – అర్ధభూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా పోరాట క్రమాన్ని చిత్రించిన విప్లవ నవలలే.

ఇటీవల వెలువడిన సైరన్ నవలలో – సింగరేణి గనుల్లో పెట్టుబడిదారి ఉత్పత్తి విధానం స్థానంలో జనజీవితంలో, ఉత్పత్తి క్రమంలో – అనగా ఉత్పత్తి శక్తులు – ఉత్పత్తి సంబంధాలల్లో అర్ధవలస – అర్ధభూస్వామ్య సమాజ బౌద్ధిక, భౌతిక రూపం చిత్రించడమైనది. అలాంటి వ్యవస్థను మార్చడానికి జరిగిన కార్మిక వర్గ పోరాటంలో ఎత్తుగడలు చూస్తాం. పరిణామాత్మక పోరాటాలు – కార్మికుల దైనందిన సమస్యలైన (నివాసం, నీళ్లు) మీద, సమస్త పీడనలు హింసలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటితపడి – వర్గ పోరాటం ఆరంభించడానన్ని చిత్రించడమైనది. క్రమంగా కార్మిక వర్గం, యాజమాన్యంలో అర్ధవలస – అర్ధ భూస్వామ్య వ్యవస్థ లక్షణాలు మరోదశకు మారుతూ, ఇలాంటి ఉత్పత్తికి మూలమైన అర్ధవలస – అర్ధభూస్వామ్య దోపిడి ప్రభుత్వం గురించి అర్థంచేసుకొని నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం కోసం కార్మిక వర్గం రాజకీయ పోరాటాలకు దిగడం ఒక గుణాత్మక మార్పు. అది క్రమంగా దేశవ్యాపితంగా ఆదివాసీ, గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల్లోకి వ్యాపించిందో మనందరికీ తెలుసు. అసమంగా, ప్రాంతాలుగా, జాతులుగా, కులాలుగా, వర్గాలుగా, మతాలుగా విడిపోయి ఉత్పత్తి జ్ఞానాన్ని ప్రజలు సమష్టిగా లోగడ గ్రామీణ ప్రాంతాలల్లో పంచుకోలేదు. దాదాపుగా అన్ని ప్రాంతాలల్లో రైతాంగ పోరాటాలు జరిగాయి. వారివారి పరిణామాత్మక పోరాటాలు దీర్ఘకాలం జరిగాయి. తాత్విక, ఆర్థిక, రాజకీయ రంగంలో అర్ధవలస – అర్ధభూస్వామ్య లక్షణాలను గతితార్కికంగా అర్థంచేసుకోవడానికి – అధ్యయనం చేయడానికి పూనుకున్నాయి. ఉమ్మడి శత్రువును శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి – వర్గ పోరాటంలో ఘర్షణ – ఐక్యత ద్వారా ప్రజలు తర్ఫీదు కావడానికి మొట్టమొదటిసారిగా విస్తృత ప్రాతిపదికగా ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సరం మోహరించిన రైతులకు ఒక పాఠశాలగా పనికివచ్చింది. ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక – సామ్రాజ్యవాద అనుకూల మూడు చట్టాల వ్యతిరేక పోరాటం ప్రజలకు సమష్టి ఆచరణను నేర్పింది. ఇది ఒక ముందడుగు. కళ్యాణరావు అంటరాని వసంతంలో – వలస సమాజం, 1947 తర్వాత అర్ధవలస అర్ధభూస్వామ్య సమాజం దళిత జీవన నేపథ్యంలో చిత్రించారు.

సంపూర్ణంగా –శషభిషలు లేకుండా – పురోగమిస్తున్న

వర్గపోరాటాన్ని విప్లవోద్యమ నవలల్లో ఇంకా చిత్రించాల్సే ఉన్నది. ఎప్పటికప్పుడు అర్ధవలస - అర్ధభూస్వామ్య ఉత్పత్తి విధానంలో పై నుండి బలవంతంగా రుద్దుతున్న మార్పులను, వాటి ప్రభావాలను, ఫలితాలను, సారాంశాన్ని అర్థంచేసుకోవలసి ఉన్నది. గ్రామసీమల్లో పెరుగుతున్న దోపిడి, హింస, నిరుద్యోగం సంఘటిత రూపం తీసుకోని వైయక్తిక కోపోద్రిక్త తిరుగుబాట్లు, అస్తిత్వ ఉద్యమాలు, నిర్మాణాలను విచ్ఛిన్నం చేసే ఫాసిస్టు నిర్బంధం లాంటి అన్నిరకాల స్థితులను చిత్రించడ వలసి ఉన్నది. తాత్విక, ఆర్థిక, రాజకీయ నేపథ్యంలో అర్థంచేసుకోవడం - నవలలో చిత్రించడం విప్లవోద్యమాలతో పాటే తగినస్థంత కొనసాగడం లేదు. విప్లవోద్యమాలు ఈ అవసరాన్ని, అవగాహనను ముందుకు తీసుకపోయే ప్రయత్నం వల్లనే ఇది సాధ్యమౌతుంది. దీనికి నిరంతర అధ్యయనం సాధన కావాలి. విప్లవోద్యమం సమస్త శక్తులను శాస్త్రీయంగా మరింత లోతుగా అర్థంచేసుకోవడానికి, పురోగమించడానికి ఈ అవగాహన, కృషి పెరగాలి.

వర్గ పోరాటాల దశ, దిశ పురోగమనం, వెనకంజలను బట్టే దోపిడి రూపాలు మారుతుంటాయి. మారుతున్న దోపిడి రూపాలను చిత్రించడమంటే ప్రజాపోరాటాలను చిత్రించడమే. భారతదేశంలో గాని తెలుగు ప్రాంతాలల్లో గాని నవల రాయడం ఆరంభమైన దగ్గరి నుండి ప్రజా పోరాటాల నేపథ్యంలో తెలుగు నవలను గతితార్కికంగా, చారిత్రికంగా అధ్యయనం చేస్తే ఈ పరిణామ క్రమం అర్థమౌతుంది. మాలపల్లి నుండి అంటరాని వసంతం, నిషిధ దాకా, కొండగాలి నుండి రాగో దాకా, కొలిమంటుకున్నది నుండి వసంతగీతం దాకా, శేషగిరి నుండి బొగ్గులు దాకా రైతాంగ, కార్మిక, ఆదివాసీ ప్రాంతాలల్లో మారిన దోపిడి రూపాల చిత్రీకరణ అధ్యయనం చేయాలి.

14. మొత్తంగానే మారుతున్న దోపిడి రూపాలను తెలుగు నవల ఏమేరకు చిత్రించిందనుకోవచ్చు?

దాదాపు అన్ని తెలుగు నవలలు ఏదో ఒక దోపిడి, పీడన - భౌతిక, బౌద్ధిక రూపాలను వారి వారి చైతన్యాలను బట్టి, లక్ష్యాలను బట్టి చిత్రించినవే. 1757 ప్లాసీ యుద్ధం తరువాత స్వయంపోషక, కులాధారిత గ్రామాలు విచ్ఛిన్నంకావడం వేగవంతమయ్యింది. మునుపెన్నడులేని విధంగా చీకటి ఖండాలుగా విలసిల్లిన గ్రామాలు - అందులో ఊపిరాడక మగ్గిన ఉత్పత్తి శక్తులు గ్రామాల సీమలు దాటి బయటకు అడుగు పెట్టాయి. వలస పెట్టుబడి తెచ్చిన మార్పులు మొదట ఆశ్రిత కులాలు పొట్ట చేతపట్టుకొని పట్టణాలకు వలసపోయాయి. అక్కడ బ్రిటీష్ వలస పెట్టుబడిదారుల కుట్రల మూలకంగా అగ్రకుల బడా పెట్టుబడిదారులుగా ఎదిగి, అణచివేశారు.

ఈ దశలోనే కంబు కందర చరిత్ర, కామరూప (1866), తెలంగాణ నుండి తడుకమల్ల కృష్ణారావు, రాయలసీమ నుండి నరహరి గోపాలకృష్ణ, శ్రీరంగరాజ చరిత్రము (1872)లో నవలలు వచ్చాయి. తరువాత ఇంగ్లిష్‌లోని ఆలీవర్ గోల్డుస్మిత్ 'ది వికార్ ఆఫ్ వేక్‌పీల్డ్'కు అనుసరణగా కందుకూరి వేరేశలింగం రాసిన 'రాజశేఖరచరిత్రము' నవల 1878లో వచ్చింది. రకరకాల ఆధిపత్య భావాల వలన కందుకూరి వీరేశలింగం నవల తెలుగులో తొలి నవలగా ప్రచారం చేశారు. ఏది ఏమైనా ఈ మూడు నవలలు విచ్ఛిన్నమౌతున్న - మారుతున్న ఆ కాలం నాటి పై మెట్టు జీవితాల గురించి వచ్చిన నవలలు. దాదాపుగా ఈ నవలలో దోపిడి, పీడన రూపాల గురించి వివేచన లేదు. మానవ జీవితంలో జరిగే మంచి చెడ్డలకు కారణం భౌతిక జీవితంలో లేవు. అవి కర్మ ఫలితంగా జరుగుతాయి. కర్మ పునర్జన్మల ఫలితం లాంటి భావవాదంలో ఉన్నాయి.

ఆ తరువాత దోపిడి రూపాలను అర్థంచేసుకోవడం ఆరంభమయ్యింది. సాంప్రదాయవాదులైన విశ్వనాథ లాంటివారు - పటిష్టమైన భారతీయ గ్రామీణ సమాజం - కుల వ్యవస్థ స్థానే మ్లేచ్ఛులు (ఇంగ్లీషువారు) ప్రవేశపెట్టిన సరుకులు - సమస్తం కూలగొట్టాయి- భౌతిక జీవితంలో ఇంగ్లీషు వారి దోపిడి మూలకంగానే అరిష్టాలు సంభవించాయని పుంఖానుపుంఖంగా నవలలు రాశారు. పితృస్వామ్య అణచివేతలో మహిళలు తమ సమస్తం కోల్పోడం, ఆస్తిహక్కు లేకపోవడం, దళితులు వ్యవసాయ యోగ్యం చేసుకున్న భూములు అగ్రకులాలు గుంజుకోవడం దోపిడిగా కన్పించలేదు. ఇది భూస్వామిక సమాజాన్ని పునరుద్ధరించే తిరోగమన నవలలు.

సనాతన, సాంప్రదాయిక, భూస్వామిక పీడన, దోపిడిగల సమాజం కూలిపోక తప్పదు. అది మహిళలను భావజాలపరంగా, భౌతికంగా ఎట్లా అణచివేస్తుందో చలం నవలలు రాశారు. ఈ నవలలన్నీ కూడా బూర్జువా వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన నవలలు. ఇవి భారతదేశంలోని వర్గ సమాజాన్ని, దోపిడి రూపాలను - అవి అనివార్యంగా పీడిత, శ్రామిక ప్రజలు చేస్తున్న పోరాటాల నేపథ్యంలో అర్థం చేసుకోలేదు.

మారుతున్న దోపిడి రూపాల ప్రస్థావన లేకుండా పగటి కలలు కనే వ్యాపార సాహిత్యం ఆ తరువాతి కాలంలో కుప్పతెప్పలుగా వచ్చింది.

దోపిడి పీడన రూపాలను ఎప్పటికప్పుడు అర్థంచేసుకుంటూనే, సామాజిక చరిత్రను గతితార్కికంగా అర్థంచేసుకుంటూనే, సామాజిక చరిత్రను గతితార్కికంగా అర్థంచేసుకోకుండా, మానవుని స్వార్థానికో, వ్యక్తుల ప్రవర్తనకో జతచేసి చూసే శూన్యవాదం, మానసిక శాస్త్రం లాంటి ప్రభావంతో బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', గోపీచంద్ 'మెరుపులు మరకలు' లాంటి నవలలు వచ్చాయి.

మారుతున్న దోపిడి పీడనలను చిత్రించి, దోపిడి పీడనలు మారడానికి కారణభూతమైన ప్రజల వర్గ పోరాటాన్ని, దాని గతిక్రమాన్ని చిత్రించకపోవడం - కేవలం తమకు కనిపించే దోపిడి పీడనలను మాత్రమే చిత్రించి, అవి రూపొందే క్రమాన్ని, వాటిని ఎదిరించి పోరాడే శక్తులను పట్టించుకోకపోవడం - మారుతున్న దోపిడి పీడనలను గతితార్కికంగా, చారిత్రికంగా అర్థం చేసుకోకపోవడం - స్వభావంలో రివిజనిస్టు నవలలు, దాదాపుగా అన్నిరకాలుగా బహుమతులు పొందుతున్న నవలలు ఇవే. "సందర్భానుసారంగా తలెత్తిన ఆయా సమస్యలకు అనుగుణంగా వైఖరిని, ప్రవర్తనను నిర్ణయించడం, రోజువారి సంఘటనలకు చిల్లర రాజకీయాలు చేయడం, శ్రామికవర్గ ప్రాథమిక ప్రయోజనాలను, మొత్తం పెట్టుబడిదారి లక్షణాలను మరిచిపోవడం, తక్షణ లేదా ఊహించిన ప్రయోజనాల కోసం ప్రాథమిక ప్రయోజనాలను త్యాగం చేయడం - ఇది రివిజనిజం విధానం. స్వభావాన్ని బట్టి రివిజనిజం అనంతమైన రూపాలను కలిగి ఉంటుంది." - లెనిన్.

తెలంగాణ సాయుధ పోరాటం నుండి ఇప్పటిదాకా ఆదివాసీ, రైతాంగ, పారిశ్రామిక ప్రాంతాలల్లో, గ్రామాలు, పట్టణ ప్రాంతాలల్లో మారుతున్న దోపిడి రూపాలను విప్లవ నవల వర్గ పోరాటంలో భాగంగా చిత్రిస్తూ వచ్చింది. ప్రజల మనిషి, చిల్లర దేవుళ్లు మొదలుకొని - రాగో దాకా అనేక నవలల్లో కన్పిస్తుంది.

1967 తరువాత నక్సల్బరీ విప్లవోద్యమం దేశవ్యాపితంగా విస్తరించిన నేపథ్యంలో శ్రీకాకుళంలోని ఆదివాసులు తమ అటవీ సంపదలను దోచుకుంటున్న బుగతలు, షావుకార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం ఆరంభించారు. 'కొండగాలి' నవలలో భూషణం ఆనాటి దోపిడి రూపాలను చిత్రించారు. ఆ తరువాత ఆ పోరాటం అక్కడ

వెనుకంజవేయడం తెలంగాణ, రాయలసీమల్లో పుంజుకోవడం జరిగింది. ఉత్తరాంధ్రలోని మారుతున్న దోపిడీ రూపాలను అట్టాడ అప్పలనాయుడు 'పునరావాసం', నుండి 'బహుళ' దాకా రాశారు. రావిశాస్త్రి అన్ని నవలలు మారుతున్న దోపిడి రూపాలను చిత్రించినవే.

ముందే 11వ ప్రశ్నలో చెప్పినట్లుగా - చెరబండరాజు 'మాపల్లె', 'ప్రస్థానం', 'దారిపొడుగునా', గూడ అంజయ్య 'పొలిమేర' నుండి పి. చంద్ నవలల దాకా వ్యవసాయరంగంలో, ఆదివాసీ, కార్మిక రంగంలో మారుతున్న దోపిడి రూపాల గురించి విప్లవోద్యమం ప్రభావంతో పోరాడుతున్న ప్రజా పోరాటాల నేపథ్యంలో చిత్రించడమైనది.

కోస్తాంధ్రలో 'నల్లరేంక చెట్టుకింద', 'నిషిధ', 'మేరువు' దాకా నల్లూరి రుక్మిణి గారు మారుతున్న దోపిడి రూపాల గురించి చిత్రించారు.

రాయలసీమలో కేశవరెడ్డి, నామిని సుబ్రమణ్యంనాయుడు, కనుంపల్లి రాజారాం 'ఎదురగ్గి', పాణి 'నిప్పులవాగు', బండి నారాయణస్వామి 'గద్దలాడతండాయి', 'శప్తభూమి' దాకా మారుతున్న దోపిడి రూపాల గురించి శాస్త్రీయంగా విశ్లేషించినవే. 1991 తర్వాత ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయరంగంలో, పారిశ్రామిక రంగంలో ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలల్లో మారిన దోపిడి రూపాలను పెద్దింటి అశోక్‌కుమార్ 'ఊరికి ఉప్పలం' లాంటి నవలల్లో చిత్రించారు. పి. చంద్ 'మా ఊరి కథ', 'భూదేవి' నవలల్లో సింగరేణిలో ఓపెన్ కాస్టు గనులు వచ్చి దోపిడి రూపాలు మారి గ్రామాలు పూర్తిగా నిర్వాసితం కావడం చిత్రించారు.

పదుల సంఖ్యలో ఎప్పటికప్పుడు మారుతున్న దోపిడి రూపాల మీద అనేక నవలలు వచ్చాయి. అయితే అభివృద్ధి చెందుతున్న ప్రజా పోరాటాల నేపథ్యంలో పోరాట ప్రాంతంలో ఉత్పత్తి శక్తుల వికాసం జరగడం, అనగా పరిమాణాత్మక పోరాటాల వలన పాత దోపిడి రూపాలు మారడం - కొత్త దోపిడి రూపాలు రావడం అనివార్యం. ఉత్పత్తి శక్తుల పోరాటాల ఆకాంక్షల మేరకు దోపిడి ప్రభుత్వాలు మారక, జాతీయ, అంతర్జాతీయ సంక్షోభాల మూలకంగా దోపిడి పెరగడం, కోట్లాది గ్రామీణ ప్రజలు కడు పేదవారిగా మారి పట్టణాలకు వలసలు పోవడం తీవ్రమైన సంక్షోభం - పరిష్కరించజాలని సంక్షోభం - ఏర్పడినపుడు ప్రభుత్వాలు ఫాసిస్టుగా మారుతున్నాయి.

ఏది ఏమైనా మారుతున్న దోపిడి పీడన రూపాలను ఎప్పటికప్పుడు అర్థంచేసుకోవడం, నవలల్లో చిత్రించడం ప్రజల ఆకాంక్షల మేరకు, ప్రజా పోరాటాలకనుగుణంగా పూర్తిగా లేదు. అందుకు కారణం వర్గపోరాటంలో నుండి రచయితలు ఎదగకపోవడం. బయట ఉన్న రచయితలు ఎక్కువ భాగం పెటీ బూర్జువాలు కనుక వారి అధ్యయనం, చొరవ పరిమితం. వర్గ పోరాటంలాగే ఇలాంటి నవలలను రాయడం విస్తృతమైన క్షేత్ర స్థాయి అధ్యయనంతో, మమేకత్వంతో సాధ్యమౌతుంది. ఇప్పుడు తెలంగాణ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో విప్లవోద్యమం వెనకంజలో ఉన్నది కనుక, గతంలో జరిగిన విప్లవోద్యమ అనుభవం మారిన, మారుతున్న దోపిడి రూపాల గురించిన అవగాహన విప్లవోద్యమ శక్తులకు, ప్రజలకు - అటు ప్రభుత్వాలకు ఉన్నది. ప్రపంచవ్యాపితంగా, దేశవ్యాపితంగా సాపేక్షికంగా ప్రజా పోరాటాలు మందగమనంలో ఉన్నచోట్ల దోపిడి నగ్నంగా, ఎక్కువగా ఉన్నది.

1995 తరువాత తెలంగాణలో విప్లవోద్యమ పోరాట ప్రాంతాల్లో ప్రజారాజ్య కమిటీలు ఏర్పాటు చేశారు. తీవ్ర నిర్బంధం వలన - అప్పటి విప్లవ శక్తులు అనుసరించాల్సిన వ్యూహం ప్రభుత్వాలకు జాతీయ, అంతర్జాతీయ శక్తుల పూనికతో అందుబాటులోకి రావడం వలన మంద్రస్థాయి యుద్ధం ఆరంభమయ్యింది. దీని ప్రకారంగా ప్రజలకు ఉత్పత్తి శక్తుల వికాసం కాకుండా లబ్ధిదారులను చేయడం పోరాట ప్రాంతాలల్లో తీవ్ర నిర్బంధంతో ప్రజల నుండి నాయకత్వాన్ని వేరు చేయడం జరిగింది. ప్రజలు అలాంటి ఎత్తుగడలను తిప్పికొట్టి విప్లవ శక్తులన్నీ కలిసి ప్రత్యేక తెలంగాణ సాధనగా - అధికార వర్గాన్ని ఎదిరించిపోరాడాయి. మొత్తానికి 2014లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కన్నా ముందే ప్రజాఫ్రంటు నాయకుడు ఆకుల భూమయ్య ప్రమాదంలో చనిపోవడంతో బాటు ఒక పక్క నాయకత్వాన్ని దెబ్బతీసి, మరో పక్క 1995 ప్రజల ప్రమేయంతో ప్రజా రాజ్యకమిటీలు అమలుచేయాల్సిన విప్లవోద్యమ నమూనా గ్రామ అభివృద్ధి పథకాలను ప్రభుత్వం సమీక్షించి తన విధ్వంసకర నమూనాతో గ్రామాల అభివృద్ధి ఆరంభమయ్యింది. ఫలితంగా తెలంగాణలో ఉత్పత్తి పెరిగింది. కాని అర్ధవలస - అర్ధభూస్వామ్య సామాజిక దోపిడి వలన ఉత్పత్తిలో న్యాయమైన వాటా ఉత్పత్తి శక్తులకు దక్కలేదు. శాస్త్రీయ పద్ధతిలో ఉత్పత్తి శక్తుల వికాసం జరుగలేదు. భారతదేశంలోని అతి పురాతన కుల వ్యవస్థలో భాగంగా - ఇలాంటి అభివృద్ధి కూడా నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో - ముందువరుసలోని వారికి లాభించింది. గ్రామాలు ఖాళీచేసిన దొరలు పట్నాలల్లో విద్య, వైద్యం, రియల్ ఎస్టేట్, కాంట్రాక్టులు, రాజకీయాలు, ఏజెన్సీల లాంటి వాటిలో సురక్షితమైన మార్మికమైన దోపిడి రూపాలు ఎంచుకున్నారు. గ్రామాలల్లో దళిత బహుజనుల మధ్య తిరిగి భూస్వామ్య సంబంధాలు కొత్త రూపంలో తీవ్రమయ్యాయి. ప్రజారాజ్య కమిటీల నాయకులను లొంగదీసుకోవడమో, నిర్బంధాలపాలు చేయడమో ఎన్‌కౌంటర్‌లలో చంపడమో జరిగింది. ఈ కుట్రలను ఎప్పటికప్పుడు పసికట్టి అందుకు తగిన విధంగా పోరాటాలు నిర్మాంచాల్సిన స్థానిక నాయకత్వంలో ఆర్థికవాద, అతివాద లక్షణాలు చోటుచేసుకున్నాయి. మొత్తంగా విప్లవోద్యమం ఈ రకమైన మార్పులను అర్థంచేసుకోవడం ఆలస్యమైంది.

పరోక్ష పన్నుల ద్వారా - అనగా భూమికి శిస్తులేదు, ఉచిత కరెంటు, ఎకరానికి సంవత్సరానికి పదివేల రూపాయలు రైతులకు రైతుబంధు పేరిట ఇవ్వడంతో - మధ్యతరగతి, ధనికరైతులు లబ్ధిదారులుగా మారారు. వీళ్లంతా దాదాపుగా బహుజన కులాలవాళ్లు. దళితులకు భూమిలేదు. రోజ్‌గార్ నిధుల ద్వారా, డ్వాక్రా సంఘాల ద్వారా పేద రైతులకన్నా రైతుకూలీల పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. విప్లవోద్యమం వలన రకరకాల భూమి వికేంద్రీకరణ జరిగి 65 శాతం అయిదెకరాల లోపు రైతులు పెరిగారు. వీళ్లు కౌలుదారులుగా మారి పై నుండి మోపిన సామ్రాజ్యవాద వ్యవసాయ సాంకేతికత వలన మునుపటికన్నా రెండు రెట్ల ఉత్పత్తి పెంచారు. ఉత్పత్తి ఖర్చులు రెండు రెట్లు పెరిగి గిట్టుబాటు ధరలు లేక - మల్టీనేషనల్ కంపెనీల ట్రాక్టర్లు, విత్తనాలు, పురుగు మందులు వాడి అధికోత్పత్తి తీసికూడా ఉత్పత్తి ఖర్చులు పెరిగి గిట్టుబాటుకాక దివాళా తీశారు. ప్రభుత్వం భూముల స్థిరీకరణ చేసి పాత భూస్వాములకు తిరిగి భూములు కట్టబెట్టింది. ధరణి పోర్టల్ పేరిట భూముల ధరలు పెంచి పట్టా పాసుపుస్తకాల లాంటి వాటికోసం ప్రభుత్వ భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు పరోక్షంగా దండుకుంటోంది. మరోపక్క బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ మొత్తం ఆక్రమిస్తున్నాయి. కొత్త కట్టడాలు, బ్యాంకు రుణాలు - ఇదొక విధ్వంసకర నమూనా. అయితే మునుపటి ప్రభుత్వాల లాగా కాకుండా ప్రజలు అనేక రకాలుగా చీలిపోయి కూడా ఈ విచిత్ర దోపిడి రూపాలల్లో లబ్ధిదారుల కావడం విశేషం. వృత్తి పనివారి కులాలవారి అభివృద్ధి మరొక రకమైంది. అందులో దోపిడి రూపాలు అధ్యయనం చేయవల్సినవి.

రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో దోపిడి రూపాలు మరొక రకమైనవి. ఏది ఏమైనా ఎన్ని రకాల బూర్జువా పార్టీలు మారినా భారతదేశంలో అమలయ్యే అర్ధవలస - అర్ధభూస్వామ్య పరిపాలన జాతీయంగా, అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదపు దుర్మార్గమైన నక్కజిత్తుల ఎత్తుగడల పరాకాష్ట. ఇంచుమించు భారతదేశంలో దోపిడి రూపాలు ఎన్ని మారినా, మరింత దోపిడిని పెంచడం సామ్రాజ్యవాద దేశాల ఎత్తుగడ. ఉత్పత్తితో పాటు భారతదేశంలోని ఖనిజాలు దోచుకోవడం కోసం ప్రజాస్వామ్యం పేరిట తమ తొత్తు ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తున్నాయి.

1978లో కరీంనగర్ ఆదిలాబాదు రైతాంగ పోరాటాలు ఉవ్వెత్తున ఆరంభమైన దశలో భారతదేశం ప్రపంచదేశాలతో పోల్చినపుడు జిడిపిలో ముప్పైలోపు ఉండేది. జిడిపిలో వ్యవసాయరంగం వాటా 65 శాతం, పరిశ్రమలు 24 శాతం, సర్వీసు రంగం 11 శాతం ఉండేది. ఇప్పుడు వ్యవసాయ రంగం వాటా 17 శాతం, పరిశ్రమలు 21 శాతం తగ్గిపోయి సర్వీసు రంగం వాటా 62 శాతానికి పెరిగిపోయి ఇంచుమించు ప్రపంచ దేశాలల్లో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా మారింది. పెరిగిపోయిన సర్వీసు రంగం, తరిగిపోయిన వ్యవసాయ పారిశ్రామిక రంగాల నుండి రకరకాల రూపాలల్లో దోపిడి చేసి బలిసిపోయింది. అన్నింటికన్నా దుర్మార్గమైన విషయం - ప్రపంచ దేశాలల్లో ప్రజల జీవన ప్రమాణాల రీత్యా 101వ దేశంగా మారిపోయింది. ఇది భారతీయ దోపిడి రూపాల చిత్రం. విధ్వంసమైన 40 కోట్ల యువకులైన భారతీయ ఉత్పత్తి శక్తుల రూపమిది. అన్ని వనరులు ఉన్నా కూడా -జీవనదులు, 40 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి, లక్షల కోట్ల విలువైన ఖనిజాలు కల్గిన భారతదేశం - అత్యంత పేద దేశాల కన్నా నికృష్టంగా ఉంది. రాయవల్సిన నవలలకు ఈ ఆర్థిక, రాజకీయ చరిత్ర అధ్యయనం అత్యంత అవసరం.

(ఇంకా ఉంది)

(44వ పేజీ తర్వాత)

ఆ ప్రాంత ప్రజలు తమ హక్కులను అధికారంతో అడిగారు (డిమాండ్), ఈ హంతక ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరుల్డంగాలో చిన్న పిల్లపై అత్యాచారం జరిగిన కేసుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమంలో టిప్పు సుల్తాన్ పాల్గొన్నాడు. హసిబుర్ రైతుల న్యాయమైన డిమాండ్ల కోసం జరిగిన ప్రజా ఉద్యమంలో ప్రతీక్ పాల్గొన్నాడు. సరళంగా చెప్పాలంటే, ఈ రోజు వారు - తమ రాజకీయాల కోసం రాజ్య అణచివేత బాధితులు. వీరి రాజకీయం కేవలం సామాన్య ప్రజల హక్కులను డిమాండ్ చేయడమే కాదు, ప్రజారాజ్య స్థాపన. వీరు ప్రజా ప్రభుత్వం, ప్రజాకోర్టుల గురించి మాట్లాడతారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరిని టార్గెట్ చేస్తున్నాయి.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కిరాయి గూండాలు తుపాకులు, బాంబులను నిల్వ చేస్తున్నారు. పేలుళ్ళు; రాత్రింబగళ్ళూ ప్రజలను సజీవ దహనం చేయడం; అహంకారంతో అత్యాచారం చేయడం; బాధితులను తగులబెట్టి, వారినే నిందించడం; చంపేస్తామనే బెదిరింపులతో వసూళ్ళు చేయడం; ఆవులు, బొగ్గు, ఇసుక, మహిళలు -అన్ని రకాల అక్రమ రవాణా కార్యకలాపాల పూర్తి మాఫియా నడుపుతున్నారు.

లక్షలాది మందిని తృణమూల్ కాంగ్రెస్ చిట్ ఫండ్ వ్యాపారంతో దివాళా తీయించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 'బంగ్లా నిజేర్ మేయేకే ఛాయ్' (బెంగాల్‌కు తన సొంత కూతురు కావాలి) అనే నినాదంతో మమతా బెనర్జీ గెలిచిన బెంగాల్‌లో, బెంగాల్ కుమార్తెలకు భద్రత లేదు. టియంసి విద్యార్థి సంఘం తృణమూల్ ఛాత్ర పరిషత్ క్యాంపస్‌లో విద్యార్థులపై దౌర్జన్యం చేస్తోంది. దానికి వ్యతిరేకంగా నిలబడిన వారిని, ప్రతిఘటించిన వారిని జైల్లో పెడుతున్నారు. ఎలాంటి భిన్నాభిప్రాయాలను సహించేది లేదన్న సందేశాన్ని ప్రజల్లోకి పంపేందుకు తృణమూల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లోని 'ఫాసిస్ట్ వ్యతిరేక' తృణమూల్ ప్రభుత్వం విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, విప్లవకర రాజకీయ కార్యకర్తలను అరెస్టు చేయడానికి, నిర్బంధించడానికి కేంద్రంలోని ఫాసిస్ట్ బిజెపితో కుమ్మక్కయింది.

ఫాదర్ స్టాన్‌స్వామి అమరులైనప్పుడు యూఏపీఏ అమలుపై కేంద్రానికి లేఖ రాసి చివాట్లు పెట్టిన మమతా బెనర్జీనే రాజకీయ కార్యకర్తలను యూఏపీఏ కేసుల ఉచ్చులో బిగిస్తోంది. కేంద్రంలా భయానక పాలన చేస్తూ రామనామం జపిస్తోంది. అయినప్పటికీ, ఈ దేశ శాంతి భద్రతల దృష్టిలో మమతా బెనర్జీ గానీ, తృణమూల్ నేతలు గానీ దేశద్రోహులు, ఉగ్రవాదులు కారు. ప్రతిరోజూ తమ అహంకారాన్ని ప్రజలపై ప్రదర్శిస్తారు -తాము ఏ శిక్షా లేకుండానే బయటపడగలమనుకుంటారు. ప్రజా ఉద్యమ తరంగాలు ప్రతి పాలకుడి సింహాసనాన్ని వణికిస్తాయని వారు మర్చిపోయారు. 34 ఏళ్ల లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం కూడా ప్రజాగ్రహాన్ని తట్టుకోలేకపోయింది. నిరంకుశ పాలకులను పడగొట్టే, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించే ప్రజా ఉద్యమం, ప్రజాయుద్ధం, బెంగాల్ మహత్తర అధ్యాయాల రాజకీయాలను వారు మరచిపోయారు.

విప్లవ రాజకీయ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అణచివేతలో 'ఆపరేషన్ సమాధాన్' ఒక ప్రధానమైన భాగం. మరో మాటలో చెప్పాలంటే 2022 నాటికి భారతదేశంలో మావోయిస్టుల నిర్మూలన పేరుతో, ప్రజల ప్రజాస్వామిక హక్కులకోసం జరిగే ఉద్యమాలు, నిర్వాసిత్వ వ్యతిరేక ఉద్యమాలు, నీరు, అటవీ, భూమిలపై హక్కుల కోసం జరిగే ఉద్యమాలను కాలరాచి వేస్తోంది. నిజమైన నూతన స్వతంత్ర దేశం కలకంటున్న వారి మీద ప్రభుత్వం 'దేశద్రోహులు' అనే ముద్ర వేసే ప్రయత్నం చేస్తోంది.

దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోనూ ఇదే లేదా ఇంతకంటే భయంకరమైన పరిస్థితి నెలకొంది. మోదీ, మమత, కేజ్రీవాల్, విజయన్- 'ప్రజా ప్రతినిధులు' అవే పద్ధతులను అనుసరిస్తూ రాజ్య భయోత్పాతానికి పాల్పడుతున్నారు. మరోవైపు, ప్రతిఘటన వెల్లువెత్తుతోంది. ఈ ప్రజా వ్యతిరేక రాజ్యాన్ని, దాని క్రూరమైన చట్టాలను అంతం చేయడానికి, న్యాయమైన యుద్ధం, ప్రజాయుద్ధం అవసరం మాత్రమే కాదు, ఏకైక మార్గం కూడా.

స్పష్టంగా, భారతదేశంలోని ప్రజల జీవనోపాధిని కొల్లగొట్టడం, ప్రజా ప్రతిఘటనను ఎదుర్కొని రాజ్యాన్ని రక్షించే ఘర్షణ తీవ్రతరం కావడం, పాలకులు, పీడితుల మధ్య అంతర్యుద్ధంగా మారుతోంది - ఇది ఇప్పటికే దేశంలో విస్తృత ప్రాంతానికి విస్తరించింది. ఈ అవినీతి, కుళ్ళిపోయిన సమాజాన్ని నిర్మూలిస్తామని విప్లవ రాజకీయ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. కాబట్టి వారు దేశద్రోహులు. నూతన ప్రజాస్వామిక దేశాన్ని నిర్మించాలనుకునే జోయితా, ప్రతీక్ వంటి 'ద్రోహులకు' మద్దతు ఇవ్వడం తప్ప, భారతదేశ ప్రజాస్వామిక ప్రజలకు వేరే ప్రత్యామ్నాయం ఉందా?

(తెలుగు: పద్మ కొండిపర్తి)

జూన్ 4-5 తేదిలలో మిర్యాలగూడలో జరిగిన
వ్యాసరచన వర్క్‌షాప్ దృశ్యాలు











RLVA101M202

ARUNATARA A Literary and Cultural Monthly Journal RNI Regn. No. 21152/72
JUNE-JULY 2022 VOL:50, ISSUE : 5, VIJAYAWADA

52

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాసపత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల , బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచలనాలకు అరుణతార తన శక్తనంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘఢ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృతిక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది. విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యం స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారవుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒకపక్క లబ్దప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతార విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం. ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

అరసవిల్లి క్రిష్ణ - విరసం అధ్యక్షులు, రివేరా - విరసం కార్యదర్శి
వరవరరావు, టి. కృష్ణాబాయి, సివిఎస్ఆర్ ప్రసాద్, జి. కళ్యాణరావు, వి. చెంచయ్య, అల్లం రాజయ్య,
ఎం. రత్నమాల, పాణి, పి. వరలక్ష్మి, రాంకీ

చందాలు, విరాళాలు పంపాల్సిన చిరునామా :

అరసవిల్లి క్రిష్ణ, 6-1/16-7A/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001

చెక్‌లు/డ్రాఫ్టులు/ఆన్‌లైన్‌లో పంపడానికి :

A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714, Branch : Vagu Center, Vijaywada.

If undelivered please return to:
ARUNATAARA
6-1/16-7A/1, Peddiraju Street
Prizer peta, Vijayawada - 520 001
Andhrapradesh

TO
Mr/Mrs.

EDITED, PRINTED, PUBLISHED BY ARASAVILLI KRSIHNA AND OWNED BY DUVVURI VENKATA KRISHNA RAO. PRINTED AT VISALAANDHRA VIGNANA SAMITHI, CHANDRAM BUILDINGS, CHANDRA RAJESWARA RAO ROAD, MACHAVARAM (PO), VIJAYAWADA - 520 004, ANDHRAPRADESH STATE (New Declaration Filed), PUBLISHED AT 6-1/16-7A/I, PEDDIRAJU STREET, PRIZER PETA, VIJAYAWADA - 520 001, ANDHRAPRADESH STATE, EDITOR : ARASAVILLI KRISHNA

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M202
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	thasin
పరీక్ష చేసినది	sireesha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good